తెలుగు పాఠకుల దినపత్రిక
వార్త

ఆదివారం

నవంబరు 1, 2026

# పర్యావ'రణం'లో జీవన్మరణం !

# బుచ్చిబాబు దర్శకత్వంలో సూర్య?

'ఉప్పెన' సినిమాతో దర్శకుడిగా మంచి గుర్తింపు తెచ్చుకున్న బుచ్చిబాబు ఈ సంవత్సరం రామ్‌చరణ్ హీరోగా తెరకెక్కించిన 'పెద్ది' సినిమాతో ప్రేక్షకులను పలకరించారు. ఈ సినిమా తరువాత ఆయన ఎవరితో సినిమా చేస్తారనే విషయం గురించి అందరిలో ఆసక్తి ఏర్పడింది. ఇలా ఉండగా.. బుచ్చిబాబు మెగాస్టార్ చిరంజీవికి ఓ కథ

వినిపించారని, ఆ కథ ఆయనకు నచ్చిందని టాక్ వచ్చింది. ఇతర సినిమాలతో చిరంజీవి బిజీగా ఉండటం వల్ల ఈ ప్రాజెక్టుకు టైమ్ పడుతుందని సమాచారం. తమిళ హీరో సూర్యకు బుచ్చిబాబు ఓ కథ వినిపించినట్లు తాజా సమాచారం. ఈ సినిమా పూర్తి భిన్నమైన కథాంశంతో, పవర్‌ఫుల్ యాక్షన్ డ్రామాగా ఉంటుందని తెలుస్తోంది. మైత్రీ మూవీ మేకర్స్ ఈ ప్రాజెక్టును నిర్మించనున్నట్లు టాక్ వినిపిస్తోంది. అయితే చిరంజీవి, సూర్యలకు చెప్పిన కథలు వేరు వేరు అని వినికిడి. బుచ్చిబాబు తరువాత సినిమా చిరంజీవితోనా, సూర్యతోనా అని ఆసక్తికరంగా మారింది.

తారాతీరం

# కార్తీ కొత్త సినిమా?

కోలీవుడ్ టాలెంటెడ్ హీరో కార్తీ నుంచి రీసెంట్‌గా వచ్చిన 'సర్దార్ 2' భారీ డిజాస్టర్ అయ్యిన సంగతి తెలిసిందే. ఒక పక్క తన అన్నయ్య సూర్య మళ్ళీ ఫామ్‌లోకి వచ్చేసాడు. పైగా టాలీవుడ్ దర్శకులతో కూడా వర్క్ చేస్తుండగా కార్తీ కూడా ఓ తెలుగు దర్శకునితో ఓ చిత్రం రీసెంట్‌గా స్టార్ట్ చేసాడు. మ్యాడ్ సిరీస్‌తో వరుస సూపర్ హిట్స్ ఇచ్చిన దర్శకుడు కళ్యాణ్ శంకర్ కలయికలో ఇటీవల ఓ సాలిడ్ ఎంటర్టైనర్ అనౌన్స్ అయిన సంగతి తెలిసిందే.

అయితే ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా పూర్తయిపోతున్నట్లు తెలుస్తుంది. ఎలాంటి చప్పుడు లేకుండా దర్శకుడు కళ్యాణ్ శంకర్ ఆల్రెడీ రెండు షెడ్యూల్స్ పూర్తి చేసేసి మూడో షెడ్యూల్‌కి కూడా రంగం సిద్ధం చేస్తున్నట్టు తెలుస్తోంది.

తెలుగు, తమిళంలో ఏకకాలంలో చేస్తున్న ఈ ఎంటర్టైనర్‌లో మీనాక్షి చౌదరి హీరోయిన్‌గా నటిస్తుండగా సితార ఎంటర్టైన్‌మెంట్స్ నిర్మాణం వహిస్తున్న సంగతి విదితమే.

# 'ఎల్లమ్మ' మార్చిలో విడుదల!

పాన్ ఇండియా రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా నటిస్తున్న బిగ్ ప్రాజెక్ట్‌లలో దర్శకుడు సందీప్ రెడ్డి వంగతో చేస్తున్న సినిమా 'స్పిరిట్' తెలిసిందే. అయితే సినిమా మొదట అనుకున్న డేట్ మార్చి 5న అనౌన్స్ చేసిన సంగతి తెలిసిందే. కానీ మేకర్స్ లేటెస్ట్‌గా ఈ తేదీ నుంచి వచ్చే ఏడాది దీపావళికి వాయిదా వేసినట్లు తెలుస్తోంది. దీనితో మార్చి 5 స్లాట్ ఖాళీ కావడంతో ఈ బిగ్ డేట్‌లో దేవిశ్రీ ప్రసాద్, దిల్ రాజులు కర్చీఫ్ వేశారు. దేవిశ్రీ ప్రసాద్ హీరోగా పరిచయం అవుతూ 'బలగం' దర్శకుడు వేణు యెల్దండి తెరకెక్కిస్తున్న రూటెడ్ రస్టిక్ డ్రామా 'ఎల్లమ్మ' పై మంచి అంచనాలు ఉన్నాయి.

పాన్ ఇండియా లెవెల్లో ప్లాన్ చేస్తున్న ఈ క్రేజీ ప్రాజెక్ట్ రిలీజ్‌నే ఇప్పుడు మేకర్స్ ఆ రోజుకి లాక్ చేసినట్లు తెలుస్తోంది. సో.. 'స్పిరిట్' తప్పుకున్నా ప్రేక్షకుల కోసం మరో సాలిడ్ ట్రీట్ బిగ్ స్క్రీన్స్ పై రాబోతుంది అని చెప్పొచ్చు. ఇక ఈ చిత్రానికి దేవిశ్రీ ప్రసాద్ స్వీయ సంగీతం అందిస్తుండగా పాన్ ఇండియా భాషల్లో గ్రాండ్‌గా విడుదల చేయబోతున్నారు.

ఆదివారం వార్త

1 నవంబరు, 2026

## కదంబం

'సంఘీ'భావం....5

ఎల్‌నినోతో పంటలకు ఎండదెబ్బ

కవర్ స్టోరీ..6

పర్యావ'రణం'లో జీవన్మరణం!

ఈ వారం కవిత్వం.. 11

చిత్తశుద్ధి

ప్లేటు చిన్నదే.. ముప్పు.. 13

కథ..18

ఆ నలుగురు..

కన్నడ దేశంలో ఉన్నా... 20

ఆలయాలకు నిలయం.. 23

ఇంకా...

మొగ్గ

పుస్తక సమీక్ష

వాస్తు

వారఫలం

వగైరా.. వగైరా..

### మంచి ముత్యాలు

- పుస్తకాలు జీవితాన్ని సమగ్రంగా దర్శింపజేసే సాధనాలు.
- పేరు ప్రతిష్ఠలు సంపాదించినవారికి మరణం ఉండదు.
- పోటీని ఎప్పుడూ తక్కువగా అంచనా వేయకూడదు.

# సమాచారం

## ఇథియోపియా క్యాలెండర్ ప్రత్యేకం

సాధారణంగా ఏడాదికి 12 నెలలే ఉంటాయని మనకు తెలుసు. జనవరి నుంచి డిసెంబరు వరకు. ఇదే లెక్కను ప్రపంచంలోని చాలా దేశాలు అనుసరిస్తాయి. కానీ ఆఫ్రికాలోని ఇథియోపియాలో మాత్రం క్యాలెండర్ లెక్కే ప్రత్యేకం. అక్కడ ఏడాదికి 13 నెలలు ఉంటాయి. అంతేకాదు.. ప్రపంచ దేశాల క్యాలెండర్‌తో పోలిస్తే అక్కడి సంవత్సరం సుమారు ఏడెనిమిదేళ్లు వెనుకబడి ఉంటుంది. శతాబ్దాల చరిత్ర కలిగిన ఈ ప్రత్యేక క్యాలెండర్ ఇప్పటికీ అక్కడి ప్రజల జీవితంలో భాగంగా కొనసాగుతోంది.

**30 రోజులే.. 12 నెలలు!** ఇథియోపియా క్యాలెండర్‌ను గీజ్ క్యాలెండర్ అని కూడా పిలుస్తారు. ఇందులో మొదటి 12 నెలలకు ఒక్కో నెలలో సరిగ్గా 30 రోజులే ఉంటాయి. అంటే ఈ 12 నెలల్లో మొత్తం 360 రోజులు. మిగిలిన రోజులను 13వ నెలలో సర్దుబాటు చేస్తారు. ఆ నెల పేరే పగుమే. సాధారణ సంవత్సరంలో దీనికి ఐదు రోజులు ఉంటాయి. లీపు సంవత్సరంలో ఆరు రోజులు వస్తాయి. ఇలా ఏడాదికి 365 లేదా 366 రోజులు పూర్తవుతాయి.

**సెప్టెంబరులోనే కొత్త సంవత్సరం** గ్రెగోరియన్ క్యాలెండర్‌లో జనవరి 1న కొత్త సంవత్సరం ప్రారంభమవుతుంది. ఇథియోపియాలో మాత్రం సెప్టెంబ రులో నూతన సంవత్సర వేడుకలు జరుగుతాయి. వీటిని 'ఎంకుటాటాష్' అని పిలుస్తారు. సాధారణంగా సెప్టెంబరు 11న కొత్త సంవత్సరం ప్రారంభమవుతుంది. కొన్నిసార్లు సెప్టెంబరు 12న వస్తుంది.

**నెలల పేర్లూ ప్రత్యేకమే!** ఇథియోపియా క్యాలెండర్‌లో మెస్కెరెమ్, టికిమ్ట్, హిదార్, తహ్సస్, తిర్, యెకాటిట్, మెగాబిట్, మియాజ్యా, గిన్‌బోట్, సెనె, హమ్లె, నెహాసె అనే 12 నెలలు ఉంటాయి. చివరగా పగుమే వస్తుంది. ఈ నెలల పేర్లు ఆ దేశ చరిత్ర, సంస్కృతిని ప్రతిబింబిస్తాయి. ఇథియోపియా క్యాలెండర్‌లో సంవత్సరం సంఖ్య కూడా భిన్నంగా ఉంటుంది. క్రీస్తు జనన సంవత్సరాన్ని లెక్కించే విధానంలో ఉన్న చారిత్రక వ్యత్యాసాల వల్ల ఈ తేడా ఏర్పడింది. అందుకే గ్రెగోరియన్ క్యాలెండర్ ప్రకారం 2026 నడుస్తుంటే, ఇథియోపియా క్యాలెండర్‌లో తేదీని బట్టి 2018 లేదా 2019 ఉంటుంది. అంతర్జాతీయ వ్యవహారాల్లో గ్రెగోరియన్ క్యాలెండర్‌ను ఉపయోగిస్తున్నా సంప్రదాయ వేడుకలు, రోజువారీ జీవితంలో ఇథియోపియా క్యాలెండర్‌కు ప్రత్యేక స్థానం ఉంది.

**మీ రచనల్ని ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు.**

sunmagvaartha@gmail.com

## ఆరు దంతాలు

రాజు: ప్రాక్టీస్ ఎలా ఉందిరా అన్నాడు దంత వైద్యుడైన సాగర్‌తో.

సాగర్: ఉమెన్స్ కాలేజీ దగ్గరుండడం వలన చాలా మేలు జరిగిందిరా. నా ప్రాక్టీస్ ఇప్పుడు మూడు చెప్పులు, ఆరు పళ్లుగా ఉందిరా అన్నాడు రాజుతో.

రాజు: ??????

## ఇష్టమైంది..?

రాజేష్, రజని పార్క్‌లో కూర్చుని పిచ్చాపాటీ మాట్లాడుకుంటున్నారు.

రజని కళ్లుమూసుకొని నీకు ఇష్టమైంది

తీసుకో అంది, రాజేష్‌తో.

రాజేష్ వెంటనే ఆమె హ్యాండ్ బ్యాగ్‌లోని ఏ.టి.ఎం. కార్డు తీసుకున్నాడు.

## గోళ్లు పెరిగితే..!

పేషంట్: డాక్టర్, ఒళ్ళంతా ఒకటే దురద.. మందులు రాసివ్వండి.

డాక్టర్: ఈ మందు వాడండి.

పేషంట్: ఈ మందు వాడితే తగ్గిపోతుందా?

డాక్టర్: గోళ్లు బాగా పెరుగుతాయి, ఎంచక్కా గోక్కోవచ్చు.

పేషంట్: ???? ?

## ఐరన్ తినొచ్చా మరి..!

ఓ పల్లెటూరి వ్యక్తి డాక్టర్ దగ్గరికి వెళ్ళాడు.

డాక్టర్ అన్ని పరీక్షలు చేసి "కొంచం ఐరన్ తక్కువుంది. మందులు రాసిస్తా వాడుకో.." అన్నాడు.

"రోజూ కొంచెం ఐరన్ తినమంటారా?" అన్నాడు, ఆ పల్లెటూరు వ్యక్తి.

డాక్టర్: ?????

## ఇష్టమైంది..?

పూర్వం ఒక నాటకాల కంపెనీ వాళ్ళు ఊరూరు తిరిగి నాటక ప్రదర్శనలు ఇచ్చేవారు. ఒకరోజు ఒక ఊరిలో నాటక ప్రదర్శన ఇవ్వడానికి ఏర్పాటు చేసుకున్నారు. తీరా నాటకం మొదలయ్యే సమయానికి రాజు పాత్రదారికి జబ్బు చేసింది... నాటకం ఆగిపోతుందని.

మేనేజర్ సతమతమవుతున్నాడు. అందరు కలిసి చివరకు ఎలాగో ఒక వ్యక్తిని పట్టుకొచ్చారు.

ఆ వ్యక్తికి వేషం వేసి నాటకం ప్రారంభించారు. ఐతే అక్కడ సన్నివేశం ఏమిటంటే రాజు ముందు భటులు ఒక దోషిని ప్రవేశపెడతారు.

రాజు ఆ దోషిని ఉద్దేశించి "ఓరి, క్రూరుడా!" అని కత్తి దూయాలి.

రాజు పాత్రధారి వెంటనే "పూరి, కూరా!" అని అన్నాడు.

ఇక చెప్పేదేముంది.. నాటకం మొత్తం రసాభాస అయింది. (అసలు సంగతేమిటంటే రాజు పాత్రధారి ఓ హోటల్లో సర్వర్‌గా పని చేస్తున్నాడు)

– రవీందర్ రావు.పి

## భలే డాక్టర్!

రాము: ఈ డాక్టరుగారు భలే డాక్టరుగారు.

శ్యాము: ఏమయింది?

రాము: ఈ టాబ్లెట్లకి సైడ్ ఎఫెక్ట్స్ రావా డాక్టరుగారూ అని అడిగాను.

శ్యాము: డాక్టర్ ఏమన్నారు?

రాము: సైడ్లు కట్ చేసుకొని వేసుకో, అప్పుడు సైడ్ ఎఫెక్టులు రావు అన్నారు.

శ్యాము: ఆ..... !?

– మా. శ్రీ. రాజు, పాల్వంచ

## విశ్రాంతి

"డాక్టర్ నన్ను కొద్ది రోజులు విశ్రాంతి తీసుకోమని చెప్పాడు, అందుకని నేను మా పుట్టింటికి వెళ్దామని అనుకుంటున్నాను" అన్నాడు భార్యతో, భర్త.

"అదే డాక్టర్‌తో నాతోనూ చెప్పాడు, మీకు కావాల్సిన విశ్రాంతి ఇంటి మన ఇంట్లోనూ దొరుకుతుందని.." గడుసుగా సమాధానమిచ్చింది భార్యామణి.

## మౌనంగా ఉంటే..!

"నా దగ్గర నీకు బాగా నచ్చే విషయం ఏమిటి?" అడిగాడు భర్త, భార్యను.

"మీరు కామ్‌గా ఉన్నప్పుడు నాకు బాగా నచ్చుతారు.." అంది భార్య.

"మరి.... మరి...నేను మాట్లాడినప్పుడు..?"

"అప్పుడు ముందు విషయం(మౌనంగా) వున్న విషయం నాకు ఇంకా... ఇంకా బాగా నచ్చుతుంది.

## అనుభవం

"నువ్వు నన్ను పెళ్లి చేసుకున్న తరువాత ఏమి నేర్చుకున్నావు?" అడిగాడు భర్త, భార్యను.

"మంచి అనుభవం" అంది భార్య.

"ఎలాంటి అనుభవం?"

"ఇంకోసారి ఇలాంటి పొరపాటు చేయకూడదని..!" అంది భార్య.

## సరదా రచనలకు ఆహ్వానం

**జోక్స్, ప్యారడీ పాటలు, సరదా అనుభవాలు, పంచ్ డైలాగులు.. వగైరాలు పంపితే పరిశీలించి, బాగుంటే ప్రచురిస్తాం. దయచేసి కాపీ రచనలు పంపకండి.**

**మీ రచనలు పంపించవలసిన చిరునామా: నవ్వుల్:.. రువ్వుల్, ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్‌బండ్, హైదరాబాద్-500 080**

***sunmagvaartha@gmail.com***

# 'సంఘీ' భావం

## ఎల్‌నినోతో పంటలకు ఎండదెబ్బ

ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గి ఉష్ణోగ్రతలు పెరగడంతో వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ముఖ్యంగా వర్షాధార వ్యవసాయంపై ఆధారపడే రైతులకు కష్టాలు ఎదుర్కొంటున్నారు. నేలలో తేమ తగ్గడం, భూగర్భ జలాలు అడుగంటడం, సాగునీటి వనరుల్లో నీటి నిల్వలు తగ్గడం వంటి పరిస్థితులు పంటల దిగుబడిపై తీవ్రప్రభావం చూపుతున్నాయి. ముఖ్యంగా వరి, పత్తి, మొక్కజొన్న, వేరుశనగ, సోయాబీన్, కంది, పెసర, మినుము వంటి పంటలు వర్షాభావ పరిస్థితుల్లో నష్టపోయే ప్రమాదం ఉంది. పూత, కాయలు ఏర్పడే దశల్లో నీటి కొరత పరిస్థితులు ఆందోళన కలిగిస్తున్నాయి.

వరి సాగులో నీటి లభ్యత తగ్గితే పంట ఎదుగుదల మందగించడంతో పాటు గింజల నాణ్యత, దిగుబడిపై ప్రభావం పడుతుంది. మొక్కజొన్నలో పూత సమయంలో అధిక ఉష్ణోగ్రతలు, తేమ కొరత ఏర్పడితే కంకుల్లో గింజల సంఖ్య తగ్గే అవకాశం ఉంది. పత్తి పంటలో దీర్ఘకాలిక వర్షాభావం కారణంగా పూత, కాయలు రాలడం, కాయల పెరుగుదల తగ్గడం వంటి సమస్యలు తలెత్తవచ్చు. వేరుశనగలో కాయలు ఏర్పడే సమయంలో నేలలో తేమ సరిపడా లేకపోతే దిగుబడులు తగ్గుతాయి.

పప్పుధాన్యాలైన కంది, పెసర, మినుము పంటలు కూడా తీవ్ర వర్షాభావ పరిస్థితుల్లో దెబ్బతినే అవకాశం ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో రాయలసీమ, తెలంగాణలో వర్షాధార వ్యవసాయం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో వర్షపాతం లోటు ఏర్పడితే రైతులకు ఇబ్బందులు పెరిగే అవకాశం ఉంది. ఇప్పటికే సాగు ఖర్చులు, విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల ధరలతో సతమతమవుతున్న రైతులకు వాతావరణ అనిశ్చితి మరో సవాలుగా మారింది.

రైతులు పంటల ఎంపికలో నీటి లభ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని వ్యవసాయ నిపుణులు సూచిస్తున్నారు. వర్షాలు ఆలస్యమయ్యే ప్రాంతాల్లో స్థానిక వ్యవసాయ శాఖ సలహా మేరకు విత్తనాలు వేయడం, నేలలో తేమను కాపాడే పద్ధతులు పాటించడం, నీటిని పొదుపుగా వినియోగించడం అవసరమని చెబుతున్నారు. బిందుసేద్యం, తుంపర సేద్యం అందుబాటులో ఉన్నచోట్ల వాటిని వినియోగించడం ద్వారా నీటి వినియోగాన్ని తగ్గించవచ్చు.

ఎల్‌నినో ప్రభావం ఎంత తీవ్రంగా ఉంటుందో అంచనా వేయడానికి వాతావరణ శాఖ తాజా సూచనలు, వర్షపాతం వివరాలు, సాగునీటి వనరుల పరిస్థితిని నిరంతరం పరిశీలించాల్సి ఉంటుంది. ముందస్తు ప్రణాళిక, పంటల వైవిధ్యం, నీటి నిర్వహణతో నష్టాలను కొంతవరకు తగ్గించుకోవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో పంటల నష్టం, తేమ ఒత్తిడి, దిగుబడుల తగ్గుదలపై రైతుల్లో ఆందోళన కనిపిస్తోంది. ఇప్పటికే రైతులు సాగు విషయంలో అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం అందించిన నివేదికల ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లో 2,44,443 హెక్టార్ల విస్తీర్ణంలో పంటలకు వివిధ స్థాయుల్లో నష్టం లేదా తేమ ఒత్తిడి నమోదైనట్లు సమాచారం. ఇది సుమారు 6.04 లక్షల ఎకరాలకు సమానం.

ఆంధ్రప్రదేశ్‌లోని నివేదిక ప్రకారం 10,582 హెక్టార్లలో, అంటే సుమారు 26,140 ఎకరాల్లో పంటలు పూర్తిగా ఎండిపోయినట్లు పేర్కొన్నారు. మరో 1,92,387 హెక్టార్లలో తేమ ఒత్తిడి, 41,474 హెక్టార్లలో పంటలు వాడిపోవడం నమోదైనట్లు సమాచారం. తెలంగాణలో పత్తి, వరి పంటల దిగుబడులపై వాతావరణ పరిస్థితుల ప్రభావం చూపుతోంది. ఒక నివేదికలో 8.93 లక్షల ఎకరాల పత్తి, 1.20 లక్షల ఎకరాల వరి పంటలపై దిగుబడి తగ్గుదల ప్రమాదాన్ని ప్రస్తావించారు.

వరి, పత్తి, మొక్కజొన్న, వేరుశనగ, పప్పుధాన్యాలు వంటి పంటల్లో పూత, కాయలు లేదా గింజలు ఏర్పడే దశల్లో నీటి కొరత ఏర్పడితే దిగుబడులు తగ్గే ప్రమాదం ఉంది. ముఖ్యంగా వర్షాధార వ్యవసాయంపై ఆధారపడే ప్రాంతాల్లో నేలలో తేమ తగ్గడం రైతులకు సమస్యగా మారింది. పంట నష్టాన్ని అంచనా వేసేందుకు వ్యవసాయ శాఖలు క్షేత్రస్థాయి పరిశీలనలు నిర్వహించి, పంటల వారీగా వివరాలను వెల్లడించాల్సిన అవసరం ఉంది. రైతులు కూడా వాతావరణ శాఖ సూచనలు, స్థానిక వ్యవసాయ అధికారుల సలహాల మేరకు నీటి నిర్వహణ, పంట సంరక్షణ చర్యలు చేపట్టాలని నిపుణులు సూచిస్తున్నారు. రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు, వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు ఇప్పటికే పలు హెచ్చరికలు చేశారు. ఎక్కువ శాతం నీటితో అవసరమైన పంటలను వేయకపోవడమే ఉత్తమమని వారు సూచిస్తున్నారు.వర్షాకాలం ముగిసి చలికాలంలోకి ప్రవేశించినా ఆశించిన మేరకు వర్షాలు కురియలేదు. ప్రతి సంవత్సరం సర్వసాధారణంగా వచ్చే తుఫానులు కూడా ఈసారి ఉండబోవని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. దీనితో వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు సాగు చేయాల్సిన అవసరం ఉంది. అదేవిధంగా నష్టపోయిన రైతులకు తగిన ఆర్థిక సహాయం చేయడానికి ప్రభుత్వాలు ముందుకు రావాల్సిన అవసరం ఉంది.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ

# పర్యావ'రణం'లో జీవన్మరణం!

కవర్‌స్టోరీ

సత్తిరాజు సుంకవల్లి

ఎక్కడ పోగొట్టుకున్నామో, అక్కడే వెతుక్కోవాలనే ఆర్యోక్తి నిత్యసత్యం. వ్యాధికి గల మూల కారణం తెలుసుకోకుండా చికిత్స చేస్తే ఆరోగ్యం వికటిస్తుంది. పైపై లేపనాల వలన రోగం తగ్గదు. అలాగే ఈ భూమిపై నివసిస్తున్న మనం నేడు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నాం. వీటికి గల కారణాలను తెలుసుకుని, నివారణోపాయాలను చేపట్టకుండా తూ.తూ మంత్రంగా తాత్కాలిక కార్యక్రమాలను చేపట్టడం వలన ఫలితం శూన్యమని గ్రహించాలి.

మనం నివసిస్తున్న భూతలం అగ్నిగోళంలా ఎందుకు మారింది? ప్రకృతి, పర్యావరణం ఎందుకింత కాలుష్య భరితంగా మారిపోయాయి? అనే అంశాలపై లోతైన పరిశీలన అవసరం. మన చుట్టూ ఉన్న వాతావరణం అవాంఛనీయ రసాయనాలతో నింపబడి కాలుష్యం బారిన పడడం వలన, వాతావరణంలో విష రసాయనిక వాయువుల చేరడం వలన, జల, వాయు కాలుష్యం వలన పర్యావరణం దెబ్బతింటున్నది. కాలుష్యం పెరగడం వలన తలెత్తుతున్న సమస్యలను పట్టించుకోకుండా, కాలుష్య నివారణ చర్యలు చేపట్టకుండా, మానవాళి మనుగడ సాగించడం దుర్లభం. మానవాళితో పాటు ఇతర జీవరాశుల అస్థిత్వం కొనసాగితేనే భూగ్రహం పదికాలాల పాటు నివాస యోగ్యంగా ఉంటుంది. స్వచ్ఛమైన గాలి, నీరు మన కనీస హక్కుగా పరిగణించాలి. 15 సంవత్సరాల వయసులోనే స్వీడన్‌కు చెందిన గ్రేటా థన్ బర్గ్ పరిశుభ్రమైన వాతావరణం కోసం, కాలుష్య రహితమైన పర్యావరణం కోసం ప్రపంచ దేశాల అగ్రనేతలను నిలదీసి ప్రశ్నించడమే కాకుండా కాలుష్య రహితమైన వాతావరణం కోసం, భావితరాల కోసం స్వీడన్‌లో పాఠశాల విద్యార్థులను సమ్మెకు ప్రోత్సహించి, ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందారు. అమెరికాకు చెందిన రాచెల్ కార్సన్, భారత్‌కు చెందిన సుందర్ లాల్ బహుగుణ, మేధా పాట్కర్ వంటి పర్యావరణ హితైషులు ప్రజా శ్రేయస్సు కోసం ఎంతగానో పాటుబడ్డారు. యునైటెడ్ నేషన్స్ ఎన్విరాన్‌మెంట్ ప్రోగ్రామ్‌తో పాటుగా, వరల్డ్ వైడ్ ఫండ్ ఫర్ నేచర్, ఎర్త్ డే నెట్‌వర్క్ వంటి అనేక సంస్థలు కాలుష్య రహిత సమాజం కోసం విశేష కృషి చేస్తున్నాయి.

## కాలుష్య భరితం ధరాతలం

కొంతకాలం తర్వాత ఈ భూమిపై ప్రాణవాయువు కొరత ఏర్పడుతుందని, నీటి లభ్యత దుర్లభమవుతుందని, ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరిగిపోతాయని, తత్ఫలితంగా జీవరాశుల ఉనికి భూమిపై అంతర్ధానమవుతుందని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. ఇది అతిశయోక్తి కాదు. ఇప్పటికే ఇలాంటి పరిస్థితులను చవిచూస్తున్నాం. నగరాలు కాలుష్యానికి కేరాఫ్ అడ్రస్‌గా మారిపోతున్నాయి. కాలుష్యం వలన మనం పీల్చే గాలిలో నాణ్యత తగ్గిపోయింది. మారుతున్న పర్యావరణ, వాతావరణ పరిస్థితులు అత్యంత ఆందోళనకరంగా ఉంటున్నాయి. ఎల్‌నినో ప్రభావాన్ని చవిచూస్తున్నాం. ఇలాంటి పరిస్థితులను చక్కదిద్దకుండా ప్రపంచం ఆధిపత్య భావజాలం వైపు, యుద్ధాల వైపు పయనించడం శ్రేయస్కరం కాదు. ఆకలి, దరిద్రం, నిరక్షరాస్యత, నిరుద్యోగం, పారిశుధ్య లోపం, తాగునీటి సమస్య, కాలుష్యం, పర్యావరణ విధ్వంసం, వాతావరణ మార్పులు, ఆకస్మిక ప్రళయాలు, ప్రకృతి విలయాలు, యుద్ధాలు ఇత్యాది సమస్యలతో ప్రపంచ మానవాళి కొట్టుమిట్టాడుతున్నది.

కాలుష్యాన్ని అరికట్టకుండా కాలం వెళ్ళదీయడం బాధ్యతారాహిత్యం. ప్రపంచాన్ని జలకాలుష్యం, వాయు కాలుష్యం పట్టిపీడిస్తున్నాయి. చైనా, ఇండియా, బంగ్లాదేశ్, నేపాల్ తదితర దేశాల్లో వాయుకాలుష్యం విపరీతంగా పెరుగుతున్నది. ఉక్రెయిన్, గాజా, కాంగో దేశాల ప్రజలు వివిధ కారణాల వలన అనేక ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. వాయు కాలుష్యం మానవ ఆయుఃప్రమాణాన్ని అమాంతం తగ్గించేస్తున్నది. ప్రకృతిని పరిహసించి, పర్యావరణాన్ని హరించి భూతలంపై జీవ సమతుల్యాన్ని దెబ్బతీసిన మానవుడు తన వినాశనాన్ని తానే కొని తెచ్చుకోవడం విడ్డూరం.

## పర్యావరణంపై కాలుష్య ప్రభావం

పర్యావరణం దెబ్బతినడానికి కాలుష్యమే కారణం. పారిశ్రామీకరణ కూడా కాలుష్యానికి కారణం కావడం తగదు. ప్రపంచంతో పాటు భారత దేశం కూడా ప్రగతి పథంలో ముందుకు దూసుకుపోతున్నది. దేశంలో జనాభా విపరీతంగా పెరిగింది. కాలుష్యం కూడా అదే నిష్పత్తిలో పెరుగుతున్నది. కాలుష్యాన్ని అరికట్టకపోతే సంభవించే పరిణామాలు ఊహాతీతం. పూర్వకాలంలో ఇప్పుడున్న జనాభా లేదు. జన సాంద్రత తక్కువగా ఉండేది. శాస్త్ర విజ్ఞానం పెరిగింది. వైద్య సదుపాయాలు అందుబాటులోకి వచ్చాయి. మరణాల సంఖ్య తగ్గింది. జనాభా విపరీతంగా పెరిగింది. పెరిగిన జనాభాకు సరిపడా ఆహారోత్పత్తి జరగాలంటే వ్యవసాయంలో విప్లవాత్మక మార్పులు రావాలని శాస్త్రవేత్తలు, ప్రభుత్వాలు ఆలోచించాయి. అందుకు తగ్గట్టుగానే అధిక దిగుబడుల కోసం ఎరువులు, రసాయనాలు విరివిగా వాడుతున్నాం. వ్యవసాయం, పాడి

పరిశ్రమలతో పాటుగా ప్రజలకు ఉపాధి కల్పన కోసం అత్యంత వేగవంతంగా పారిశ్రామీకరణ జరిగింది. పారిశ్రామీకరణ వలన ఉపాధి అవకాశాలు పెరిగాయి. ఇదే సందర్భంలో పరిశ్రమల వలన కాలుష్యం పెరిగింది. పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు గాలికి వదిలేయడం వలన అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. ఎంతో మంది ప్రజలు మృత్యువాత పడుతున్నారు. పర్యావరణ విధ్వంసం వలన అనేక జీవరాశులు అంతర్ధానమై పోతున్నాయి. జీవవైవిధ్యం నశించి, అంతిమంగా మానవాళి మనుగడ ప్రశ్నార్థకమయ్యే ప్రమాదం పొంచి ఉంది. ప్రకృతి విపత్తులన్నీ చాలా వరకు మానవ తప్పిదాల కారణంగానే సంభవిస్తున్నాయి. వరదలు, భూకంపాలు, తుఫానులు, సునామీలు మొ॥ సహజ విపత్తులు. అతివృష్టి వలన వరదలు సంభవించడం, ప్రజా జీవితాన్ని స్తంభింపచేయడం, అనావృష్టి వలన పంటలన్నీ ఎండిపోయి, ఆహారోత్పత్తి దెబ్బతినడం తాగడానికే నీరు లేక కటకట లాడడం మనం చూస్తున్నాం. వీటన్నింటినీ విపత్తులుగా పేర్కొనవచ్చు.

మానవ జీవితాలను అతలాకుతలం చేసే ఇలాంటి ప్రమాదాలన్నీ సాధారణ స్థాయిని దాటి తీవ్రమైన స్థితికి చేరడం వలన విపరీతమైన ప్రాణనష్టం జరుగుతున్నది. ప్రకృతి వైపరీత్యాల్లో వాతావరణ పర్యావరణ, సంబంధమైన అంశాలు మిళితమై ఉన్నాయి. ప్రస్తుతం ఏర్పడుతున్న వైపరీత్యాల్లో మానవ ప్రేరిత వైపరీత్యాలదే సింహభాగం. ప్రకృతి విలయాలతో జనజీవనం అస్తవ్యస్తమౌతున్న నేపథ్యంలో పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన చర్యలు తీసుకోవలసిన అవసరం ఉంది. కాలుష్యాన్ని అరికట్టి, పర్యావరణ పరిరక్షణపై దృష్టి సారించకపోతే ఇప్పటికే ప్రమాదపు అంచున ఉన్న ప్రపంచ మానవాళి తన మనుగడను కోల్పోయే ప్రమాదం ఉంది. పచ్చదనాన్ని పెంచి, పర్యావరణాన్ని పరిరక్షించడం లోనే సకల మానవాళి క్షేమంగా మనుగడ సాగించగలదు. పచ్చదనం ప్రాధాన్యత చాటి చెప్పాలి. ఒక వైపు మొక్కల పెంపకం ఆవశ్యకత గురించి చెబుతూనే, మరొక వైపు చెట్లను నరకడం పరిహాసప్రాయమవుతున్నది. ఐక్యరాజ్య సమితితో పాటు పలు అంతర్జాతీయ సంస్థలు పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కుబడి ప్రణాళికలు కాకుండా సమర్థవంతమైన చర్యలు చేపట్టాలి. ప్రపంచ దేశాలన్నీ పర్యావరణం గురించి, పచ్చదనం ఆవశ్యకత గురించి పదే పదే చెబుతూనే ఉన్నా, అవన్నీ కేవలం మాటల వరకే పరిమితమవుతున్నాయి.

పర్యావరణ సంరక్షణ సమిష్టి బాధ్యత. దేశంలోను, ప్రపంచంలో తలెత్తే పలు అనారోగ్య సమస్యలకు పెరుగుతున్న కాలుష్యం, పర్యావరణ విధ్వంసమే మూలకారణం. పర్యావరణ ఆరోగ్యం మానవాళికి శ్రీరామరక్ష. సహజ సిద్ధమైన ప్రకృతిని కాలుష్యం నుండి పదిలంగా కాపాడుకుని, పర్యావరణాన్ని పరిరక్షించుకుంటే ప్రజల ఆరోగ్యం మెరుగు పడుతుంది. పర్యావరణానికి, ఆరోగ్యానికి అవినాభావ సంబంధం ఉంది. పర్యావరణాన్ని పరిరక్షించకపోతే మానవాళి పలు రోగాలతో అంతరించే ప్రమాదముంది.

ఈ భూ ప్రపంచంలో మానవ మనుగడ కొనసాగించాలంటే పచ్చదనాన్ని పరిరక్షించుకోవాలి. స్వార్థ ప్రయోజనాల కోసం చెట్లను నరకడం మానుకోవాలి. వృక్షజాతిని పెంపొందించాలి. మొక్కలను నాటే కార్యక్రమాన్ని దేశభక్తితో ముడిపెట్టాలి. అప్పటివరకూ మొక్కలు నాటే కార్యక్రమం ఊపందుకోదు. చెట్లను పెంచడం వలన భూతాపం తగ్గుతుంది. వాయు కాలుష్యం తగ్గి మనం పీల్చే గాలిలో నాణ్యతా శాతం పెరుగుతుంది. అనారోగ్య సమస్యలు అరికట్టబడతాయి. వాతావరణం చక్కబడుతుంది. పచ్చని చెట్లను నరకడం వలన వాతావరణంలో సమతుల్యత దెబ్బతింటున్నది.

## దారి తప్పిన రుతురాగం
## తీవ్రమైన వర్షాభావం

రుతురాగాలు అపశృతులు పలుకుతున్నాయి. కాలాలు మారుతున్నాయి. రుతువులు దారి తప్పుతున్నాయి. ఒకే ఏడాదిలో రెండు వేసవి కాలాలు చవిచూస్తున్న విచిత్రమైన పరిస్థితులు ఈ ఏడాదిలో ఏర్పడ్డాయి. వివిధ రాష్ట్రాల్లోను తీవ్రమైన వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయి. పంటలు ఎండిపోతున్నాయి. చెట్లు మోడువారి పోతున్నాయి. వర్షం కోసం రైతులు కళ్ళు కాయలు కాచేలా ఎదురుచూస్తున్నారు. ఎంతకాలం కొనసాగుతుంది ఈ ఎల్‌నినో? ఇలాంటి వర్షాభావ పరిస్థితులు ఏర్పడడానికి మానవ తప్పిదాలు కారణం కాదా? ఒక్కసారి విశ్లేషణ జరపాలి. భూగర్భ జలాలను బయటకు తీసి విచ్చలవిడిగా వాడేస్తున్నాం ప్రకృతి లోని పచ్చని ప్రాకారాలను కూల్చేస్తున్నాం. కాలుష్యం ఎక్కువైనదని వాపోతున్నాం. వర్షాలు పడడం లేదని ఏడుస్తున్నాం. మన తప్పిదాలను కప్పి పుచ్చుకుని నిజాన్ని మరుగు పరుస్తున్నాం.

మన భూమిని ఉత్తర, దక్షిణార్ధ గోళాలుగా విభజించే భూమధ్యరేఖ ఒక ఊహరేఖ. సర్వసాధారణంగా ఈక్వేటర్‌కి దగ్గరలో ఉన్న భూభాగాల్లో ఎక్కువ వేడిగా ఉంటుంది. ఈ ఈక్వేటర్ ఫసిఫిక్, అట్లాంటిక్, హిందూ మహా సముద్రాల గుండా వెళుతుంది. ఈ సముద్రాల వద్ద సూర్యకిరణాలు నిటారుగా పడతాయి. దీని వలన ఈ సముద్ర జలాలు త్వరగా వేడెక్కుతాయి. ఇప్పుడు అదే జరుగుతున్నది. ఫసిఫిక్ సముద్ర జలాలు విపరీతంగా వేడెక్కాయి. ఈ కారణంగా ఎల్‌నినో ఏర్పడింది. ఎల్‌నినో అనేది ఒక స్పానిష్ పదం. ఎల్‌నినో త్వరలో తీవ్రమైన ఎల్‌నినోగా పరివర్తన చెందబోతున్నదని శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. ఇప్పటికే వర్షాలు లేక దేశంలోని పలు రాష్ట్రాలు తీవ్రమైన కరవును ఎదుర్కొంటున్నాయి. మన తెలుగు రాష్ట్రాలు ఇందుకు అతీతం కాదు.పలు ప్రాంతాల్లో వరి, వేరుశెనగ వంటి పంటలు ఇప్పటికే వర్షం లేక ఎండిపోయాయి. ఎల్‌నినో ప్రభావం వచ్చే ఏడాదిలో కూడా కొన్ని నెలలు కొనసాగవచ్చనే వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయి. టెక్నాలజీ ఎంతగా అభివృద్ధి చెందినా, ప్రకృతి బలీయమైనది. ప్రకృతిని కాదని మనం ఏమీ చేయలేం. ప్రస్తుతం కొనసాగుతున్న ఎల్‌నినో నుండి మనల్ని మనం ఎలా కాపాడుకోవాలో తెలుసుకోవాలి. భూమిని కాంక్రీటు కట్టడాలతో నింపేస్తున్నాం. చెట్లను నరికేస్తున్నాం. జీవవైవిధ్యాన్ని విధ్వంసం చేస్తున్నాం. సముద్రాలను ప్లాస్టిక్ అవశేషాలతో నింపేస్తున్నాం. ఈ

కారణంగానే ప్రకృతిలో అనేక అవాంఛనీయ పరిణామాలు సంభవిస్తున్నాయి. ఇకనైనా మేల్కొని మొక్కలను పెంచాలి. కాలుష్యాన్ని అరికట్టాలి. మానవ నివాసాల వద్ద, విద్యా సంస్థల వద్ద, పొలాల్లోను, పార్కుల వద్ద గ్రీనరీకి ప్రాధాన్యత నివ్వాలి. పార్కులను, గార్డెన్లను పచ్చదనానికి చిరునామాగా మార్చాలి. అప్పుడే కాలుష్యం తగ్గి గ్లోబల్ వార్మింగ్ తగ్గుముఖం పడుతుంది. ప్రకృతి కరుణిస్తుంది. వర్షాలతో భూమాత పులకరిస్తుంది. ఎక్కడైతే పచ్చదనం పరిఢవిల్లుతుందో అక్కడ వర్షపాతానికి లోటుండదు. పుడమిపై పచ్చదనం తాండవించిన నాడు ఇలాంటి ఎల్‌నినోలు, సూపర్ ఎల్‌నినోలు రుతుపవనాలకు అడ్డుకట్ట వేయలేవు. వర్షాన్ని ఆపలేవు. అందుకే ప్రకృతిని పరిరక్షించాలి. పచ్చని సంపదను పడమిపై ప్రతిష్టించి భూతలాన్ని కాలుష్య రహితంగా మార్చాలి.

## విధ్వంసమైన సహజ జీవన విధానం

సహజసిద్ధమైన జీవన విధానం వలన కాలుష్యానికి తావులేని ఆరోగ్యవంతమైన సమాజం నాటి తరాలు నూరేండ్ల జీవితానికి ఆలంబనగా నిలిచింది. అయితే నాటి రోజులు కాలగర్భంలో కలిసిపోయాయి. ఆధునిక నాగరికత వెర్రితలలు వేసింది. శాస్త్రీయ ఫలితాలు, సాంకేతిక విప్లవం దుర్వినియోగమై, సహజ సిద్ధమైన ప్రకృతిని విచ్ఛిన్నం చేసింది. ఈ కారణంగానే ఎక్కడ చూసినా రోగాలు ప్రబలిపోయాయి. ఇబ్బడి ముబ్బడిగా వెలసిన ఆసుపత్రులు, రోగులతో అనునిత్యం కిటకిటలాడుతున్నాయి. దీనికంతటికీ కారణం ఏమిటని అన్వేషిస్తే 'కాలుష్యం' సర్వాంతర్యామిలా అగుపిస్తుంది. హానికారకమైన వాయువులు, ఇతర అవాంఛనీయ పదార్థాలు పర్యావరణంలోకి చేరడాన్ని 'కాలుష్యం' అంటారు. సజీవ, నిర్జీవ వ్యవస్థల నాశనానికి హేతువు కాలుష్యం. సహజసిద్ధమైన వ్యవస్థ కలుషిత పదార్థాల చేరికతో ప్రమాదంగా మారే ప్రక్రియను కాలుష్యంగా నిర్వచించవచ్చు. మానవ తప్పిదాల వలన మన చుట్టూ ఉన్న ఘన, ద్రవ వాయు పదార్థాలు కాలుష్యభరితంగా మారుతున్నాయి. కాలుష్యానికి మానవ తప్పిదాలే చాలా వరకు కారణమవుతున్నాయి.

## కాలుష్యం వివిధ రకాలు

కాలుష్యం అనేక రకాలుగా విభజించబడింది. అందులో వాయు కాలుష్యం, నీటి కాలుష్యం, నేల కాలుష్యం, ధ్వని కాలుష్యం, ఉష్ణ కాలుష్యం, రేడియో ధార్మిక కాలుష్యం, ప్లాస్టిక్ కాలుష్యం మొదలైనవి. ఇవే కాకుండా ఇంకా ఎన్నో రకాల కాలుష్యాలతో పర్యావరణ వ్యవస్థ విచ్ఛిన్నమవుతున్నది. వాతావరణంలో అవాంఛనీయ పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి.

**నీటి కాలుష్యం:** భూగర్భ జలాలతో పాటు మనకు వివిధ రూపాల్లో అపారమైన నీటి వనరున్నాయి. సముద్రాలు, నదులు, చెరువులు, సరస్సులు, జలపాతాల వంటి నీటి వనరుల వలన అనేక ప్రయోజనాలు చేకూరుతున్నాయి. ఇప్పటికే కొన్ని దేశాల్లో నిర్లవణీకరణ (డీసాలినేషన్) ప్రక్రియ ద్వారా సముద్ర జలాల నుండి ఉప్పును వేరు చేసి, మంచి నీరుగా మార్చి తాగునీటికి, సాగునీటికి ఉపయోగించడం వలన నీటి కొరత సమస్య తీరుతున్నది. నీటిపై ఆధారపడి పలు జీవరాశులు మనుగడ సాగిస్తున్నాయి. నీటి వనరులు అదృశ్యమైతే జీవరాశుల మనుగడ ప్రశ్నార్థకం. కనుక నీటిని సక్రమంగా వినియోగించాలి. నీటిలో కలుషిత పదార్థాలు చేరడం వలన అనేక రోగాలు ప్రబలుతున్నాయి. మనం తాగే నీరు కాలుష్యభరితమై అనేక రోగాలకు కారణం కావడం దురదృష్టకరం. కలరా, టైఫాయిడ్, హెపటైటిస్ వంటి రోగాలే కాకుండా, పలు చర్మవ్యాధులకు కలుషితమైన జలం కారణభూతమవుతున్నది. కలుషితమైన నీటి వలన కిడ్నీ సంబంధిత సమస్యలు కూడా ఏర్పడుతున్నాయి. పరిశుభ్రమైన నీటిని అందరికీ అందుబాటులో ఉంచాలి. నీటి వ్యాపారాన్ని అరికట్టి, తాగునీటి లభ్యతకు మార్గం సుగమం చేయాలి.

**వాయు కాలుష్యం:** కార్బన్ డయాక్సైడ్, మిథేన్, నైట్రస్ ఆక్సైడ్, ఓజోన్, క్లోరోఫ్లోరో కార్బన్లు, హైడ్రో ఫ్లోరో కార్బన్లు, నీటి ఆవిరి మొదలైన వాటిని హరిత వాయువులుగా పేర్కొంటారు. ఇవన్నీ భూతలంపై ఉష్ణోగ్రతల పెంపునకు కారణమౌతాయి. పరిశ్రమల వలన, వాహనాల వలన ఇతర మానవ ప్రేరిత చర్యల వలన కార్బన్ డై ఆక్సైడ్ శాతం పెరుగుతూ వస్తున్నది. బొగ్గు, పెట్రోలియం ఉత్పత్తుల వినియోగం వలన కర్బన పదార్థాలు వాతావరణంలోకి ప్రవేశిస్తున్నాయి. గ్రీన్ హౌస్ వాయువుల పెరుగుదల వలన సముద్ర మట్టాలు పెరగడం, మంచు కరగడం వంటి పరిస్థితులు ఏర్పడుతున్నాయి. పెరిగిన ఉష్ణోగ్రతలు జీవరాశులపై ప్రతికూల ప్రభావం చూపిస్తున్నాయి. పర్యావరణంలోకి హానికరమైన వాయువులు చేరడం గ్లోబల్ వార్మింగ్‌కు కారణం.

భూ ఉపరితల ఉష్ణోగ్రతలు పెరగడం, సముద్ర జలాలు కలుషితం కావడం, సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు పెరగడం వలన వాతావరణంలో అనేక మార్పులు సంభవిస్తున్నాయి. ఇటీవలి కాలంలో సముద్ర జలాలు వేడెక్కడం వలన ఏర్పడుతున్న వాతావరణ మార్పులను గమనించాలి. పెరుగుతున్న కాలుష్యం ప్రకృతిలో సంభవించే ఉపద్రవాలకు కారణమవుతున్నది.

**ధ్వని కాలుష్యం:** పండుగల్లోను, శుభకార్యాల్లోను, ఇతర విందు, వినోద కార్యక్రమాల్లోను మితిమీరిన డెసిబుల్స్ శబ్దాలతో వినికిడి సమస్యలు ఏర్పడుతున్నాయి. మానసిక ఆరోగ్యంపై ధ్వని కాలుష్యం తీవ్రమైన ప్రభావం చూపెడుతున్నది. తీవ్రమైన శబ్దాల వలన ఎన్నో గుండెలు ఆగిపోతున్నాయి. ధ్వని కాలుష్యం వలన పలు జీవరాశులు ఇబ్బంది పడుతున్నాయి. పర్యావరణం కూడా దెబ్బతింటున్నది.

**ఉష్ణ కాలుష్యం:** ప్రకృతిలో సహజ సిద్ధమైన నీటి వనరులు అనేకం ఉన్నాయి. వీటి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. మానవ అవసరాలు నీటిని కలుషితంగా మారుస్తున్నాయి. మానవ చర్యల వలన నదులు, సరస్సులు, సముద్రాల్లో నీటి ఉష్ణోగ్రతలు పెరిగి అనేక ఆకస్మిక మార్పులు సంభవిస్తున్నాయి. దీనినే 'ఉష్ణ కాలుష్యం' అంటారు. ఈ కాలుష్యం వలన నీటిలో ఆక్సిజన్ పరిమాణం తగ్గి జల చరాల మనుగడకు ప్రమాదం ఏర్పడుతున్నది. పునరుత్పాదక శక్తి వనరులను ఉపయోగించడం, చెట్లను పెంచడం వంటి చర్యల ద్వారా ఉష్ణ కాలుష్య ప్రభావాన్ని తగ్గించవచ్చు.

## ప్లాస్టిక్ కాలుష్యం

ప్రతీ సంవత్సరం సుమారు 11 మిలియన్ మెట్రిక్ టన్నుల ప్లాస్టిక్ సముద్రాల్లో చేరుతున్నదని ఒక అంచనా. సుమారు 5 ట్రిలియన్ మెక్రో ప్లాస్టిక్ కణాలు సముద్ర జలాల్లో పేరుకుపోయాయి. సముద్రాలన్నీ ప్లాస్టిక్‌తో నిండిపోతున్నాయి. 250 మిలియన్ టన్నుల ప్లాస్టిక్ సముద్రాల్లోకి చేరుకుందని కొన్ని నివేదికలు సూచిస్తున్నాయి. సముద్ర ఉపరి తలాలపై కొద్ది శాతం మాత్రమే ప్లాస్టిక్ తేలుతుంటే, సముద్ర గర్భం మిలియన్ల టన్నుల కొద్దీ ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోయింది. ప్లాస్టిక్ కాలుష్యం ఇప్పటికే విపరీతమైన ప్రభావం చూపిస్తున్నది. ప్లాస్టిక్ వలన జల చరాల మనుగడకు ప్రాణసంకటం ఏర్పడింది. ప్లాస్టిక్ వాడకాన్ని సాధ్యమైనంత తొందరగా నిషేధించాలి. ప్రజలను ప్లాస్టిక్ వాడవద్దని చెప్పడం కంటే ప్లాస్టిక్ తయారీ యూనిట్లను ప్రభుత్వాలు మూసి వేయించాలి. ప్లాస్టిక్ కాలుష్యం 'గ్లోబల్ వార్మింగ్' సమస్యకు కారణమవుతున్నది.

## కోరలు చాచిన కాలుష్యం

కాలుష్యాన్ని నిర్ధారణ చేయడంలో కొన్ని సంస్థలు ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ (AQI)ని, మరికొన్ని సంస్థలు పార్టిక్యులేట్ మేటర్(PM)ను పరిగణనలోకి తీసుకుంటున్నాయి. PM 2.5, PM 10 వంటి కాలుష్య కారకాలను ఆధారంగా చేసుకుని అనేక సంస్థలు నివేదికలు తయారు చేస్తాయి. PM స్థాయి పెరిగితే అది గాలినాణ్యతలో గల లోపానికి నిదర్శనం. 151-200 స్థాయి ప్రమాదకరమైనదిగాను, 300 దాటితే అత్యంత ప్రమాదకరమైనదిగాను పేర్కొంటారు. PM 2.5 ఆరోగ్యాన్ని దెబ్బతీసే కాలుష్య కారకం. ఇది లక్షలాది మరణాలను దారితీస్తుంది. AQI 50 శాతం లోపు ఉంటే ఆరోగ్యకరం, 300 లేదా ఎక్కువ AQI నమోదయితే ప్రమాదకరం.

ఢిల్లీలో ఈ సంవత్సరం ప్రథమార్ధంలో గాలినాణ్యత బావున్నా, నవంబర్ నెలలో వివిధ కారణాల వలన AQI 495గా నమోదైనది. సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు (CPCB) నివేదిక ప్రకారం భారత్‌లో గ్రేటర్ నోయిడా అత్యంత కాలుష్య నగరంగా పరిగణింపబడుతున్నది. ఇక్కడ పీల్చే గాలి ప్రమాదకరంగా మారింది. PM 10 అధికంగా ఉండడమే ఇందుకు కారణం. దుమ్ము, నిర్మాణ వ్యర్థాలు, ఇతర కాలుష్య పదార్థాలు, పారిశ్రామిక వ్యర్థాలు కాలుష్యంగా మారి మానవ శరీరంలోకి ప్రవేశించి వివిధ అవయవాల్లోకి ప్రవేశించి, రోగాలకు నిలయంగా మారతాయి. పరిమాణంలో సూక్ష్మంగా ఉండే ఈ కాలుష్య కణాల వ్యాసం సుమారు 10 మైక్రోమీటర్లుగా నిర్ధారించారు. ఊపిరితిత్తులపై ప్రభావంపై చూపే ఈ సూక్ష్మమైన కాలుష్య కారకాలను పిఎమ్10గా పిలుస్తారు. గాలి నాణ్యతా లోపం వలన ప్రజలు శ్వాసకోశ, గుండె సంబంధిత రోగాలతో బాధపడుతున్నారు. ముజఫర్ నగర్, రోహతక్, ఢిల్లీ, మీరట్, ఘజియాబాద్ వంటి నగరాలు భయంకరమైన కాలుష్య కోరల్లో చిక్కుకున్నాయి. ఈ నగరాల్లో గాలిలో నాణ్యత బాగా తగ్గిపోయింది.

2026 నివేదికల ప్రకారం ఇండోనేషియా, ఇండియా, చైనా, పాకిస్తాన్ తదితర దేశాల్లోని పలు నగరాలు కాలుష్యం కోరల్లో చిక్కుకున్నాయి. ఢిల్లీ, గ్రేటర్ నోయిడా, ఘాజియాబాద్‌లు అత్యంత కాలుష్య నగరాలుగా మారాయి.

మనం పీల్చే గాలి సురక్షితంగా ఉండాలి. తాగే నీరు పరిశుభ్రంగా ఉండాలి. తినే ఆహారం కల్తీ కాకుండా చూడాలి. ప్రపంచాన్ని రక్షించడానికి, భావితరాలకు మంచి భవిష్యత్తును అందించడానికి పర్యావరణాన్ని పరిరక్షించాలి. వ్యర్థాలను అరికట్టాలి. పారిశుద్ధ్య సదుపాయాలు మెరుగు పరచాలి. వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. అభివృద్ధి పేరిట, పారిశ్రామీకరణ పేరిట, అవాంఛనీయ వాయువులను బాహ్య వాతావరణంలోకి వదిలేసి గాలిని, నీటిని దుర్గంధంగా మార్చేసి, రోగాల బారిన పడి, అత్యంత భారంగా జీవితాలను గడపవలసిన పరిస్థితులను మనమే కొనితెచ్చుకున్నాం.

కాలుష్యాన్ని అరికట్టడం, పరిమితికి మించిన హరిత వాయువులను వాతావరణంలోకి ప్రవేశించకుండా అడ్డుకట్ట వేయవచ్చు. కాలుష్యాన్ని పెంపొందించే ఇంధనాలను అంచల వారీగా తగ్గించడం, సూర్య, పవన శక్తిని వినియోగించడం, జీవజాతుల మనుగడకు ముప్పుగా పరిణమించిన ప్లాస్టిక్‌ను నిషేధించడం, రసాయన పరిశ్రమల నుండి వెలువడుతున్న వ్యర్థాలను, విష పదార్థాలను అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిలువరించడం వంటి చర్యల ద్వారా ప్రకృతిలో సంభవించే పరిణామాలను అరికట్టవచ్చు. జీవ వైవిధ్యాన్ని కాపాడవచ్చు. గాలి కాలుష్యాన్ని పచ్చదనంతో మటుమాయం చేయవచ్చు. స్వచ్ఛమైన గాలి కోసం వనాలు పెంచాలి. వనాలు లేని భూగోళం అధిక ఉష్ణోగ్రతలకు ఆలవాలం. వనాల అంతర్ధానం ప్రకృతికి శాపం. జీవ వైవిధ్యానికి వనాల సంరక్షణ అత్యంత ఆవశ్యకం. మానవాళితో పాటు ఇతర జీవరాశుల మనుగడ కూడా పచ్చదనం మీద ఆధారపడి ఉంది. పచ్చదనాన్ని పరిరక్షించకపోతే రాబోయే అతికొద్ది కాలంలో ఎన్నో విపత్కర పరిణామాలు ఎదుర్కోవలసి వస్తుంది. ఇప్పటికే భూతలంపై పచ్చదనం చాలా వరకు మటుమాయమైపోయింది. ఒకప్పుడు జనాభా తక్కువగా ఉండేది. అప్పట్లో ప్రకృతి వనరులపై ఆధారపడి జీవించే పరిస్థితుల వలన ప్రకృతిని అందరూ దైవం గా ఆరాధించే వారు. పచ్చదనానికి అత్యంత ప్రాధాన్యత నిచ్చేవారు. అయితే అప్పటి పరిస్థితులు నేడు కానరావడం లేదు. విజ్ఞానం పెరిగింది. జనాభా కూడా పెరిగింది. పెరిగిన జనాభా అవసరాలను తీర్చడానికి సైన్స్ అనేక ఆవిష్కరణలు చేపట్టింది. అవసరమున్నా, లేకపోయినా సౌకర్యవంతమైన జీవన విధానం అలవాటు చేసుకున్నాం. దురాశతో అడవులను నరకడం, పచ్చని పంటపొలాలను విధ్వంసం చేసి,కాంక్రీట్ అరణ్యాలుగా మార్చడం, నాగరికత పేరుతో ప్రకృతిని హరించి వినూత్న కట్టడాలతో జనజీవన విధానాన్ని మరో నూతన ప్రపంచంలో విహరింపచేస్తున్నాం.

## పచ్చదనమే కాలుష్యానికి చికిత్స

ధరిత్రిపై జరిగే ప్రళయాలకు ప్రధాన కారణం ప్రకృతి విధ్వంసం. "యతో ధర్మస్తతో జయః" అనే సంస్కృత శ్లోకం యథార్థం. ధర్మమున్న చోట విజయముంటుందని దీని అర్థం. ప్రకృతి పట్ల మన ధర్మాన్ని మనం నిర్వర్తించడం లేదు కనుక

మానవ మేధస్సుపై ప్రకృతి విజయం సాధించి, మానవులను పరాజితులను చేస్తుందనడానికి వర్తమానంలో జరుగుతున్న ప్రకృతి వైపరీత్యాలే కారణం. ప్రకృతి నుండి మేలు పొంది తిరిగి ప్రకృతిని విధ్వంసం చేస్తున్నాం. మన పూర్వీకులంతా మన జీవితాలకు ఆధారమైన పంచ భూతాలను ఆరాధించేవారు. ఆధునిక తరం ఈ ధోరణిని పరిహాస ప్రాయం చేసింది.

కాలుష్యం నుండి ప్రకృతిని రక్షిస్తే అదే ప్రకృతి మనకు రక్షాకవచంలా మారుతుంది. విజ్ఞానంతో కూడిన సమాజాన్ని నెలకొల్పాలి. ప్రకృతిలో సహజంగా సంభవించిన ఏర్పాటును విధ్వంసం చేయడం వలన మానవాళి మనుగడ ప్రమాదంలో పడింది. ఆరోగ్యానికి, పర్యావరణానికి మధ్య గల అవినాభావ సంబంధాన్ని గుర్తెరిగి ప్రవర్తించాలి. పర్యావరణం మానవ దుష్కృత్యాల వలన అనేక పరిణామాలకు గురైనది. పర్యావరణంలో నాశనమైతే, అది అంతిమంగా మానవ ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుంది. పర్యావరణం ఆరోగ్యంగా ఉంటేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారు.

ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనాల ప్రకారం ప్రపంచంలో 24 శాతం మంది ప్రజలు పర్యావరణ సమస్యల వలన ఇబ్బందులకు గురౌతున్నారు. సుమారు 12.6 శాతం మంది ప్రజలు పర్యావరణ సంబంధిత అనారోగ్య సమస్యల వలన మృత్యువాత పడుతున్నారు.

గాలి, నీరు, నేల, ఆహారం.. ఇలా అన్నింటిలోను హానికరమైన రసాయనిక పదార్థాలు, ఇతర భౌతిక, జీవ సంబంధిత హానికారకాలు చేరడం వలన అనేక అనర్థాలు సంభవిస్తున్నాయి. ప్రజల ఆరోగ్యం పర్యావరణంపై ఆధారపడి ఉంది.

పర్యావరణం బాగుండాలంటే ప్రజలకు స్వచ్ఛమైన గాలి, నీరు ఆహారం కావాలి. వాయు కాలుష్యం, నీటి కాలుష్యం వలన వాతావరణంలో అనేక అవాంఛనీయ పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. పర్యావరణం దెబ్బతినడం వలన ప్రజలు అనారోగ్య వంతులవుతున్నారు. ప్రజలు ఆరోగ్యవంతంగా ఉంటేనే ఆర్థిక ప్రగతి సాధ్యపడుతుంది. పర్యావరణం ఆరోగ్యవంతంగా ఉంటేనే మానవ మనుగడ సాధ్యపడుతుంది. పర్యావరణానికి ఇబ్బందికరంగా మారిన గ్రీన్ హౌస్ వాయువుల గురించి, వాతావరణ మార్పుల గురించి ప్రజల్లో అవగాహన కలిగించడం, కాలుష్య కారకాలను తగ్గించడానికి చర్యలు తీసుకోవడం, మొక్కలను పెంచడం వంటివి అంతర్జాతీయ పర్యావరణ ఆరోగ్య మండలి ప్రణాళికలో చోటు చేసుకున్న ప్రధానాంశాలు.

పచ్చని పంట పొలాలతో, పసందైన ప్రకృతి ఒడిలో స్వచ్ఛమైన ప్రాణవాయువును పీలుస్తూ, అంటువ్యాధులను సైతం అవలీలగా జయించి, రసాయనిక పదార్థాలు లేని, సహజసిద్ధమైన బలవర్ధకమైన ఆహారాన్ని భుజించి, ఆరోగ్యవంతంగా నిండు నూరేళ్ళు జీవించిన నాటితరం నాటి జీవన విధానం నేటి తరంలో అగుపించడం లేదు. కృత్రిమ వాతావరణంలో, కాలుష్య కారకాల మధ్య నిరంతరం అష్టకష్టాలు పడుతూ, ఆరోగ్యాలు చెడి, అంటువ్యాధుల బారిన పడి అలమటిస్తున్న జనవాహిని ఆవేదనలు, ఆక్రందనలు అత్యంత బాధాకరంగా ఉన్నాయి. నిరక్షరాస్యత ప్రబలంగా ఉన్న నాటి కాలంలో కూడా ప్రజలు ఎంతో విజ్ఞత ప్రదర్శించి, ప్రకృతిని దైవంగా ఆరాధించేవారు. విజ్ఞానం పెరిగినకొద్దీ నేటి ప్రపంచం అజ్ఞానంతో అలమటిస్తూ, మితిమీరిన స్వార్థంతో ప్రకృతిపై విధ్వంస కాండను కొనసాగిస్తున్నది. పెరిగిన జనాభా ఇతర జీవరాశుల అంతానికి నాంది పలికింది.

పట్టణాల సంస్కృతిని పల్లెలు సంతరించుకున్నాయి. నగరీకరణ వలన సహజసిద్ధమైన వాతావరణం అంతరించింది. కలుషితాల వలన అంటువ్యాధులు ప్రబలిపోతున్నాయి. ప్రకృతిలో సముద్ర జలాలు వేడెక్కి, ఎల్‌నినో సమస్య ఏర్పడి భూమండలం అగ్ని గుండంలా మారింది. కరువు పరిస్థితులు తాండవిస్తున్నాయి. ఒక వైపు కరువు, మరోవైపు వరదలు వంటి విచిత్రమైన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ప్రకృతి విలయాలతో జనజీవనం అస్తవ్యస్తమౌతున్న నేపథ్యంలో పర్యావరణ పరిరక్షణకు సంబంధించి తక్షణ చర్యలు తీసుకోవలసిన అవసరం ఏర్పడింది. పర్యావరణ పరిస్థితులపై దృష్టి సారించకపోతే ఇప్పటికే ప్రమాదపు అంచున ఉన్న ప్రపంచ మానవాళి తన మనుగడను కోల్పోయే ప్రమాదం ఉంది.

పచ్చదనాన్ని పెంచి, పర్యావరణాన్ని పరిరక్షించడంలోనే సకల మానవాళి క్షేమంగా మనుగడ సాగించగలదు. పచ్చదనం ప్రాధాన్యత చాటి చెప్పాలి. ఒక వైపు మొక్కల పెంపకం ఆవశ్యకత గురించి చెబుతూనే, మరొక వైపు చెట్లను నరకడం పరిహాసప్రాయమౌతున్నది. ప్రపంచ దేశాలన్నీ పర్యావరణం గురించి, పచ్చదనం ఆవశ్యకత గురించి పదే పదే చెబుతూనే ఉన్నా, అవన్నీ కేవలం మాటల వరకే పరిమితమౌతున్నాయి.

ప్రపంచంలో తలెత్తే పలు సమస్యలకు పర్యావరణ విధ్వంసమే మూలకారణం. కాలుష్యకారకాలు విజృంభించడం భూఉష్ణోగ్రతలు భరింపశక్యం కాకుండా పెరగడం ఊహాతీతమైన ప్రకృతి విలయాలకు సంకేతం. ఆధునిక పరిజ్ఞానం ప్రజల ఆరోగ్యాలపై పెను ప్రభావం చూపుతున్నది. ఆధునిక నాగరికత జనావాసాలను కాంక్రీటు అరణ్యాలుగా మారుస్తున్నది. చెరువులు, ఇతర నీటి వనరులు నశించిపోతున్నాయి. సముద్ర జలాలు కలుషితమై సముద్ర జీవాలు అంతరించిపోతున్నాయి. ప్రకృతిలో చోటు చేసుకుంటున్న పరిణామాలు జీవవైవిధ్యానికి ముప్పుగా మారాయి.

మానవ స్వార్థం ఇతర జీవరాశులకు భూగ్రహంపై చోటు లేకుండా చేస్తున్నది. విలాసవంతమైన జీవన విధానం జీవ వైవిధ్యానికి తూట్లు పొడుస్తున్నది. దూరదృష్టి నశించి చెట్లను నరకడం పెరిగిన మానవ పైత్య ప్రకోపానికి నిదర్శనం.

ఇకనైనా పర్యావరణానికి సంభవిస్తున్న పెను ముప్పును నివారించాలి. ప్రమాదకరంగా మారిన ప్లాస్టిక్‌ను నిషేధించడంలో చేస్తున్న నిర్లక్ష్యం అత్యంత ప్రమాదకరంగా మారింది. రసాయనాల వినియోగం, వాతావరణ కాలుష్యం మానవ మనుగడకు చరమగీతం పాడే పరిస్థితులు ఏర్పడిన నేపథ్యంలో బాధ్యతయుతమైన, విజ్ఞానవంతమైన ప్రపంచ నిర్మాణం వైపు అంతర్జాతీయ సంస్థలు దృష్టి సారించాలి. కాలుష్య రహితమైన, ఆరోగ్య వంతమైన ప్రపంచం దిశగా అడుగులు పడాలి. ■

# చిత్తశుద్ధి!

ప్రకృతి పగబట్టింది!
కాదు కాదు మనిషే
ప్రకృతి పైన పగబట్టాడు!!
అడవుల్ని వెతికి వెతికి నరుకుతూ..!
ప్లాస్టిక్ వ్యర్థాలని గుట్టలు గుట్టలు
పోగు చేస్తూ..!!
ఫలితం వాతావరణ అసమతుల్యం!
వర్షాల లోటు
భూమి వేడి ఘాటు!
ధ్రువాల వద్ద మంచు మాయం!
సముద్ర మట్టం పెరుగుదల ఖాయం!!
విపరీత వర్షాలు, వరదలు ఒకవైపు
కరువు పరిస్థితులు మరోవైపు వైపు!
అభివృద్ధి పేరుతో
విష వాయువులను విడుదల ..
పరిసర కాలుష్యానికి
ప్రధాన వనరు!!
దీనికి పరిష్కారం
ఇళ్లల్లోనూ, ఖాళీ ప్రదేశాలలో
మొక్కలను విపరీతంగా పెంచడం..
అడవులను రక్షి చడం..



వీలైనంతవరకు సామూహిక
రవాణా వ్యవస్థను విరివిగా
వినియోగించడం..
పరిశ్రమల నుంచి వచ్చే వ్యర్థాల శుద్ధి
చేయడం..
ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా
నియంత్రించడం..
పేపర్, జ్యూట్ ఆధారిత సంచులను
ప్రోత్సహించడం..
సోలార్ ఎనర్జీ వాహనాలను వాడడం..
ఇదంతా అనుకొన్నంత తేలికేం కాదు!
కానీ అసాధ్యం మాత్రం కాదు!!
ప్రతి వ్యక్తి
చిత్తశుద్ధితో పనిచేస్తేనే సాధ్యం!!

– ఏడుకొండలు కళ్ళేపల్లి

# మనిషి-ప్రకృతి

చెట్ల నీడలు అలసిన ప్రాణాలకు
చల్లని జోలపాటలు పాడే చేతులు
నదుల నవ్వుల్లో నేల గుండె చప్పుళ్ళు
పక్షుల గానంలో
ఉదయం నేను మొదట చేసే ప్రార్థన

సూర్య కిరణాల మీదే ఉంటుంది.
మండే ఎండలు భూమి నుదుటిపై
వేదనగా మెరిసే చెమటబొట్లు
పెరిగిన మనిషి స్వార్థం
సువాసనలు కోల్పోయిన పూల నిట్టూర్పు
అడవులు తగ్గిన చోట
గాలికీ దారి తప్పిన అనాథ భావం
గ్రీష్మతాపం పనిని మింగే అగ్నిగోళం
వాన కోసం ఆకాశాన్ని చూసే నేల
తల్లి కోసం ఎదురుచూసే శిశువు
ఒక చెట్టు నాటిన ప్రతీ చేతి వేళ్లూ
భూమి గాయంపై లేపనం రాసే
మృదువైన మనిషి స్పర్శ
ఇప్పుడు.. పర్యావరణాన్ని ప్రేమించడం
అంటే..!?
మన భవిష్యత్తును ప్రేమగా
కౌగిలించుకోవడం..!

– డా. కటుకోర్ముల రమేష్

# ఈవారం కవిత్వం

## బతికిన క్షణాలు

ఆ పల్లెకి.. అల్లంత దూరాక సముద్రం
అక్కడ పొడుస్తున్న పొద్దు
ఒక ప్రశాంతమైన మెలకువలా
సుకుమారమైన చల్లని చేతులతో
మనుషుల చెక్కిళ్లు నిమురుతున్న
పిల్ల గాలులు
కాలిదారి కిరువైపుల
తటాకాల, తరువుల పరంపరల్తో
లోపల కల్మషాన్ని కడిగి పారేసే
నీరవమూ హరిత సౌందర్యమూ
ఇది సైకతం మేటేసిన నేల కదా!

తొవ్వితే చాలు.. తొమ్మిది పది
అడుగుల్లోనే జీవ జలాల ప్రాణ ధార
దాహం తీర్చి ఊపిరి నిలిపే ఊట
ఊరుని సృష్టించిన ఊట
ఊరుని సాకుతున్న ఊట
ఎంత బాగుంది ఈ ప్రదేశం!
నేనొక పసిబిడ్డై
పచ్చని తల్లి ఒడిలో కూర్చున్నట్లు
ప్రకృతిమాతతో మమేకమై.. నేను
లేకపోయినట్లు.. నన్ను నేను కోల్పోయి
నేనొక సమూహంలో బతుకుతున్నట్లు...

ఈ క్షణాలు చిరస్మరణీయమైనవి
ఈ క్షణాలు సుమలతలై చిగురించినవి
సముద్రం ముందు మేమో
మా ముందు సముద్రమో..! ఏమో!!

– రవి నన్నపనేని

# హైకూలు

భావజలాల
కవి ఎత్తిపోతలు
తలపోతలు
.....
భావనాశ్వాల
కవన సూర్యరథం

తేజోపథాన.
.....
వెలుగుతేజం
చెకుముకి శిలల
కరచాలనం.
.....
మాటలు కాదు
మంచీ చెడూ చేష్టలే

మన విలువ.
.....
రెక్కలల్లార్చి
నింగిని ఏకేస్తాడు
గాలిదేవుడు.
.....
కంటిరెపనపలు
దుఃఖాన్ని ఆపలేవు

తోడివేస్తాయి.
.....
నా కన్నెప్పలు
చూపుల రెటీనాపై
సీతాకోకలు.
.....
ఉల్లి తల్లిది
ముకుళిత

వందనం
రేకురేకునా
.....
నీ ఏకాగ్రత
సర్వప్రాప్తజ్ఞతకూ
సహజోపాయం.

– ఉమ్మడిశింగు రాఘవరావు

సింగిల్ పేజ కథ

# రిస్ట్ వాచ్

**ఆరోజు ..**

మధ్యాహ్నం లంచ్‌కి ఇంటికి వెళ్లి వచ్చిన తరువాత నా సీట్లో కూర్చుని ఆ సంవత్సరపు కొత్త ఆడంగలు రాసే పనిలో పడ్డాను. తనూ లంచ్ చేసి వచ్చి లక్ష్మణరావు నా సీటు ముందు ఉన్న కుర్చీలో కూర్చుని కబుర్లు చెప్పసాగాడు. సరదాగా మాట్లాడతాడు.

వర్క్ చేసుకుంటూనే వింటూ.. చిన్నగా నవ్వుతున్నాను,

కాస్సేపు మాట్లాడి చిరుకోపం తెచ్చుకుని "అన్నిటికీ నవ్వుతారేంది? నేను చెబుతున్నది, నిజం. కావాలంటే. బెట్ కడతాను. వట్టిగా కాదు. నా వాచ్ పెట్టి మరీ బెట్ కడతాను" అంటూ చేతి నుంచి వాచ్ తీసి విసురుగా నా ముందు పెట్టాడు. నేను చెప్పేది పూర్తిగా నిజం సుమా! అన్నట్లు.

అయినదానికీ, కాని దానికీ అలా కాలక్షేపం బెట్లు వేస్తుంటాడు. "నేనేం కాదనలేదు మీ మాటలు. ఎందుకొచ్చిన బెట్స్" అన్నా వాచ్ తీసుకోండి అన్న అర్థం వచ్చేలా.

గుండ్రంగా పెద్దదిగా లెదర్ బెల్టుతో బాగానే ఉంది. అతను తీసి పెడితే, మాత్రం నేను దాన్ని ఎందుకు ముట్టుకుంటాను జంట్స్ వస్తువులు.

అది అలాగే ఉంది. ఇంతలో సుధాకర్ కూడా మాతో వచ్చి చేరాడు. టేబుల్‌పై నున్న వాచ్‌ని చూస్తూ "ఏంది? వాచీ బయట పారేసిన్రు" అంటూ వెంటనే తీసి తన చేతికి తగిలించుకున్నాడు.

మేమందరం ఒకే ప్రొసీడింగ్స్‌లో ఆ సూర్యాపేట తాలుకా ఆఫీసులో జూనియర్ అసిస్టెంట్లుగా ఒకేసారి అపాయింటు అయినవాళ్ళం. మొత్తం ఏడుగురం. మా అందరికీ ఒక హాలు కేటాయించి పని అప్పగించారు తహసీల్దారుగారు.

అందులో నేను ఒక్కడాన్నే లేడీని. మిగిలిన ఆరుగురూ జంట్స్. పైగా వాళ్లందరూ ఆ నల్లగొండ జిల్లావాళ్ళే. అయితే, నేనూ చిన్నప్పుడు నాన్నగారి ఉద్యోగ రీత్యా ఆ జిల్లాలోనే చదువుకున్నందుకు, లోకల్ కాండిడేట్ కోటాలో జాయిన్ అయినా. ప్రస్తుత ట్రాన్స్‌ఫర్ దృష్ట్యా ఏడు జిల్లాల అవతల ఉన్న శ్రీకాకుళం జిల్లా నుంచి వచ్చాను.

ఇంకా ఎవరికీ వివాహాలు కాలేదు. ఉద్యోగాల్లోకి వచ్చినా కాలేజీ స్టూడెంట్స్‌లానే ఉంటాం.

"హేయ్! వాచ్ నాది" లాక్కోబోయాడు లక్ష్మణరావు.

అందకుండా చెయ్యి వెనక్కి పెట్టుకున్నాడు సుధాకర్.

"ఏమండీ. నా వాచ్ వీడు తీసేసుకుండు. మీ దగ్గరే పెట్టిన. మీరే ఇప్పించండి" అంటూ తన ఖాళీ చేతిని నాకు చూపిస్తూ అడిగాడు.

"మరేం. ఎందుకు బయటపెట్టారు?" కోపం తెచ్చుకున్నా వస్తువు చేతి నుండి తియ్యడం తప్పన్నట్లు.

ఇంతలో ఎవరో పిలవడంతో సుధాకర్ తన సీట్లోకి వెళ్ళిపోయాడు. లక్ష్మణరావు మౌనంగా ఉండిపోయాడు. వాళ్ళూ వాళ్ళూ ఫ్రెండ్స్. ఎప్పుడైనా ఇచ్చుకుంటారు అని ..ఆ విషయాన్నీ అంత పట్టించుకోలేదు.

.....

మరునాడు.. ఎప్పటిలానే పలకరించిన లక్ష్మణరావు "ఈ రోజైనా నా వాచ్ నాకు ఇప్పించండి" అంటూ అడిగాడు.

అక్కడే ఉన్న సుధాకర్ని చూస్తూ "అతని వాచ్ అతనికి ఇచ్చెయ్యవచ్చు కదా!" అన్నా.

"నేనివ్వ, నాకు దొరికింది" నిన్నటిలానే చేతులు వెనక్కి పెట్టుకుంటూ.

అది మొదలు లక్ష్మణరావు తన వాచ్ గురించి అప్పడప్పుడూ గుర్తు చేస్తూనే ఉన్నాడు. నేనూ లక్ష్మణరావు లేని సమయంలో సుధాకర్ని అడుగుతూనే ఉన్నా.

ఇంకా చెప్పాలంటే బతిమాలుతున్నా "అతని వాచ్ అతనికి ఇచ్చేయ్యండి. అస్తమానం నన్ను అడుగుతున్నారు" అంటూ.

అయినా ఉపయోగానికి రాలేదు. అదే ఆడపిల్ల అయితే, చెయ్యి పట్టుకుని తీసి అవతల వాళ్ళకు ఇచ్చేసేదాన్ని. ఇక లాభంలేదని మా వాళ్లలోనే ఒకడైన వెంకటేశ్వర్లుకి వాళ్ళు ఇద్దరినీ ముందు పెట్టుకుని జరిగిన విషయం చెప్పా. ఎన్నాళ్లని టార్చర్ భరించగలను? చాపకింద నీరులా నాలుగు రోజుల్నుంచి ఇబ్బంది పడుతున్నా.

అంతా విన్న వెంకటేశ్వర్లు నవ్వుతూ చెప్పాడు "ఆ వాచ్ సుధాకర్‌గానిదే. సరదాగా కాస్సేపు లక్ష్మణరావు కిచ్చాడు. పందెం పేరుతో అదే తీసి మీ ముందు పెట్టాడు లక్ష్మణరావు. ఆ వాచ్ తనదే కాబట్టి,

సుధాకర్ తన వాచ్ని తను తీసుకున్నాడు. ఆ విషయం మీకు తెలీదు కాబట్టి, అలా గేమ్ ఆడారు మీతో" అంటూ విషయం వివరించాడు.

"హా!" ఆశ్చర్యం ప్రకటించాను కొత్త విషయం తెలుసుకున్నట్లు. ఆ మాటకి గుండెల భారం దిగిపోయినా "ఎంత టార్చర్ పెట్టారు ఇన్నాళ్ళూ" అంటూ కొరకొరా చూసాను.

ఇద్దరూ నవ్వుకుంటూ వాళ్ళ సీట్లలోకి వెళ్ళిపోయారు ఏదో విజయం సాధించిన వాళ్ళలా. తాటాకు మంటలాంటి నా కోపం ఎంతోసేపు నిలవదని వాళ్ళకీ తెలుసు. స్నేహం ముందు అన్నీ బలాదూరే కదా!

– పిఎల్ఎన్ మంగారత్నం

- ధనం ఉండి మిత్రులను సంపాదించడం సులభం. ధనం లేకుండా మిత్రులను కలిగిన ఉండటం గొప్పతనం.
- ధనాన్ని వదిలేసినవాడు జోగి. ధనాశను వదిలేసినవాడు యోగి.
- దుష్పాండిత్యం కంటే పాండిత్యం లేకపోవడం మేలు.
- తనను గురించి తాను తెలుసుకోనివాడే నిజమైన అజ్ఞాని.

# ప్లేటు చిన్నదే.. ముప్పు పెద్దది..!

**విందులు, వేడుకలు, సమావేశాలు, పుట్టినరోజు కార్యక్రమాలు, చిన్నచిన్న ఫంక్షన్లు.. సందర్భం ఏదైనా సరే భోజనం వడ్డించడానికి కాగితపు ప్లేట్ల వినియోగం ఇటీవలి కాలంలో విపరీతంగా పెరిగింది. ప్లాస్టిక్ ప్లేట్లకు ప్రత్యామ్నాయంగా కాగితపు ప్లేట్లు వచ్చాయని, అవి పర్యావరణానికి హాని చేయవని చాలామంది భావిస్తున్నారు.**

అయితే ప్రతి కాగితపు ప్లేటూ పర్యావరణహితమైనదే అనే అభిప్రాయం పూర్తిగా నిజం కాదు. తయారీ విధానం, ఉపయోగించే పూత, రంగులు, రసాయనాలు, పారవేసే విధానం వంటి అంశాలపై వాటి పర్యావరణ ప్రభావం ఆధారపడి ఉంటుంది. ముఖ్యంగా ఒకసారి ఉపయోగించి పడేసే సంస్కృతి పెరగడం అసలు సమస్య.

కాగితపు ప్లేట్ల తయారీకి ప్రధానంగా చెట్ల నుంచి లభించే కాగితం అవసరం. కాగితం తయారీ కోసం కలపను పెద్ద మొత్తంలో వినియోగించాల్సి వస్తుంది. అడవులు భూమికి ఊపిరితిత్తుల్లాంటివి. వాతావరణంలో కార్బన్ డయాక్సైడ్‌ను గ్రహించి ఆక్సిజన్‌ను విడుదల

చేయడంతో పాటు నేల సంరక్షణ, వర్షపాతం సమతుల్యత, జీవ వైవిధ్య పరిరక్షణలో అడవులు కీలక పాత్ర పోషిస్తాయి. కాగితపు ఉత్పత్తుల కోసం చెట్లపై పెరుగుతున్న డిమాండ్ అటవీ వనరులపై ఒత్తిడిని పెంచుతుంది.

ఒక ప్లేటు వల్ల వెంటనే పెద్ద నష్టం కనిపించకపోయినా, కోట్లాది ప్లేట్ల వినియోగాన్ని కలిపి చూస్తే దాని ప్రభావం చిన్నది కాదు.

ఇంకో ముఖ్యమైన సమస్య కాగితపు ప్లేట్లపై ఉండే పూత. మార్కెట్లో లభించే అన్ని ప్లేట్లు సాధారణ కాగితంతో మాత్రమే తయారు కావు. నీరు, నూనె, కూరలు ప్లేటును తడిపేయకుండా ఉండేందుకు కొన్ని ప్లేట్లకు ప్లాస్టిక్ లేదా ఇతర నీరు చొరబడని పూతలను ఉపయోగిస్తారు. బయటకు చూస్తే అవి కాగితపు ప్లేట్లుగానే కనిపించినా, వాటిలో ఉండే పూత కారణంగా వాటిని రీసైక్లింగ్ చేయడం లేదా సహజంగా కుళ్లిపోవడం కష్టమవుతుంది. అందువల్ల 'పేపర్ ప్లేట్' అనే పేరు చూసి అది పూర్తిగా పర్యావరణహితమైనదని భావించడం సరైనది కాదు.

కాగితపు ప్లేట్లలో వేడి, నూనెతో కూడిన ఆహారాన్ని వడ్డించడం విషయంలోనూ జాగ్రత్త అవసరం. ప్లేట్ల తయారీలో ఉపయోగించే పూతలు, రంగులు, అంటుకునే పదార్థాలు, తయారీ నాణ్యత వంటి అంశాలు ఆహారంతో సంబంధం కలిగి ఉంటాయి. ముఖ్యంగా వేడి లేదా కొవ్వు ఎక్కువగా ఉన్న ఆహారంతో సంపర్కంలోకి వచ్చినప్పుడు ఉపయోగించిన పదార్థాల భద్రతను పరిగణనలోకి తీసుకోవాలి. అందుకే తక్కువ నాణ్యత కలిగిన, నాణ్యత ప్రమాణాలు స్పష్టంగా తెలియని ప్లేట్లను చౌకగా ఉన్నాయనే కారణంతో ఉపయోగించడం మంచిది కాదు.

కాగితపు ప్లేట్ల మరో పెద్ద సమస్య చెత్త నిర్వహణ. కార్యక్రమం పూర్తయిన తర్వాత వందలు, వేల సంఖ్యలో ప్లేట్లు ఒకేసారి చెత్తగా మారుతాయి. వాటిలో ఆహార అవశేషాలు అంటుకుని ఉంటాయి. ఇతర తడిచెత్తతో కలిసిపోయిన తర్వాత

వాటిని వేరు చేసి రీసైక్లింగ్ చేయటం కష్టమవుతుంది. ఫలితంగా అవి చెత్తకుప్పల్లో చేరుతాయి. కొన్ని చోట్ల వాటిన బహిరంగంగానే కాల్చేస్తారు. అలా కాలనచడం వల్ల పొగ, సూక్ష్మకణాలు, పూతలో ఉన్న పదార్థాలను బట్టి ఇతర హానికారక పదార్థాలు వాతావరణంలోకి వెళ్లే అవకాశం ఉంటుంది. చెత్తను కాల్చడం సమస్యకు పరిష్కారం కాదు; మరో కాలుష్య సమస్యకు దారి తీసే మార్గం.

కాగితపు ప్లేట్ల వినియోగం నీటి వనరులపై కూడా పరోక్ష ప్రభావం చూపుతుంది. కాగితం తయారీ ఒక వనరుల ఆధారిత పరిశ్రమ. కలపతో పాటు నీరు, విద్యుత్, రసాయనాలు అవసరమవుతాయి. కాగితాన్ని తయారు చేయడం, ప్రాసెస్ చేయడం, ప్లేట్లుగా మార్చడం, ప్యాకింగ్ చేయడం, మార్కెట్‌కు తరలించడం వంటి ప్రతి దశలో శక్తి వినియోగం ఉంటుంది. కాబట్టి ఒకసారి ఉపయోగించి పారేసే వస్తువు వెనుక దాగి ఉన్న మొత్తం వనరుల వినియోగాన్ని మనం గుర్తించాలి.

అయితే కాగితపు ప్లేట్లను పూర్తిగా చెడ్డవిగా చిత్రీకరించడం కూడా సరైనది కాదు. పునర్వినియోగ పదార్థాలతో

తయారైన, ప్లాస్టిక్ పూతలు లేని, తగిన ప్రమాణాలను పాటించే కొన్ని ఉత్పత్తులు ఇతర సింగిల్ యూజ్ పదార్థాలతో పోలిస్తే వేరే పర్యావరణ ప్రభావాన్ని కలిగి ఉండవచ్చు. కానీ అసలు ప్రశ్న "కాగితమా? ప్లాస్టికా?" అనే దానికంటే "ఒక్కసారి ఉపయోగించి పారేసే వస్తువులపై మన ఆధారపడటం ఎంతవరకు అవసరం?" అనేదే.

మన సమాజంలో సౌకర్యం పేరుతో వాడి పారేసే వస్తువుల సంస్కృతి బలపడుతోంది. ఇంట్లో జరిగే చిన్న కార్యక్రమం నుంచి భారీ వివాహం వరకు ఒకసారి ఉపయోగించే ప్లేట్లు, గ్లాసులు, స్పూన్లు, కప్పులు పెద్ద మొత్తంలో వినియోగిస్తున్నారు. కార్యక్రమం ముగిసిన వెంటనే అవి చెత్తగా మారిపోతాయి. మనం కొద్ది నిమిషాల సౌకర్యం కోసం ప్రకృతి వనరులను వినియోగించి, ఆ తర్వాత ఆ భారాన్ని భవిష్యత్ తరాలపై వదిలేస్తున్నాం. ఈ ఆలోచనా విధానంలో మార్పు రావాలి.

దీనికి ప్రత్యామ్నాయం పునర్వినియోగ వస్తువుల వినియోగాన్ని పెంచడం. స్టీల్ ప్లేట్లు, స్టీల్ గ్లాసులు వంటి వాటిని శుభ్రపరిచి మళ్లీ ఉపయోగించవచ్చు. పెద్ద కార్యక్రమాల్లో కూడా పునర్వినియోగ పాత్రలను ఉపయోగించే విధానాలను ప్రోత్సహించవచ్చు. కొన్ని సందర్భాల్లో అరటి ఆకులు, ఇతర స్థానికంగా లభించే సహజ పదార్థాలతో తయారైన పాత్రలను కూడా పరిశీలించవచ్చు. అయితే ఏ ప్రత్యామ్నాయమైనా దాని తయారీ, రవాణా, వినియోగం, శుభ్రపరచడం, చివరి దశలో పారవేయడం వంటి మొత్తం జీవితచక్రాన్ని పరిగణనలోకి తీసుకోవాలి.

ప్రభుత్వాలు కూడా ప్రజల్లో అవగాహన పెంచడంతో పాటు సింగిల్ యూజ్ వస్తువుల నిర్వహణపై స్పష్టమైన నిబంధనలు, వ్యర్థాల వేరు సేకరణ, రీసైక్లింగ్ వ్యవస్థలను బలోపేతం చేయాలి. స్థానిక సంస్థలు కార్యక్రమాల నిర్వాహకులకు తడి చెత్త, పొడి చెత్త వేరు చేయడం తప్పనిసరి చేసే విధంగా చర్యలు తీసుకోవచ్చు. ఉత్పత్తిదారులు కూడా తమ ప్లేట్లలో ఉపయోగించే పదార్థాలు, పూతలు, రీసైక్లింగ్‌కు సంబంధించిన వివరాలను స్పష్టంగా ప్రకటించాలి. వినియోగదారులు కూడా "చౌకగా ఉంది కాబట్టి కొనాలి" అనే దృక్పథం నుంచి "పర్యావరణంపై దీని ప్రభావం ఏమిటి?" అనే దిశగా ఆలోచించాలి.

ప్రకృతిని కాపాడటం అంటే కేవలం చెట్లు నాటడం కాదు. మన రోజువారీ జీవితంలో తీసుకునే చిన్న నిర్ణయాల ద్వారా చెత్తను తగ్గించడం, వనరులను ఆదా చేయడం, పునర్వినియోగాన్ని పెంచడం కూడా పర్యావరణ పరిరక్షణలో భాగమే. కాగితపు ప్లేటు ఒక్కటే ప్రపంచ పర్యావరణ సమస్యకు కారణం కాదు. కానీ కోట్లాది మంది ఒకే విధంగా "ఒక్కసారి వాడి పారేయడం" అనే అలవాటును కొనసాగిస్తే దాని సమష్టి ప్రభావం మాత్రం తీవ్రమవుతుంది.

అందుకే కాగితపు ప్లేట్లను గుడ్డిగా పర్యావరణహితమైనవిగా భావించకుండా, వాటి తయారీ పదార్థాలు, పూత, వినియోగం, పారవేత విధానం వంటి అంశాలను పరిశీలించాలి. అవసరం లేని చోట సింగిల్‌యూజ్ ప్లేట్లను తగ్గించి, సాధ్యమైనంత వరకు పునర్వినియోగ పాత్రలకు ప్రాధాన్యం ఇవ్వాలి. మనకు కొన్ని నిమిషాల సౌకర్యం ఇచ్చే వస్తువు

భవిష్యత్ తరాలకు సంవత్సరాల భారంగా మారకూడదు. "వాడి పారేయడం" నుంచి "వాడి మళ్లీ ఉపయోగించడం" వైపు సమాజం అడుగులు వేస్తేనే సుస్థిరమైన జీవన విధానం సాధ్యమవుతుంది.

– తిప్పర్తి శ్రీనివాస్

## కార్టూన్లకు ఆహ్వానం

**కార్టూనిస్టుల నుంచి ఆరోగ్యకరమైన హాస్యాన్ని అందించే కార్టూన్లను స్వాగతిస్తున్నాం. అంశం ఏదైనా సరే! మంచి హాస్యాన్ని అందించాలి. కార్టూన్లతో పాటు మీ పేరు, చిరునామా, ఫోన్ నంబర్ తప్పనిసరిగా జత చేయాలి. ఎంపిక కాని కార్టూన్లను తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. కార్టూన్లు పంపించాల్సిన చిరునామా: ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80.**

***sunmagvaartha@gmail.com***

# వృక్షో రక్షతి రక్షితః

ది కలియుగం ప్రారంభం అయిన రోజులు. జంతు జాలం, వృక్ష జాలం, మానవులు కలిసి మెలసి ఉండేవారు. రాను రాను కాలం మారింది. కాలంలో చాలా మార్పులు వచ్చాయి. మొదట్లో సృష్టికర్త చెప్పిన ప్రకారం మానవులు, జంతువులు ప్రవర్తించేవి. కాలం మారుతున్నకొద్దీ మానవుల, జంతువుల ఆలోచనలు మారాయి. అవసరం ఉన్నా, లేకున్నా మొక్కలు, చెట్ల ఆకులు, కొమ్మలు మానవులు తుంచేవారు. కోటి పత్రాల పూజని, కోటి పువ్వుల పూజని, కోటి పండ్ల పూజని చెట్ల ఆకులు, పండ్లు, పువ్వులు అనవసరంగా తుంచేవారు. అవసరానికి మించి పండ్లు, పూలు, పత్రాలు కోసేవారు. అంతేకాకుండా ఇష్టం వచ్చినట్లు చెట్ల, మొక్కల కొమ్మలు విరిచేవారు. చెట్లకు అనుభూతులు అంటే అవి కూడా మనుసులు, జంతువులు వలె బాధ పాడతాయని, వాటికీ కూడా మనుసుంటుందని మరిచి మరీ వృక్ష జాలం పట్ల మానవులు కర్కశంగా ప్రవర్తించారు. జంతువులు కూడా చెట్ల పట్ల కర్కశంగా ప్రవర్తించాయి. జంతువులు తమ తిండికి అవసరమైన ఆకులు కంటే ఎక్కువ ఆకులు చెట్ల నుండి విరిచేవి. నిత్యం వృక్షాలు కన్నీరు కార్చేవి.

తమ బాధను మొర పెట్టుకోవడానికి వినే నాథుడే లేడు. రోజు రోజుకి మానవుల అకృత్యాలు చెట్లు, మొక్కలు పట్ల ఎక్కువైపోయాయి. చెట్లపై గూడులు పెట్టుకున్న పక్షులును కూడా మానవులు విడిచిపెట్టక ఆ పక్షిగూడులను కూడా నాశనం చేసేవారు. భక్తి పేరుతో పువ్వులు, పండ్లు, ఆకులు కోసే సందర్భంలో. చెట్ల కింద మానవులు పంచాయతీ పెట్టుకున్న సందర్భంగా ఆ చెట్టుపై ఉన్న పక్షులు రెట్ట వేస్తే ఆ పక్షుల అంతు చూసేవారు. ఆ పక్షిగూడు లేపేసేవారు.

చివరికి చేసేది లేక చెట్లు, మొక్కలు మనుషులలో గల పెద్దమనుషులతో తమ గోడు వెల బుచ్చాయి. "ఓ మానవులారా! చెట్లమైన మేం కూడా ప్రాణులమే. మాకు కూడా మనసు, అనుభూతులుంటాయి. మాకు మానవ, జంతువులు మల్లే అనుభూతులుంటాయని శాస్త్రవేత్తలు కనుగొని నోబెల్ ప్రైజ్ పొందారు. మా త్యాగం సృష్టిలో ఎవరు చేయరు. మేం పరోపకారులం. పరోపకారార్థం మిదం శరీరం అన్నారు పెద్దలు. మేం మీకు పూజకు పత్రాలు, పండ్లు, పువ్వులు ఇస్తున్నాం. మీరు తినడానికి పండ్లు ఇస్తున్నాం. మీకు శ్వాసకోసం ఆక్సిజన్ ఇస్తున్నాం. మీకు ప్రాణం పోస్తున్నాం. మీ దగ్గర నుండి వసున్న బొగ్గుపులును వాయువును మేం గ్రహించి మీకు వేడి లేకుండా చేస్తున్నాం. మీకు నీడను ఇస్తున్నాం. మీరు నీడకోసం మా వద్దకు వచ్చి మాపై ఉన్న పక్షిగూళ్లు నాశనం చేస్తున్నారు. సృష్టి మొదట్లో సృష్టి కర్త ఒక పత్రం, ఒక పండు, ఒక పువ్వుతో దేవునికి పూజ చేయమని చెప్పాడు. ఆ విషయం మీకు తెలుసు. కొండంత దేవుణ్ణి కొండంత పత్రి, కొండంత పువ్వులు, కొండంత పండ్లతో పూజ చేయలేం. పూజకి అవసరం మేరకు మా వనరులు వాడుకోవాలి. మేం ప్రధానంగా మొక్కలం.. కిరణ జన్య సంయోగ క్రియ చేయడం వలన మీకు తిండి గింజలు దొరుకుతున్నాయి. మా వలన ముఖ్యంగా చెట్లు వలన వర్షాలు పడుతున్నాయి. అంతటి త్యాగం మాది. త్యాగానికి తరువులే గురువులు అంటారు పెద్దలు. అంత గొప్ప త్యాగం చేస్తున్న మాకు మీరు ఇస్తున్నది ఏమిటి? మమ్ములను హింసించటం తప్ప" అని తమ గోడు పెద్ద మనుసులు దగ్గర వెళ్లబుచ్చుకున్నాయి చెట్లు, మొక్కలు.

చెట్లు, మొక్కలు మనుషుల ప్రవర్తనను కొంత కాలం గమనించాయి. మానవుల ప్రవర్తనలో ఇసుమంతైనా మార్పు లేదు. పై పెచ్చు మొక్కలు, చెట్లు పట్ల వారి ప్రవర్తన మరింత కటువుగా తయారైంది. చెట్లు, మొక్కలు ఇది కలియుగ మహిమ అనుకున్నాయి. చెట్లు, మొక్కలు మనుషులు తమ పట్ల కటువుగా ప్రవర్తించిన తీరుకు నిరసనగా.. చెట్లుపై నివాసముంటున్న పక్షులు కొత్తచోట్లను నివాస స్థలాలుగా ఎంచుకొమ్మన్నాయి. ఎందుకుంటే మొక్కలు, చెట్లు తమకున్న ఆకులు, పువ్వులు, పండ్లను నేలపైకి జరవిడిచి బోడిగా తయారయ్యాయి. ప్రకృతిలో పచ్చదనం పోయింది. పక్షులు తమ గూడులు మనుషుల ఇళ్లల్లో పెట్టుకున్నాయి దిక్కుతోచక. పర్యావరణంలో గాలి లేదు. మానవులు పీల్చటానికి ఆక్సిజన్ లేదు. వారు విడిచిన కార్బన్ డై ఆక్సైడ్ ఎక్కువ అయింది. పర్యావరణ వేడిగా తయారైనది. ప్రకృతిలో పచ్చదనం లేకపోవడంతో కిరణ జన్యసంయోగ క్రియ జరగలేదు. మనుషులకు, జంతువులకు తినటానికి తిండి లేదు. ప్రకృతిలో పచ్చదనం లేకపోవటంతో వర్షాలు పడలేదు. మనుషులు, జంతువులు తాగడానికి నీరు లేదు. పీల్చటానికి గాలి లేదు. పర్యావరణం మొత్తం అతలాకుతలం అయింది. ఇలా ఒక సంవత్సరం గడిచింది. మానవులకు చెట్లు, మొక్కలు తమకు గుణపాఠం నేర్పటానికి ఇలా చేశాయని అర్థమైంది. చేసేదిలేక మొక్కలు, చెట్లతో సంధి చేసుకున్నారు.

మొక్కలు, చెట్లతో మానవులు చేసుకున్న ఒప్పందం ప్రకారం.. అవసరం మేరకు ఆకులు, పువ్వులు తెంచుతారు. చెట్లను నగరీకరణ పేరిట విచక్షణ రహితంగా నరకరు. అవసరం లేకుండా చెట్ల, మొక్కల కొమ్మలు నరకరు, తుంచరు. కొండంత దేవునికి కొండంత పత్రం, కొండంత పువ్వులు, కొండంత పండ్లు కాకుండా చంద్రునికో నూలు పోగు అన్నట్టు దేవుని పూజిస్తామని మనుషులు చెట్లు, మొక్కలకు మాట ఇవ్వటంతో చెట్లు, మొక్కలు తమ బంధును... అదే తమ స్తంభనను విరమించుకున్నాయి. మరల ప్రకృతి అంతా యథావిధిగా పచ్చదనం సంతరించుకుంది. ప్రకృతి పచ్చని చీరను తన ఒంటిపై సింగారించుకుంది. "వృక్షో రక్షతి రక్షితః" అన్నట్లు మనుషులు, జంతువులు మొక్కలు, చెట్లను తమ ప్రాణాపదంగా, తమ కన్నబిడ్డల్లా, కంటిలో పాపల్లా చూసుకోవడం ప్రారంభించారు.

– ఆర్.సంగంనాయుడు

# చీమ ముద్దు

అనగనగా ఒక పెద్ద అడవి. ఆ అడవికి రాజు గజరాజు. వారి భార్యపేరు గజలక్ష్మి. వారికి లేకలేక ఒక మగ సంతానం కలిగింది. వాడికి 'కేసరి' అని నామకరణం చేయాలని అనుకున్నాడు గజరాజు.

నామకరణం వేడుకను అంగరంగ వైభవంగా నిర్వహించాలనుకున్నాడు. జంతువులందరికీ విందు ఏర్పాట్లు చేశాడు. ఆ అడవిలో ఉన్న ఒక గండు చీమ కూడా రాజుగారి ఇంట జరిగే వేడుకకు హాజరుకావాలని అనుకుంది.

నామకరణం రోజున అడవి అంతా పండుగలా మారింది. నెమళ్ల నాట్యాలు, కోకిలల పాటలు, కోతుల గెంతులతో వేడుక ఎంతో ఉత్సాహంగా సాగింది. జంతువులన్నీ విందు, చిందులతో ఉల్లాసంగా గడిపాయి.

వేడుక ముగింపులో జంతువులన్నీ తాము తెచ్చిన బహుమతులను గజరాజుకు అందించి, బుజ్జి కేసరికి ముద్దు పెట్టి దీవించి వెళ్తున్నాయి.

ఇంతలో గండు చీమ వంతు వచ్చింది. చీమ చాలా చిన్నది కదా! అది కేసరి కోసం ఎలాంటి కానుకలూ తీసుకురాలేకపోయింది. కానీ, మనస్ఫూర్తిగా రాజకుమారుడిని ఆశీర్వదించాలని అనుకుంది. నెమ్మదిగా పాక్కుంటూ వెళ్లి, కేసరి బుగ్గపైకి చేరి ముద్దు పెట్టింది. దాంతో కేసరి ఒక్కసారిగా ఏడుపు లంకించింది. "చీమ కేసరిని కుట్టేసింది.." అన్నారెవరో!

కేసరి బుగ్గ ఎర్రగా కందిపోవడం గమనించిన గజరాజుకు ఆవేశం పొంగుకొచ్చింది. చీమ భయంతో వణికిపోయింది.

చీమ పరిస్థితిని మహామంత్రి ఎలుగు అర్థం చేసుకుంది.. "శాంతించండి మహారాజా! చీమ కావాలని అలా చేయలేదు. అది ముద్దు పెట్టాలనే అనుకుంది. కానీ దాని సహజ గుణం కుట్టడం వల్ల, తెలియక జరిగిన చిన్న పొరపాటు ఇది. దాన్ని క్షమించండి" అని గజరాజుకు నచ్చజెప్పింది ఎలుగు.

ఇంతలో కుందేలు త్వరత్వరగా అక్కడికి వచ్చింది. చీమ కుట్టడం వల్ల ఎర్రగా కందిపోయిన కేసరి బుగ్గపై చల్లని పసరు మందు రాసింది. ఆ మందు చలువకు నొప్పి తగ్గి, బుజ్జి కేసరి హాయిగా కళ్ళు మూసుకుని నిద్రపోయాడు. దాంతో గజరాజు శాంతించి, చీమను క్షమించాడు. అడవి జంతువులన్నీ ఊపిరి పీల్చుకున్నాయి.

– పేట యుగంధర్

## చుక్కలు కలపండి

# రంగుల హరివిల్లు

## వార్త ఆదివారం

## బాలగేయం

### చిలుకమ్మా..!

చిలుకమ్మా... చిలుకమ్మా
రావమ్మా మా ఇంటికి
వచ్చి కానుకలీయవమ్మా
మా బుజ్జాయికి.

చిట్టీ చిలుకమ్మను
మీ బుజ్జాయి దగ్గరకు వచ్చాను
కానుకలెన్నో తెచ్చాను
పచ్చ పచ్చని రంగును తెచ్చాను
జామపండ్లను తెచ్చాను
కోకిలమ్మ లాలి పాటను
తెచ్చాను
కోతిబావ చేష్టలు తెచ్చాను

కలకాలం బతకాలని కాకమ్మ
ఆశీర్వాదం తెచ్చాను
హంస గుణం తెచ్చాను
తునీగ రెక్కలు తెచ్చాను

పక్షుల కూతలు తెచ్చాను
అడవి అందాన్ని తెచ్చాను
తేనె తీయదనం తెచ్చాను.

– ఆర్.ఎస్.నాయుడు

**చిన్నారుల ప్రశ్నలకు**
**వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్**
**గిరీష్ అంకుల్ సమాధానాలు**

ఎస్.కౌశిక్, కాకినాడ

ప్రశ్న: ఒలింపిక్ పతాకంలోని చిహ్నాల అర్థం ఏమిటి? ఒలింపిక్ క్రీడా జ్యోతి ఎప్పుడు ప్రారంభమైంది?

**జవాబు:** 1913లో తెల్లటి వస్త్రం మీద ఐదు రింగులతో కూడిన ఒలింపిక్ పతాకానికి రూపకల్పన జరిగింది. ఆనాటి నుంచి అంతర్గత సంబంధం వున్న ఐదు రింగుల సర్కిల్‌ను ఒలింపిక్ క్రీడల చిహ్నంగా వాడుతున్నారు. ఈ ఐదు రింగులు ఆసియా, యూరప్, ఆఫ్రికా, ఆస్ట్రేలియా, అమెరికా ఖండాలను సూచిస్తాయి. ప్రపంచ దేశాలలోని వివిధ రంగాల క్రీడాకారుల మధ్య సన్నిహిత సంబంధం ఉండాలనే భావానికి ఈ పతాకం చిహ్నంగా నిలుస్తుంది. ఈ రింగులు బ్లూ, ఎల్లో, బ్లాక్, గ్రీన్, రెడ్ రంగులలో ఉంటాయి.

దీనిని 1914 జూన్‌లో ప్యారిస్‌లో ఆవిష్కరించారు. అయితే, తొలిసారిగా వింటర్ ఒలింపిక్స్ సందర్భంగా 1920లో బెల్జియం నగరంలో నిర్వహించిన క్రీడలలో ఎగురవేశారు. ఈ రింగుల రంగులు కూడా ఆయా ఖండాలను సూచిస్తాయి.

నలుపు-ఆఫ్రికా; ఎరుపు-అమెరికా; పసుపుపచ్చ-ఆసియా; ఆకుపచ్చ-ఆస్ట్రేలియా; నీలం-యూరప్‌కు గుర్తుగా ఈ రింగులు ఎడమ నుంచి కుడి వైపుకు వరుసగా నీలం, పసుపు, నలుపు, ఆకుపచ్చ, ఎరుపు రంగులతో ఉంటాయి.

**ఒలింపిక్ క్రీడాజ్యోతి:** 1928లో ఆమ్‌స్టర్‌డామ్‌లో ఒలింపిక్ క్రీడలు నిర్వహించినప్పుడు తొలిసారిగా ఒలింపిక్ క్రీడాజ్యోతిని వెలిగించారు. 1936లో జరిగిన బెర్లిన్ ఒలింపిక్ క్రీడలలో క్రీడాజ్యోతి రిలే ప్రారంభమైంది. ఐదు ఖండాల బంధంగా ఒలింపిక్ క్రీడలు కొనసాగుతున్నాయి.



కథ

# ఆ.. నలుగురు

– రత్నాల ప్రకాశరావు

బాల్కనీలోనున్న పడక కుర్చీలో కూర్చొని ఎదురుగా నున్న రోడ్ వైపు చూస్తూ ఆలోచిస్తున్నాడు రామయ్య.

ప్రతిరోజు సాయంత్రం ఆ కుర్చీలో కూర్చొని దూరంగా కనిపించే పచ్చని చెట్లు, పొదలు, కొండలు, ఆ కొండల మధ్య అస్తమించే సూర్యున్ని చూస్తూ బాల్కనీలో గడపటమంటే రామయ్యకు చాలా ఇష్టం.

కానీ ఇప్పుడు రామయ్యకు ఆ సుందర దృశ్యాన్ని ఆస్వాదించే ఉద్దేశం గానీ, ఉత్సాహం గానీ కొంచమైనా లేదు.

గత నెల రోజుల నుండి అతను గతాన్ని తలచుకుంటూ బాధపడుతున్నాడు. గుండె నిండా గుబులు, మనసంతా ఆందోళనతో కుమిలిపోతున్నాడు.

.....

టీచర్ ఉద్యోగం చేస్తున్న రామయ్యకు ఇరవై సంవత్సరాల క్రితమే ఆనందపురం ట్రాన్స్‌ఫర్ అయ్యింది. ఆనందపురం స్కూల్‌లో జాయిన్ అయిన తరువాత భార్య కృష్ణ వేణి, పిల్లలు రవి, సుజాతలతో ఆ ఊర్లో ఒక అద్దె ఇంట్లో కాపురం పెట్టాడు.

అతనికి ఈ ఊరు వాతావరణం బాగా నచ్చింది. గ్రామస్తులంతా రామయ్యను చాలా గౌరవించేవారు. పిల్లలకు చక్కగా చదువు చెప్పడమే కాకుండా అక్కడి జనాలతో కలుపుగోలుగా వుంటూ అవసరమైనప్పుడు తగిన సలహాలు ఇస్తూ అందర్లో మంచి పేరు తెచ్చుకున్నాడు. స్వంత ఊరిలో తనకున్న కొద్దిపాటి ఆస్తులను అమ్మివేసి గ్రామస్తుల సహకారంతో రామయ్య ఆనందపురంలో ఒక మంచి ఇల్లు తనకు నచ్చిన విధంగా కట్టించుకున్నాడు.

విశాలమైన గదులు, బాల్కనీ, చుట్టూ కాంపౌండ్ వాల్, పెరట్లో నుయ్యి, మొక్కలు పెంచుకోవడానికి స్థలముతో ఇల్లు బాగా తయారయ్యింది.

కొత్త ఇంట్లోకి ప్రవేశించిన తరువాత రామయ్యకు అన్నీ అనుకూలముగా కలసి వచ్చాయి.

కొడుకు రవి కాలేజ్ చదువు పూర్తయిన తరువాత వెంటనే బెంగళూరులోని ఒ మంచి కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం దొరికింది.

ఉద్యోగంలో చేరిన కొద్దిరోజులకు అదే కంపెనీలో తనతో పనిచేస్తున్న అమ్మాయి స్నేహంతో పరిచయం, తరువాత స్నేహం, ఆ తరువాత ప్రేమ, చివరికి పెళ్లి వరకు దారి తీసింది.

అమ్మాయి కుటుంబ వివరాలన్నీ నచ్చడంతో రామయ్య ఇంకేమీ ఆలోచించకుండా ఇద్దరికీ వివాహం జరిపించాడు. కుమార్తె సుజాత చదువు పూర్తయ్యేసరికి తన సమీప బంధువులు చూపిన ఒక మంచి సంబంధం నచ్చడంతో కల్యాణము జరిపించి అత్తవారింటికి పంపించాడు.

కొద్ది నెలల తరువాత రామయ్య సర్వీస్ నుండి రిటైర్ అయ్యారు. ఈలోగా రవి తాను కూడబెట్టిన డబ్బులతో పాటు బ్యాంకులో లోన్ కూడా తీసుకొని బెంగళూరులో ఒక ఫ్లాట్ తీసుకున్నాడు. భార్యా సమేతంగా రామయ్య బెంగళూరు వెళ్లి గృహ ప్రవేశం కార్యక్రమంలో పాల్గొని కొద్ది రోజులు అక్కడ ఉండి మరల ఆనందపురం వచ్చేసాడు.

.....

ఆనందపురం సొంత ఇంట్లో రామయ్య దంపతులకు రోజులు బాగానే గడిచాయి. ఇంట్లో భార్యభర్తలు ఇద్దరే ఉన్నప్పటికీ, రామయ్యకు రోజంతా స్నేహితులతోను, బంధువులతోను గడచిపోయేది. ప్రతి రోజూ పిల్లలు రవి, సుజాత ఇంటికి ఫోన్ చేసి తల్లిదండ్రుల యోగక్షేమాలు తెలుసుకొనేవారు.

ఉదయం లేవగానే ఊరు చివరనున్న పార్క్‌లో ఓ గంటపాటు స్నేహితులతో వాకింగ్ చేసి, మరో గంటసేపు వారితో కబుర్లు చెప్పి, దారిలో కనిపించి పలుకరించే వారితో కాసేపు మాట్లాడి ఇంటికి వచ్చేవాడు.

సాయంత్రం స్కూల్ పిల్లలు చాలా మంది ఇంటికి వచ్చి వారి ఇంటి అరుగు మీద కూర్చొని చదువుకొనేవారు. వారికి చదువులో ఏవైనా సందేహాలుంటే మాస్టార్ని అడిగి తెలుసుకొనేవారు.

రామయ్య అప్పుడప్పుడు భార్య కృష్ణవేణి తో కలసి దేవాలయాలకు, బంధువుల, స్నేహితుల ఇళ్లలో జరిగే శుభాకార్యాలకు హాజరయ్యేవాడు. ఇద్దరూ తీరిక సమయంలో పెరట్లో మొక్కలకు నీళ్లు పోసి, కలుపు తీసి మొక్కల సంరక్షణ చేసేవారు.

అలా రోజులు సాఫీగా సాగిపోతున్న సమయంలో రామయ్య జీవితంలో మలుపు తిరిగే ఒక సంఘటన జరిగింది.

గైనిక్ సమస్యతో ఇబ్బంది పడుతున్న భార్య కృష్ణవేణిని డాక్టర్‌కు చూపిద్దామని పట్నంలో హాస్పిటల్‌కు తీసుకువెళ్ళాడు రామయ్య. అన్ని టెస్టులు పూర్తయిన తరువాత డాక్టర్ రామయ్యను లోనకు పిలచి చెప్పిన మాట విని రామయ్య నిలువెల్లా వణికి...

పోయాడు. ఆమెకు క్యాన్సర్ సోకిందని, ప్రస్తుత ఆరోగ్య పరిస్థితి బాగా లేదని డాక్టర్ చెప్పినప్పుడు నోటివెంట మాట రాక స్థాణువులా నిలుచుండిపోయాడు. ఒక మంచి హాస్పిటల్‌కు తీసుకవెళ్లి ట్రీట్‌మెంట్ ఇప్పిస్తే కొంతవరకు నయం కావొచ్చని డాక్టరు చెప్పారు.

కొన్నాళ్లవరకు సీరియస్ అనే విషయాన్ని భార్యకు, పిల్లలకు చెప్పకుండా తన మనసులోనే దాచుకొని క్యాన్సర్ హాస్పిటల్‌లో చూపించి ట్రీట్‌మెంట్ ఇప్పించాడు.

భార్యను మంచం మీదనుంచి కదలనీయకుండా అన్ని సేవలు చేసాడు. ట్రీట్‌మెంట్ కోసం డాక్టర్లు చెప్పినప్పుడల్లా హాస్పిటల్‌కు తీసుకెళ్ళేవాడు. ఆలా కొన్నాళ్ళు గడిచాయి. కానీ రాను రాను ఆమె ఆరోగ్యం క్షీ ణిస్తూ ఉండడంతో డాక్టర్లు మళ్ళీ అన్ని పరీక్షలు చేసి, రామయ్యను పిలచి ఆమె కొద్ది రోజులకు మించి బతకదని చెప్పారు. ఇక తప్పని పరిస్థితిలో రామయ్య అసలు విషయాన్ని పిల్లలతో చెప్పక తప్పలేదు.

తల్లి అనారోగ్యం సంగతి తెలిసిన వెంటనే కొడుకు రవి ఆఫీసుకు సెలవుపెట్టి కుటుంబ సమేతంగా బెంగళూరు నుండి ఆనందపురం వచ్చేసాడు.

కుమార్తె సుజాత కూడా ఏడ్చుకుంటూ పుట్టిల్లు చేరింది. ఎవరు ఎన్ని ప్రయత్నాలు చేసినా, ఎంత కష్టపడినా కృష్ణవేణి కొద్ది రోజులు మృత్యువుతో పోరాడి చివరికి కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితుల సమక్షంలో కన్ను మూసింది.

కృష్ణవేణి చనిపోయిన సంగతి తెలిసి ఊరి ప్రజలంతా సానుభూతితో ఆమెను కడసారి చూసి సాగనంపడానికి వచ్చారు. రామయ్యను, కుటుంబ సభ్యులను ఓదార్చారు.

నెల రోజులు గడచిపోయాయి. తనకు అన్నివేళలా తోడు నీడగా వుండి, అన్ని పనులలో సహకరించి ఆనందాన్ని పంచిపెట్టిన భార్య కృష్ణవేణి వియోగాన్ని భరిస్తూ కాలం భారంగా గడిపాడు రామయ్య. బంధువులు ఒక్కొక్కరు విషయం తెలిసి వచ్చి సంతాపాన్ని తెలియజేస్తూ వెళుతున్నారు. కొన్ని రోజుల పాటు రవి ఆఫీస్‌కు సెలవుపెట్టి ఇక్కడే వుండిపోయాడు. కష్ట సమయంలో కొన్నాళ్ళు తండ్రికి తోడుగా వుంటే బావుంటుందని సుజాత భర్తను ఒప్పించి ఇక్కడే వుండిపోయింది. రామయ్యకు ఒంట్లో చాలా నీరసంగా ఉండడంతో రవి హాస్పిటల్‌కు తీసుకవెళ్లి చూపించాడు.

**"నాన్నా.. నాన్నా..!" అని పిలుస్తూ అచేతనంగా మంచం మీద పడివున్న రామయ్య శరీరాన్ని కదిపిన స్వప్నకు విషయం అర్థమయ్యింది. బోరున ఏడుస్తూ తండ్రి శరీరం మీద కూలిపోయింది.**

రోజులు గడుస్తున్నకొద్దీ బాధ నుండి కొంచెం తెరుకుంటున్నారు. అందరూ ఎవరికి వారు వెళిపోతే తండ్రి రామయ్య ఒంటరిగా ఈ ఇంట్లో ఉండడం చాలా కష్టం కనుక అతన్ని కూడా బెంగళూరు తీసుకువెళ్లాలని పిల్లలు ఆలోచించారు.

అదే విషయాన్ని చెప్పినపుడు ఈ ఇంటిని, ఊరును, యిక్కడి జనాలను విడచి వెళ్ళడానికి ఇష్టంలేని రామయ్య ఈ ఇంట్లోనే యింకా కొంత కాలం ఉంటానని పిల్లలకు నచ్చచెప్పడానికి ప్రయత్నించాడు. ఈ విషయంలో చాలా తర్జన భర్జనలు జరిగాయి. కానీ బంధువులు, స్నేహితులు అందరు కూడా రవి మాటకే సమర్థించి, రామయ్య ఒంటరిగా ఇక్కడ ఉండడం కన్నా కొడుకుతో బెంగళూరు వెళ్లిపోవడం మంచిదని హితవు చెప్పారు. కొన్ని సంవత్సరాలుగా ఇక్కడి ప్రజలతో మమేకమైన రామయ్యకు తన శేష జీవితాన్ని ఆ నలుగురి మధ్య గడపాలని, వారి సమక్షంలోనే తాను ఆఖరి శ్వాస పీల్చుకోవాలని తపన. ఈ బెంగళూరు ప్రయాణం కోసం ఆలోచిస్తే మనసంతా ఆందోళన, భయం, బాధతో నిండిపోతున్నది.

.....

"మామయ్య గారూ ఇంట్లోకి రండి, చాలా సేపటినుండి బాల్కనీలోనే కూర్చుండి పోయారు!"

కోడలు పిలుపుతో ఆలోచనల నుండి బయటకు వచ్చాడు రామయ్య. ఇంట్లో కొడుకు, కోడలు ప్రయాణానికి కావలసిన వస్తువులన్నీ సర్దుతున్నారు. రేపే బెంగళూరు ప్రయాణం. "నాన్నా! మీ ముఖ్యమయిన వస్తువులు, మందులు, బట్టలు అన్నీ ప్యాక్ చేసాం. ఇంకేవైనా తీసుకెళ్లాల్సినవి ఉంటే చెప్పండి" రవి అడిగిన ప్రశ్నకు లేదని చెప్పి మళ్ళీ ఆలోచనల్లో పడిపోయాడు రామయ్య.

"బాధపడకండి నాన్నా! మీ ఇష్టానికి విరుద్ధంగా మీకు బెంగళూరు తీసుకువెళుతున్నాం. కానీ మీరొక్కరే ఈ ఇంట్లో ఎలా ఉండగలరు? మీ ఆరోగ్యం కూడా బాగాలేదు. బెంగళూరు వెళ్ళాక మంచి హాస్పిటల్‌లో చూపిద్దాం" అని రవి తండ్రికి బోధపరిచాడు.

రామయ్య మౌనమే దానికి సమాధానం. రాత్రి అందరూ భోజనాలు చేసి పడుకోవడానికి గదుల్లోకి వెళ్లారు.

రామయ్య ఆలోచిస్తూ మంచం మీద పడుకున్నాడు. అతనికి నిద్ర రావడం లేదు. మనసు బాగులేకపోవడం వల్ల చాలా నీరసంగా అనిపించింది. లేచి కూర్చొని మంచినీళ్లు తాగాడు. గుండె బరువుగా అనిపించింది. అతని ఆలోచనలు కొనసాగుతూనే వున్నాయి. కళ్ళ నుండి జారుతున్న నీటి ధారలను చేతితో తుడుచుకున్నాడు. చాలా సేపటికి తెలియకుండా నిద్రలోకి జారుకున్నాడు.

తెల్లవారింది. ఎప్పటిలాగానే ప్రభాత సూర్యుడు తన అరుణ కిరణాలతో ప్రపంచానికి దర్శనమిచ్చాడు. రోడ్ మీద జన సంచారం ప్రారంభమయ్యింది. వీధిలో పాలవాడు, పేపర్ పంచేవాడు తమ పనుల్లో నిమగ్నమై యున్నారు.

రామయ్య గారి ఇంట్లో కొడుకు రవి, కోడలు స్నేహ కూడా లేచి ప్రయాణం కోసం కావలసినవన్నీ చెక్ చేసుకుంటున్నారు. కానీ రామయ్య గారి గది తలుపులు తెరచుకోలేదు. రామయ్య మంచం మీద నుండి యింకా లేవలేదు. చాలా సేపయ్యింది.. నాన్నగారు యింకా లేవలేదేమని తలచిన కూతురు సుజాత గదిలోకి వచ్చి మంచం మీద నున్న తండ్రిని చూసి ఆశ్చర్యపొయింది.

"నాన్నా.. నాన్నా..!" ఆని పిలుస్తూ అచేతనంగా మంచం మీద పడివున్న రామయ్య శరీరాన్ని కదిపిన స్వప్నకు విషయం అర్థమయ్యింది. భోరున ఏడుస్తూ తండ్రి శరీరం మీద కూలిపొయింది.

రవి, స్నేహ పరుగున వచ్చి జరిగిన విషయం తెలిసి కుమిలిపోయారు. క్షణాల్లో ఈ విషయం ఊరిలో అందరికీ తెలిసిపోయింది. ఊరి జనమంతా ఇంటి ముందు గుమికూడారు. రామయ్య బంధువులు, స్నేహితులు అందరూ రామయ్య కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఊళ్లో తన శ్రేయోభిలాషులైన ఆ నలుగురి మధ్య తన శేష జీవితం గడవాలని, వారి సమక్షంలోనే జీవితం గడపాలని అనుకున్న రామయ్య ఆశ నెరవేరింది.

# కన్నడ దేశంలో వున్నా మాతృభాష తెలుగే!

పావగడలో తెలుగు శాసనం కర్ణాటక రాష్ట్రం తుమకూరు జిల్లా పావగడ తాలూకాలోని కన్నెమేడి గ్రామం వద్ద లభించిన శిలాఫలకంపై చెక్కబడిన ఈ శాసనం తెలుగు భాషలో, కన్నడ లిపిలో రాయబడింది. ఈ ప్రాంతమంతా కన్నడ దేశంలో వున్నా 99 మంది ప్రజల మాతృభాష తెలుగే. ఈ శాసనంలో పేర్కొన్న తేదీ శక సంవత్సరం 1479 పింగళ నామ సంవత్సరం ఫాల్గుణ బహుళ పంచమి గురువారం, అది తిదీని 1557 ఫిబ్రవరి 18వ తేదీనకు సరిపోతుంది.

**విజయనగర రాజుల కాలంలో ఈ సేవలన్నీ వంశపారంపర్యంగా కొనసాగేవి. ప్రతి సేవకుడికి ఒక మాన్యం రూపంలో భూమి లేదా వార్షిక ధాన్యం ఇచ్చేవారు. అందుకే శాసనాల్లో ఈ సేవ, వారి పుణ్యం కోసం ఇంత భూమిని దానం చేశాం అని రాసేవారు.**

శ్రీమాన్ మహారాజాధిరాజ రాజపరమేశ్వర శ్రీ వీరప్రతాప శ్రీ సదాశివదేవ మహారాయలు విజయనగర సింహాసనాన్ని పాలిస్తున్న కాలంలో పెనుకొండ రాజ్యంలోని కన్నమేటి అగ్రహారంలో ఎల్లంభట్టు కుమారుడైన నారసింహభట్టు అనే బ్రాహ్మణుడు సిద్ధివినాయక స్వామి ఆలయాన్ని నిర్మించి స్వామివారి విగ్రహ ప్రతిష్టను నిర్వహించాడు.

అంతేకాకుండా ఆలయ ఉత్సవాల సమయంలో దేవుని ఊరేగింపులో గొడుగు పట్టే 32 మంది ఆలయ సేవకుల కోసం కొందరు వ్యక్తులు దానధర్మాలు చేసినట్లు ఈ శాసనం స్పష్టం చేస్తోంది. విజయనగర సామ్రాజ్య కాలంలో ఆలయ నిర్మాణాలు, ఆలయ సేవా వ్యవస్థ ఎటువంటివిగా ఉండేవో తెలియజేసే ఈ శాసనం చారిత్రకంగా అత్యంత ముఖ్యమైన ఆధారం. దీని రికార్డు పురాతత్వ సర్వే ఆఫ్ ఇండియా ఎపిగ్రఫీ విభాగం డైరెక్టర్ డా. మునిరత్నం రెడ్డి వారి ద్వారా అధికారికంగా నిర్ధారించబడింది.

గొడుగులు పట్టేవారి గురించి విశదంగా చూస్తే ఈ పేరు వెనక ఉన్న అర్థం గొడుగు పట్టేవారు అని, అంటే దేవునికి పట్టే పెద్దఛత్రాన్ని పట్టే సేవకులు అని తెలుస్తోంది. వీరు సాధారణమైన గొడుగులు పట్టే వారు కాదు , ఆలయంలో ఒక పవిత్రమైన సేవను నిర్వహించే ఉద్యోగులు వీరు.

విజయనగర సామ్రాజ్య కాలంలో ప్రతి పెద్ద దేవాలయంలో ఉత్సవాలు, రథోత్సవాలు, బ్రహ్మోత్సవాలు జరిగినప్పుడు దేవుని వెంట నడిచే సేవకుల బృందంలో ఛత్రం పట్టేవారు ఒక భాగం. వారి పని దేవునికి ఎండ, గాలివానలు తగలకుండా, గౌరవ సూచకంగా అలంకరించిన పట్టు లేదా వెండి బంగారు గొడుగులు పట్టడం. రాజుకు ఛత్రం పట్టే సంప్రదాయం ఎలా ఉంటుందో అలాగే దేవునికి కూడా ఈ ఛత్ర సేవ అనేది అత్యంత గౌరవప్రదమైన సేవగా భావించేవారు.

కన్నెమేడి శాసనంలో పేర్కొన్న 32 మంది గొడుగుల వారు అంటే సిద్ధివినాయక ఆలయంలో ఉత్సవ సమయంలో వంతుల వారీగా గొడుగు పట్టడానికి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఒక పెద్ద బృందం ఉండేదని అర్థం. వారి పోషణ కోసం వారి పుణ్యం కోసం ఎవరో దానం ఇచ్చారని స్పష్టమవుతోంది. ఈ రోజుకూ తిరుమల శ్రీశైలం లాంటి పెద్ద దేవాలయాల్లో స్వామివారి ఉత్సవ విగ్రహం ముందు ఇద్దరు వెండి లేదా బంగారు గొడుగులు పట్టడం చూస్తుంటాం, అదే పూర్వ సంప్రదాయం కొనసాగింపు.

దేవుని ఊరేగింపులో ఉండే సేవకులను పూర్వం ఆలయ పరివారాలు లేదా స్థానికులు లేదా సేవకులు అనేవారు. ఇది ఒక పెద్ద క్రమబద్ధమైన వ్యవస్థ. దీనిలో అగ్రభాగంలో నడిచేవారుగా మాలమాదిగలు నూనె దివిటీలతో దారి చూపుతూ రాత్రి ఊరేగింపుల్లో వెలుగు ఇచ్చే దివిటీవారు, వీరికి అంటరానితనం లేదు. నాటి సమాజం వీరిని అందరితో సమానంగా గౌరవించేది. తాళాలు కొడుతూ దేవుడు వస్తున్నాడని హెచ్చరించే అగ్రతాళం వారు కూడా ఉండేవారు.

దేవునికి అత్యంత సమీపంలో ఉండే పవిత్ర సేవకులలో ఛత్రధారులైన గొడుగుల వారు, దేవునికి ఇరువైపులా చామరాలు వీచే చామరధారులు, విసనకర్రలు వీచే వింజామర వారు, దేవునికి ముందు అద్దం పట్టే అద్దం పట్టే వారు ఉండేవారు. మంగళకరంగా ఊరేగింపును నింపే సంగీత సేవకులలో నాదస్వరం, డోలు, శంఖం జయఘంట వాయించే మేళగాళ్ళు ప్రధానంగా ఉండేవారు.

ఆలయ నిర్వహణ సేవలో దేవుని పల్లకీ రథం మోసే పరిచారకులు, పూలదండలు తెచ్చేవారు, ప్రసాదాలు నైవేద్యాలు మోసే పాకశాల వారు, తోరణాలు కట్టేవారు, ముగ్గు వేసేవారు, మరియు దేవుని ముందు నాట్య సేవ చేసే దేవదాసీలు సానులు ఉండేవారు.

విజయనగర రాజుల కాలంలో ఈ సేవలన్నీ వంశపారంపర్యంగా కొనసాగేవి. ప్రతి సేవకుడికి ఒక మాన్యం రూపంలో భూమి లేదా వార్షిక ధాన్యం ఇచేనవారు. అందుకే శాసనాల్లో ఈ సేవ వారి పుణ్యం కోసం ఇంత భూమిని దానం చేశాం అని రాసేవారు. దేవాలయాన్ని కేవలం ప్రార్థనా స్థలంగా మాత్రమే కాకుండా ఒక సంపూర్ణ సామాజిక, ఆర్థిక వ్యవస్థగా నిర్వహించే విధానానికి ఈ శాసనాలు సజీవ సాక్ష్యాలు.

కన్నెమేడి శాసనంలో చెప్పబడిన గొడుగులవారు అంటే ఆ సిద్ధి వినాయక ఆలయంలో ఛత్ర సేవ కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పెద్ద బృందం ఉండేదని దీని ద్వారా తెలుస్తోంది.. ఈ విధంగా చూస్తే ఒక్క ఆలయ సేవకు మాత్రమే 32 మంది నియమించబడటం ఆలయ ప్రాముఖ్యతను, ఆ సమయంలోని దాన ధర్మ సంస్కృతిని తెలియజేస్తుంది.

డా॥ మునిరత్నంరెడ్డి,
డైరెక్టర్ ఆఫ్ ఎపిగ్రఫి భారత పురావస్తు శాఖ

# రీల్స్‌తో జాగ్రత్త..

కొందరి క్షణకాలపు సరదా... మరి కొందరి జీవితాల్లో మాత్రం జీవితాంతం చెరిగిపోని విషాదంగా మిగులుతోంది. నవ్వులు, కేరింతలు, స్నేహితుల సందడితో మొదలైన విహారయాత్రలు... ఒక్కసారిగా కన్నీటి పర్యంతం చేస్తున్నాయి. రీల్స్, సెల్ఫీల మోజులో ప్రమాదాలకు చేరువవుతున్న విద్యార్థులు, యువత ఉదంతాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఈత రాకుండానే నీటిలోకి దిగడం.. అలల ఉధృతిని అంచనా వేయకపోవడం.. ఒకరిని కాపాడేందుకు మరొకరు నీటిలోకి దూకడం.. ప్రమాదకర ప్రదేశాల్లో ఒక అందమైన ఫొటో లేదా ఆకర్షణీయమైన రీల్ కోసం ప్రాణాలను పణంగా పెట్టడం... ఇలా సరదాగా మొదలైన క్షణాలు కొన్ని కుటుంబాలకు జీవితాంతం తీరని కడుపుకోతను మిగులుస్తున్నాయి.

చదువుల ఒత్తిడి నుంచి కాస్త ఉపశమనం పొందడానికి... స్నేహితులతో కలిసి సరదాగా గడపడానికి... ప్రకృతి అందాలను ఆస్వాదించడానికి వెళ్లే విహారయాత్రలు ఆనందానికి జ్ఞాపకాలుగా మిగలాలి. కానీ అప్రమత్తత లోపిస్తే అవే విహారయాత్రలు విషాదానికి చిరునామాలవుతున్నాయి.

పచ్చని ప్రకృతి మధ్య కేరింతలు కొట్టాల్సిన యువత... ఇంటికి చేరాల్సిన సమయంలో విగతజీవులుగా మారడం కేవలం ఒక కుటుంబానికే కాదు, మొత్తం సమాజానికే కలచివేసే విషాదం. ఒక రీల్ కోసం తీసిన కొన్ని సెకన్ల వీడియో ఉండవచ్చు.. ఒక ఫొటోకు వచ్చిన వందల లైకులు ఉండవచ్చు.. కానీ ప్రాణం పోయిన తర్వాత ఆ జ్ఞాపకాలు కుటుంబ సభ్యుల కళ్లలో జీవితాంతం కన్నీళ్లుగానే మిగులుతాయి.

ఇటీవల విశాఖపట్నంలోని రుషికొండ సమీపంలో విహారయాత్రకు వచ్చిన ముగ్గురు పాఠశాల విద్యార్థులు సముద్రపు అలల ఉధృతికి కొట్టుకుపోయి మృతి చెందిన ఘటన కలచివేసింది. ఇలాంటి సంఘటనలు ఒక్క ప్రాంతానికే పరిమితం కావడం లేదు.

దేశంలోని వివిధ పర్యాటక ప్రాంతాల్లో సముద్రాలు, నదులు, జలపాతాలు, చెరువులు ప్రమాదాలకు కేంద్రాలవుతున్నాయి.

ఇలాంటి ప్రమాదాలను పరిశీలిస్తే ప్రధానంగా రెండు అంశాలు కనిపిస్తాయి. ఒకటి.. సోషల్ మీడియా రీల్స్, సెల్ఫీల కోసం ప్రమాదకరమైన ప్రదేశాలకు వెళ్లడం. రెండోది.. నీటి లోతు, ప్రవాహం, అలల ఉధృతిని అంచనా వేయకుండా నీటిలోకి దిగడం.

## లైకుల మోజులో ప్రమాదాలు

స్మార్ట్‌ఫోన్ చేతిలోకి వచ్చిన తర్వాత ప్రతి అనుభవాన్ని కెమెరాలో బంధించడం సాధారణమైంది. అందులో తప్పేమీ లేదు. మంచి ఫొటోలు తీసుకోవడం, ప్రకృతి అందాలను చిత్రీకరించడం కూడా జ్ఞాపకాలను పదిలం చేసుకునే మార్గమే. కానీ ఒక మంచి ఫొటో లేదా ఆసక్తికరమైన రీల్ కోసం ప్రమాదకరమైన ప్రదేశాలను ఎంచుకోవడం మాత్రం ప్రాణాంతకంగా మారుతోంది.

జలపాతాల అంచున నిలబడటం.. తడి బండరాళ్లపై నడవడం.. సముద్రపు అలలు ఉధృతంగా వస్తున్న సమయంలో శిలలపైకి వెళ్లడం.. రైల్వే ట్రాక్‌ల వద్ద వీడియోలు తీయడం.. వెనుక రైలు వస్తున్నప్పటికీ కెమెరా వైపు చూస్తూ స్టంట్లు చేయడం వంటి చర్యలు క్షణాల్లో ప్రమాదాలకు దారితీస్తున్నాయి.

సోషల్ మీడియాలో వచ్చే కొన్ని లైకులు, వ్యూస్, ఫాలోవర్ల కోసం ప్రాణాలను పణంగా పెట్టడం చివరకు కన్నవారికి తీరని కడుపుకోతను మిగులుస్తోంది. ఒక వీడియో వైరల్ కావచ్చు.. కొన్ని రోజులకు అది మరుగున పడవచ్చు. కానీ ఒక ప్రాణం పోతే ఆ కుటుంబం ఎదుర్కొనే విషాదం మాత్రం జీవితాంతం ఉంటుంది.

లైక్ ఒక సంఖ్య మాత్రమే.. ప్రాణం మాత్రం ఒక కుటుంబం. సముద్రం అందంగా కనిపిస్తుంది.. కానీ సురక్షితం అని కాదు! సముద్రతీరం ప్రశాంతంగా కనిపించినంత మాత్రాన నీరు కూడా ప్రశాంతంగా ఉంటుందని భావించడం ప్రమాదకరం. అలల వెనుక ప్రవాహాల స్వభావం, నీటి లోతు, సముద్రపు అడుగుభాగంలోని మార్పులు సాధారణ పర్యాటకులకు తెలియకపోవచ్చు.

మహారాష్ట్రలోని దివేగర్ బీచ్‌కు విహారయాత్రకు వెళ్లిన విద్యార్థులు సముద్రపు లోతు, అలల ఉధృతిని సరిగ్గా అంచనా వేయలేక మునిగిపోయిన ఘటనలు కూడా ఇలాంటి ప్రమాదాల తీవ్రతను గుర్తుచేస్తున్నాయి. సముద్రం, నది, జలపాతం విషయంలో ఒక విషయం గుర్తుంచుకోవాలి. నీరు కనిపించడం వేరు.. నీటి స్వభావాన్ని అర్థం చేసుకోవడం వేరు.

## ఈత రాకపోతే... నీటిలోకి ఎందుకు?

పిక్నిక్‌కు వెళ్లినప్పుడు స్నేహితులంతా నీటిలోకి దిగుతుంటే తానూ దిగాలనే ఉత్సాహం కలగవచ్చు. కానీ ఈత రాని వ్యక్తికి ఇది అత్యంత ప్రమాదకరమైన నిర్ణయం. నదులు, జలపాతాలు, చెరువులు పైకి ప్రశాంతంగా కనిపించినా లోపల సుడిగుండాలు, బలమైన నీటి ప్రవాహాలు, జారుడు రాళ్లు, అకస్మాత్తుగా లోతు పెరిగే ప్రాంతాలు ఉండవచ్చు. నీటి లోతును కళ్లతో అంచనా వేయడం సాధ్యం కాదు. ఈత రాని వ్యక్తి ఒక్కసారిగా లోతైన నీటిలో పడితే భయాందోళనకు గురయ్యే అవకాశం ఉంది. ఆ సమయంలో తనను తాను రక్షించుకోవడం కూడా కష్టమవుతుంది.

అందుకే ఈత రాకపోతే తెలియని నీటి

ప్రదేశాల్లోకి దిగకపోవడం కంటే గొప్ప జాగ్రత్త మరొకటి లేదు.

నీటిలో ఒకరు మునిగిపోతుంటే స్నేహితులు వెంటనే అతడిని కాపాడాలని ప్రయత్నించడం సహజం. కానీ ఈత రాని వ్యక్తి నేరుగా నీటిలోకి దూకడం మరో విషాదానికి దారితీయవచ్చు.

మునిగిపోతున్న వ్యక్తి భయంతో తనను కాపాడేందుకు వచ్చిన వ్యక్తిని గట్టిగా పట్టుకునే అవకాశం ఉంటుంది. దీంతో ఇద్దరూ ప్రమాదంలో పడవచ్చు. అందువల్ల నీటిలో ఎవరైనా మునిగిపోతుంటే ఈత రాని వ్యక్తి నేరుగా నీటిలోకి దూకకూడదు. వెంటనే స్థానిక రక్షణ సిబ్బందికి సమాచారం ఇవ్వాలి. తాడు, పొడవైన కర్ర, తేలియాడే వస్తువు వంటి సహాయక సాధనాలు అందుబాటులో ఉంటే వాటిని ఉపయోగించాలి.

కాపాడాలనే ఆతృత మంచిదే.. కానీ కాపాడే పద్ధతి తెలిసి ఉండాలి.

## రైల్వే పట్టాలపై రీల్స్.. క్షణాల్లో విషాదం

రీల్స్ ప్రభావం నీటి ప్రదేశాలకే పరిమితం కాలేదు. రైల్వే ట్రాక్‌లపై నడుస్తూ వీడియోలు తీయడం, రైలు సమీపంలో నిలబడి సెల్ఫీలు తీసుకోవడం వంటి ప్రమాదకర చర్యలు కూడా కనిపిస్తున్నాయి. రైల్వే పట్టాలు ఫొటోలకు అందమైన నేపథ్యంగా కనిపించవచ్చు. కానీ అవి నడిచే మార్గాలు కాదు. రైలు వేగం, దూరం, బ్రేకింగ్ దూరం వంటి అంశాలను సాధారణ వ్యక్తి అంచనా వేయడం కష్టం.

ఒక్క క్షణం నిరక్ష్యం జీవితాన్నే మార్చేయవచ్చు. ఒక రీల్ కోసం తీసుకున్న అడుగు జీవితంలో చివరి అడుగుగా మారకూడదు.

- మనిషి రెండు అంశాలు దాచిపెట్టడం కష్టం. మొదటిది.. తాను వున్న విషయం. రెండోది: తను ప్రేమించిన విషయం.
- తక్కువ పదాలతో ఎక్కువ విషయాలు చెప్పడం మేధావుల లక్షణమైతే చెప్పేదేమీ లేకపోయినా ఎక్కువ పదాలు వినియోగించడం మూర్ఖుల లక్షణం.
- హాస్యం అంటే గంభీరంగా భావిస్తూ సరదాగా ఆలోచించడం.

పర్యటనకు వెళ్లడం తప్పు కాదు. విహారయాత్రలు యువతకు అవసరమే. స్నేహితులతో కలిసి గడపడం, ప్రకృతిని చూడడం, కొత్త ప్రదేశాలను సందర్శించడం మానసిక ఉల్లాసాన్ని ఇస్తాయి. సమస్య పర్యటనలో లేదు. ప్రమాదాన్ని సరదాగా తీసుకోవడంలో ఉంది.

"అందరూ చేస్తున్నారు కదా.. అనే ఆలోచన ప్రమాదకరమైన చోట మరింత ప్రమాదకరం. ఒక స్నేహితుడు నీటిలోకి దిగాడని మిగిలినవారూ దిగాల్సిన అవసరం లేదు. ఒకరు రీల్ తీస్తున్నారని మనమూ అదే చేయాల్సిన అవసరం లేదు. స్నేహితుల మధ్య "వద్దు" అని చెప్పగలగడం కూడా ఒక రక్షణ నైపుణ్యమే.

## ఉపాధ్యాయులదే కీలక బాధ్యత

పాఠశాలలు, కళాశాలలు నిర్వహించే విహారయాత్రల్లో విద్యార్థుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలి. పర్యటనకు ముందే విద్యార్థులకు స్పష్టమైన భద్రతా సూచనలు ఇవ్వాలి. ప్రమాదకర ప్రదేశాల్లో విద్యార్థులను ఒంటరిగా వదిలేయకూడదు. ఉపాధ్యాయులు, నిర్వాహకులు విద్యార్థులను చిన్న చిన్న బృందాలుగా పర్యవేక్షించడం మంచిది. నీటి ప్రదేశాలకు వెళ్లే ముందు స్థానిక పరిస్థితులు, వాతావరణం, నీటి ప్రవాహం, హెచ్చరికలను తెలుసుకోవాలి.

పర్యాటక ప్రాంతాల్లో స్థానిక గైడ్‌లు లేదా రక్షణ సిబ్బంది సూచనలు ఉంటే వాటిని తప్పనిసరిగా పాటించాలి.

పిల్లలకు ఈత నేర్పించడం కేవలం క్రీడగా కాకుండా ఒక జీవిత రక్షణ నైపుణ్యంగా చూడాలి. అయితే ఈత వచ్చిందని ప్రతి నది, సముద్రం లేదా జలపాతంలోకి దిగవచ్చనే భావన కూడా తప్పే. ఈత తెలిసినవారైనా తెలియని నీటి ప్రదేశాల్లో జాగ్రత్తగా ఉండాలి. స్థానిక రక్షణ సిబ్బంది సూచనలు పాటించాలి. బోటింగ్, వాటర్ స్పోర్ట్స్ వంటి కార్యకలాపాల్లో లైఫ్ జాకెట్‌ను సరిగ్గా ధరించాలి.

## పాటించాల్సిన పంచ సూత్రాలు

**నో సెల్ఫీ.. నో రీల్స్**

జలపాతాల అంచులు, రైల్వే ట్రాక్‌లు, కొండ అంచులు, ప్రమాదకర సముద్ర ప్రాంతాల్లో వీడియోలు, సెల్ఫీలు వద్దు.

**హెచ్చరిక బోర్డులను గౌరవించాలి:** 'డేంజర్ జోన్', 'నో ఎంట్రీ', 'నో స్విమ్మింగ్' వంటి సూచనలు కనిపిస్తే వాటిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉల్లంఘించకూడదు.

**ఈత రాకపోతే నీటిలోకి దిగకూడదు..** స్నేహితుల ఒత్తిడి ఉన్నా నిర్ణయం మార్చుకోకూడదు. నీటి లోతు తెలియని ప్రదేశంలో అడుగు పెట్టకూడదు.

**లైఫ్ జాకెట్ తప్పనిసరి..** బోటింగ్, వాటర్ స్పోర్ట్స్ వంటి కార్యకలాపాల్లో నాణ్యమైన లైఫ్ జాకెట్‌ను సరిగ్గా ధరించాలి.

**మద్యం సేవించి నీటికి దూరంగా ఉండాలి..** మద్యం సేవించిన తర్వాత నీటిలోకి దిగడం ప్రమాదాన్ని మరింత పెంచుతుంది. అలాంటి పరిస్థితుల్లో నీటికి దూరంగా ఉండటమే సురక్షితం.

## తల్లిదండ్రులు ఆలోచించాలి

పిల్లలు విహారయాత్రకు వెళ్తున్నప్పుడు "బాగా ఎంజాయ్ చేసి రా" అని చెప్పడంతో పాటు "జాగ్రత్తగా ఉండు" అనే మాటను కూడా స్పష్టంగా చెప్పాలి.

ప్రమాదకరమైన ప్రదేశాల్లో ఫొటోలు, రీల్స్ కోసం ప్రాణాలను పణంగా పెట్టవద్దని ముందుగానే అవగాహన కల్పించాలి. స్నేహితుల ఒత్తిడికి లొంగకుండా ప్రమాదకరమైన పనికి నిరాకరించగల ధైర్యాన్ని కూడా పిల్లల్లో పెంచాలి.

పిల్లల భద్రత విషయంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పర్యాటక నిర్వాహకులు, ప్రభుత్వ యంత్రాంగం కలిసి పనిచేసినప్పుడే ప్రమాదాలను గణనీయంగా తగ్గించగలుగుతాం.

కళ్లతో చూసి ఆస్వాదించాలి... కెమెరాతో ప్రమాదాన్ని కొనితెచ్చుకోకూడదు విహారయాత్ర అనేది జీవితాన్ని ఆస్వాదించడానికి. జీవితాన్నే కోల్పోవడానికి కాదు.

ఒక రీల్‌కు వచ్చే లైక్ తాత్కాలికం. ఒక ఫొటోకు వచ్చే వ్యూస్ తాత్కాలికం. కానీ మన ప్రాణం మాత్రం కుటుంబానికి శాశ్వతమైన బంధం. ప్రకృతి అందాలను కళ్లతో ఆస్వాదిద్దాం... ప్రతి అందమైన క్షణాన్ని కెమెరాలో బంధించాలనే ఆరాటంతో ప్రమాదాల బారిన పడకండి. విహారయాత్రలు జ్ఞాపకాలను మిగల్చాలి... విషాదాలను కాదు.

– డాక్టర్ ఎన్.బి. సుధాకర్ రెడ్డి

# ఆలయాలకు నిలయం.. సువర్ణముఖీ తీరం

ఉత్తరవాహినిగా సాగుతున్న జీవనది సువర్ణముఖి నదీ తీరాన వెలసిన దివ్యక్షేత్రం 'అర్ధనారీశ్వరాయం.' ఈ ఆలయానికి మడి మాన్యాలున్నాయి. శ్రీకాళహస్తీశ్వరాలయానికి సమీపంలోనే ఉన్నా అభివృద్ధికి ఆమడ దూరంలో నిలిచింది. ఈ ఆలయ ప్రాశస్త్యాన్ని గుర్తించిన ఓ నాయకుడు అభివృద్ధికి ప్రణాళిక రచించి, అభివృద్ధికి బాటలు వేసారు. ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. నాయుడుపేట-పూతల పట్టు ఆరు లేన్ల రహదారి నుంచి విశాలపురానికి చక్కటి తారు రోడ్డు వేయించారు. ఆలయ పరిసరాలను భక్తి భావం ఉట్టిపడేటట్లు తీర్చిదిద్దారు. విశాలమైన ఆవరణలో భక్తులకు మౌలిక సదుపాయాలు కల్పించారు. ఇప్పుడు ఈ ఆలయానికి ప్రతి రోజూ భక్తులు హాజరై స్వామి అమ్మవార్లకు ధూప, దీప నైవేద్యాలతో పాటు మొక్కులు తీర్చుకుంటున్నారు.

**ఆలయ ప్రాశస్త్యం:** భారతీయ సనాతన ధర్మంలో శివశక్తుల ఏకత్వానికి ప్రతీక అయిన అర్ధనారీశ్వర తత్వం.. సృష్టిలోని స్త్రీ పురుష సమానత్వానికి, ప్రకృతి పురుషుల అవినాభావ సంబంధానికి నిలువెత్తు నిదర్శనం. అటువంటి అపురూప తత్వానికి ప్రత్యక్ష సాక్ష్యంగా, ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి జిల్లా, శ్రీకాళహస్తికి ఐదు కిలోమీటర్ల దూరంలో, తొట్టంబేడు మండలం పూడి విరూపాక్షపురం గ్రామాల నడుమ సువర్ణముఖి నదీ తీరాన, ఇసలాపురం అనే చిన్న పల్లెలో సుభగాంబ సమేత విజయేశ్వర స్వామి/ అర్ధనారీశ్వర స్వామి ఆలయం కొలువై ఉంది. ప్రపంచ ప్రసిద్ధి చెందిన శ్రీకాళహస్తీశ్వర ఆలయానికి అనుబంధంగా ఉన్న 21 ఉప ఆలయాలలో ఇది అత్యంత విశిష్టమైనది.

## అద్దంలో దర్శనమిచ్చే అద్భుత స్వయంభూ లింగం

ఈ ఆలయంలోని మూలవిరాట్ స్వయంభూ లింగం. ఈ లింగంలో ముందు భాగం సాక్షాత్తు పరమశివుని ముఖాకృతిని, వెనుక భాగం జగన్మాత పార్వతీదేవి స్వరూపాన్ని కలిగి ఉంటుంది. లింగం ముందు భాగం స్వచ్ఛమైన తెలుపు వర్ణంలో మంచులా తెల్లగా కళకళలాడుతూ దర్శనమివ్వగా వెనుక భాగం పసుపు వర్ణంలో బంగారంలా మెరుస్తూ ఉండటం భక్తులను ఆశ్చర్యచకితులను చేస్తుంది. శివభాగం, దేవీ భాగాల కలయిక ఇక్కడ ప్రత్యక్షంగా కనిపిస్తుంది. గర్భగుడి అత్యంత చిన్నదిగా ఉండటం వలన వెనుక భాగంలో ఉన్న అమ్మవారి దర్శనం నేరుగా కాదు, గర్భగుడి వెనుక ఏర్పాటు చేసిన ఒక పెద్ద అద్దం ద్వారా భక్తులకు చూపిస్తారు. ఒక్క లింగంలోనే శివుడు, శక్తి ఒక్కటై ఉన్న ఈ దృశ్యం, అద్వైత భావనకు ప్రతీక.

**సూర్యుడు పూజించే పడమర ముఖ ఆలయం:** సాధారణంగా శివాలయాలు తూర్పు ముఖంగా ఉంటాయి. కానీ ఈ ఆలయం పడమర ముఖంగా ఉండటం మరో విశేషం. ఇక్కడ ప్రకృతి కూడా స్వామివారిని నిత్యం పూజిస్తుందని చెబుతారు. ఆలయ గోడకు ఉన్న సూక్ష్మ రంధ్రం నుండి ప్రతిరోజూ సూర్యోదయ సమయంలో సూర్యకిరణాలు నేరుగా వెనుక ఉన్న అమ్మవారిపై, సూర్యాస్తమయ సమయంలో ముందు ద్వారం గుండా శివునిపై పడతాయి. సూర్యభగవానుడే ఉదయం అమ్మకు, సాయంత్రం అయ్యకు నమస్కరిస్తున్నాడని ఆలయ అర్చకులు చెబుతారు.

**స్థల పురాణం:** పూర్వం అవంతీ నగరంలో విజయుడు, సుభగ అనే అన్యోన్య దంపతులు ఉండేవారు. వారు మార్కండేయ మహర్షి సూచన మేరకు దక్షిణ కాశీ అయిన శ్రీకాళహస్తికి వచ్చి తపస్సు చేశారు. భార్యాభర్తల అన్యోన్యతకు, భక్తికి మెచ్చిన పరమశివుడు శ్రావణ పౌర్ణమి రోజున పార్వతీ సమేతంగా ప్రత్యక్షమై, మీలాగే లోకంలో దంపతులంతా కలిసి ఉండాలని, అందుకే నేను ఇక్కడ అర్ధనారీశ్వరునిగా, సుభగాంబ సమేత విజయేశ్వరునిగా కొలువై ఉంటానని వరమిచ్చాడని చెబుతారు. కనుక ఈ క్షేత్రాన్ని దంపతులు దర్శిస్తే వైవాహిక జీవితంలో అన్యోన్యత పెరుగుతుందని, సంతానం లేని వారికి సంతాన భాగ్యం కలుగుతుందని ప్రగాఢ నమ్మకం.

**వెలుగు చూడని చరిత్ర:** తిరుపతి శ్రీ వేంకటేశ్వర విశ్వ విద్యాలయ చరిత్ర విభాగం పరిశోధకుడు డా.ఎం.దీనదయాళ్ పరిశోధన, పురాణాల ప్రకారం ఈ ఆలయం మార్కండేయుని కాలం నాటిదయినా, చారిత్రక ఆధారాల ప్రకారం దీని వయస్సు సుమారు 1000 సంవత్సరాలు. ప్రచార లోపం వల్ల ఈ మహా క్షేత్రం భక్తులకు దూరంగా ఉండిపోయింది. ఒక్క అర్చకుడు మాత్రమే నిత్య ధూప దీప నైవేద్యాలను కొనసాగిస్తున్నారు. ఇక్కడ చేసే ఒక యజ్ఞం, ఒక దానం, ఒక్క ప్రదక్షిణ శ్రీకాళహస్తీశ్వర సన్నిధిలో చేసినంత పుణ్యఫలాన్ని ఇస్తుందని శాస్త్ర వచనం. అంతర్జాతీయ సమాజం నేడు ఈక్విటీ జెండర్ గురించి మాట్లాడుతుంటే, మన పూర్వీకులు వేల ఏళ్ల క్రితమే ఒకే శరీరంలో సగం శివుడు, సగం శక్తిగా అర్ధనారీశ్వర రూపాన్ని చూపించి సమానత్వాన్ని బోధించారు. అటువంటి తాత్వికతకు నిలయమైన ఇసలాపురం ఆలయాన్ని ప్రపంచానికి పరిచయం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ ఆలయం ప్రాశస్త్యాన్ని గుర్తించిన మాజీ శాసనసభ్యుడు బియ్యపు మధుసూదనరెడ్డి శ్రీకాళహస్తీశ్వరాలయాధికారులతో చర్చించి ఆధునీకరణకు సూచించారు. అతి పురాతనమైన ఆలయానికి రూ.2.2 కోట్లతో జీర్ణోద్ధారణ గావించారు. పాత గర్భాలయాన్ని తాకకుండా కొత్తగా చుట్టూ మండపం నిర్మించారు. అన్నదానం షెడ్డును నిర్మించారు. దేవస్థానం శివం టు శివం రోడ్డులో బైపాస్ నుంచి చక్కటి రోడ్డును నిర్మించారు. అన్ని హంగులతో తీర్చిదిద్దిన ఆలయానికి భక్తుల తాకిడి పెరిగింది. అయితే ఈ ఆలయం నిర్మాణం పూర్తి అయినా ఇంకా 'కుంబాభిషేకం' జరపలేదు. చిన్న చిన్న పనులు మాత్రం చేపట్టాల్సి ఉంది. శ్రీకాళహస్తీశ్వరుని దర్శనార్థం వచ్చే భక్తులకు బస్సు సదుపాయం కల్పిస్తే బాగుంటుంది.

– షేక్.బాబ్‌జాన్, తొట్టంబేడు

# అమెజాన్ నదిలో అరుదైన పింక్ డాల్ఫిన్లు

అమెజాన్ నదీ పరివాహక ప్రాంతంలో అరుదైన పింక్ డాల్ఫిన్లు సంచరిస్తుంటాయి. ఇవి సముద్రంలో కాకుండా ప్రధానంగా మంచినీటి నదులు, సరస్సుల్లో జీవించే ప్రత్యేకమైన డాల్ఫిన్లు. ఇవి పుట్టుకతో లేత గులాబీ రంగులో ఉండవు. బూడిద వర్ణంలో ఉంటాయి. వయస్సు పెరిగే కొద్ది లేత గులాబీ రంగు, ఆ తరువాత కొన్ని సందర్భాలలో ముదురు గులాబీ రంగుగా కూడా మారతాయి.

## పింక్ డాల్ఫిన్ చరిత్ర

అమెజాన్ పింక్ డాల్ఫిన్ పరిణామ చరిత్ర చాలా ప్రాచీనమైనది. పరిశోధనల ప్రకారం దాదాపు 1.5 కోట్ల సంవత్సరాల క్రితం (మయోసిన్ యుగంలో) ఈ డాల్ఫిన్ల పూర్వీకులు సముద్రాలలో జీవించేవి. కాలక్రమేణా సముద్ర మట్టాలు మారడం, దక్షిణ అమెరికా ఖండంలో భౌగోళిక మార్పుల వల్ల, ఇవి అమెజాన్ నదీ వ్యవస్థలోకి ప్రవేశించాయి.

సముద్రపు డాల్ఫిన్ల పోటీని తట్టుకోలేక ఇవి మంచినీటి వాతావరణానికి అలవాటుపడి, అక్కడే ఉండిపోయి ప్రత్యేక జాతిగా పరిణామం చెందాయి. 1817లో ఫ్రెంచ్ ప్రకృతి శాస్త్రవేత్త హెన్రీ మేరీ డుక్రోటే డి బ్లెయిన్‌విల్ ఈ జాతికి శాస్త్రీయ నామాన్ని నమోదు చేశాడు. ప్రస్తుతం అధికారిక వర్గీకరణలో దీని శాస్త్రీయ నామం ఇనియా జెఫ్రెన్సిస్. దీనిని సాధారణంగా అమెజాన్ 'నది డాల్ఫిన్', 'బోటో' అని కూడా పిలుస్తారు. ఇది ప్రధానంగా దక్షిణ అమెరికాలోని అమెజాన్, ఒరినోకో నదీ వ్యవస్థలలో కనిపిస్తుంది. పుట్టినప్పుడు నిజంగా పింక్‌గా ఉంటాయా? పిల్ల డాల్ఫిన్లు సాధారణంగా ముదురు బూడిద రంగులో పుడతాయి. వయసు పెరిగే కొద్ది శరీరం లేత బూడిద, లేత గులాబీ లేదా మరింత ప్రకాశవంతమైన గులాబీ రంగులోకి మారవచ్చు. వయస్సులో పెద్ద మగ డాల్ఫిన్లు సాధారణంగా ఆడవాటికంటే ఎక్కువ పింక్‌గా కనిపిస్తాయి. ఇవి పింక్ రంగులో ఉండటానికి సరైన కారణాన్ని శాస్త్రవేత్తలు ఇంకా నిర్ధారించలేదు. చర్మం కింద రక్తప్రసరణ, వయసు, గాయాల వల్ల ఏర్పడే మచ్చలు, జన్యుపరమైన లక్షణాలు, పర్యావరణ పరిస్థితులు వంటి అంశాలు కలిసి రంగును ప్రభావితం చేస్తాయని భావిస్తున్నారు. ముఖ్యంగా మగ డాల్ఫిన్లలో ఇతర మగవారితో పోరాటాల వల్ల ఏర్పడిన గాయాల మచ్చలు పింక్ రంగుకు ఒక కారణం కావచ్చని భావిస్తున్నారు. ఇవి ఎక్కువ ఉత్సాహంగా లేదా ఆనందంగా ఉన్నప్పుడు మనుషులు సిగ్గుపడితే ఎర్రబడినట్లు, ఇవి మరింత గాఢమైన గులాబీ రంగులోకి మారుతాయి.

## స్థానిక నమ్మకాలు- జానపద కథలు

దక్షిణ అమెరికా ముఖ్యంగా బ్రెజిల్ ప్రజల జానపద కథలలో ఈ డాల్ఫిన్లకు ప్రత్యేక స్థానం ఉంది. స్థానికులు వీటిని 'బోటో' అని పిలుస్తారు. రాత్రి సమయాల్లో ఇవి అందమైన యువకులుగా మారుతాయని, పార్టీలకు వచ్చి అమ్మాయిలను మాయ చేస్తాయని, మళ్లీ తెల్లవారేసరికి తిరిగి డాల్ఫిన్ రూపంలోకి మారి నదుల్లోకి వెళ్లిపోతాయని ఒక ప్రసిద్ధ నమ్మకం ఉంది. దీనికి ఎటువంటి ఆధారం లేదు. ఈ జీవులకు హాని చేస్తే దేవుని శాపం తగులుతుందని స్థానికులు బలంగా నమ్ముతారు. అందుకే పూర్వం వీటిని ఎవరూ వేటాడేవారు కాదు.

అమెజాన్ నది ప్రపంచంలోనే అతిపెద్ద నదీ వ్యవస్థల్లో ఒకటి. ఈ నదికి మరో ప్రత్యేకత ఉంది. వర్షాకాలంలో నది నీరు కేవలం నదీ పాయలకే పరిమితం కాదు. చుట్టుపక్కల ఉన్న విశాలమైన అడవుల్లోకి కూడా నీరు చొచ్చుకుపోతుంది. నిన్నటి వరకు చెట్లతో నిండిన భూభాగం ఈరోజు ఒక్కసారిగా నీటిమయంగా మారుతుంది. చెట్ల మధ్య నీటి దారులు ఏర్పడతాయి. ఈ సమయంలోనే పింక్ రివర్ డాల్ఫిన్ల జీవితం మరింత ఆసక్తికరంగా మారుతుంది. సాధారణంగా డాల్ఫిన్ అంటే సముద్రంలో ఈదే జీవి అనే అభిప్రాయం మనలో ఉంటుంది. కానీ అమెజాన్ పింక్ డాల్ఫిన్ ఆ భావనను పూర్తిగా మార్చేస్తుంది. వరదలు వచ్చినప్పుడు ఇవి నది నుంచి అడవుల్లోకి ప్రవేశిస్తాయి. నీటిలో మునిగిన చెట్ల మధ్య, కొమ్మల మధ్య, వేర్ల మధ్య కూడా ఈదుతూ ఆహారాన్ని వెతుకుతాయి. అంటే ఒక రకంగా చెప్పాలంటే వరదలు వీటికి అడ్డంకి కాదు. కొత్త ఆహార ప్రదేశాలకు తెరుచుకునే మార్గం అని చెప్పవచ్చు. అమెజాన్ ప్రాంతంలో వర్షాలు ఎక్కువగా పడే కాలంలో నదుల నీటిమట్టం గణనీయంగా పెరుగుతుంది. నీరు అడవిలోకి ప్రవహించడంతో చెట్ల కాండాల మధ్య, కొమ్మల కింద, వేర్ల మధ్య కొత్త నీటి మార్గాలు ఏర్పడతాయి. చిన్న చేపలు, ఇతర జలచరాలు కూడా ఈ ప్రాంతాల్లోకి చేరుతాయి. అదే పింక్ డాల్ఫిన్లకు మంచి అవకాశంగా మారుతుంది. అవి నది ప్రధాన ప్రవాహాన్ని మాత్రమే ఆశయించకుండా, వరద నీటితో ఏర్పడిన ఈ కొత్త ప్రాంతాల్లో ఆహారం కోసం తిరుగుతాయి.

అమెజాన్‌లో వర్షాకాలంలో నదులు పొంగి చుట్టుపక్కల అడవులను ముంచెత్తుతాయి. ఆ సమయంలో పింక్ డాల్ఫిన్లు అడవిలోని చెట్ల మధ్య కూడా ఈదుతూ చేపలను వేటాడతాయి. ఇవి ప్రధానంగా చేపలను ఆహారంగా తీసుకుంటాయి. పీతలు, చిన్న తాబేళ్లను కూడా ఇవి భుజిస్తాయి. అమెజాన్ నదిలో దాదాపు 50 రకాలకు పైగా చేప జాతులను ఇవి...

వేటాడి తింటాయి. వాటి మెడలోని వెన్నుపూసలు ఒకదానితో ఒకటి పూర్తిగా కలిసిపోకపోవడం వల్ల మెడను ఇతర డాల్ఫిన్ల కంటే ఎక్కువగా తిప్పగలవు. వీటి మెడ వెన్నుపూసలు అతుక్కోకుండా ఉంటాయి. దీనివల్ల ఇవి తమ తలను 180 డిగ్రీల కోణంలో తిప్పగలవు. అందువల్ల చెట్ల కొమ్మల మధ్య సులభంగా తిరగగలుగుతాయి. సముద్రపు డాల్ఫిన్లతో పోలిస్తే ఇవి కాస్త సిగ్గుపడే స్వభావం కలిగి ఉంటాయి. ఇవి గుంపులుగా కాకుండా ఒంటరిగా లేదా చిన్న కుటుంబాలుగా (23 డాల్ఫిన్లు) తిరగడానికి ఇష్టపడతాయి. వీటి ముక్కు చాలా పొడవుగా, సన్నగా ఉంటుంది.

దట్టమైన అడవుల్లో, వరదలు వచ్చినప్పుడు చెట్ల వేర్ల మధ్య దాక్కున్న చేపలను పట్టుకోవడానికి ఈ ముక్కు వీటికి బాగా సహాయపడుతుంది. వీటి నుదుటి భాగం (మెలన్) గుండ్రంగా, మెత్తగా ఉంటుంది. దీన్ని ఇవి తమ అవసరానికి తగినట్లుగా మలుచుకుంటాయి.

## ఆహారం ఎలా వెతుకుతాయి?



అమెజాన్ నదిలో నీరు తరచూ మురికిగా, చీకటిగా ఉంటుంది. అందువల్ల ఇవి కళ్లపై మాత్రమే ఆధారపడకుండా ఎకోలొకేషన్ ఉపయోగిస్తాయి. శబ్ద తరంగాలను పంపి అవి తిరిగి వచ్చే విధానాన్ని బట్టి నీటిలోని చేపలు, ఇతర జీవులను గుర్తిస్తాయి. చేపలు, క్రస్టేషియన్లు వంటి నీటి జీవులు వీటి ప్రధాన ఆహారం. సముద్ర డాల్ఫిన్ల వలె వీటికి చూపు చాలా తక్కువగా ఉంటుంది కొన్నిసార్లు నీటి అడుగున బురద కారణంగా స్పష్టంగా కనిపించదు. అందువల్ల ఇవి ధ్వని తరంగాలను ఉపయోగించి ఆహారాన్ని వెతుక్కుంటూ ప్రయాణిస్తాయి. అమెజాన్ నది నీరు చాలా బురదగా, చీకటిగా ఉంటుంది. అందుకే ఇవి చూపు కంటే, తమ తల నుండి ప్రత్యేక శబ్ద తరంగాలను వదులుతూ, ఎదురుగా ఉన్న వస్తువులను, చేపలను గుర్తిస్తాయి. దీనిని ఎకోలొకేషన్ అంటారు. తమ నుదిటి భాగం నుండి ప్రత్యేకమైన శబ్ద తరంగాలను విడుదల చేయడం ద్వారా, నీటి అడుగున త్రీడీ మ్యాప్‌ను మనస్సు లోనే సృష్టించుకుని ఇవి వేటాడతాయి.

## పింక్ డాల్ఫిన్ల ప్రత్యేకతలు

పొడవైన ముక్కు ఉంటుంది. నుదురు గుండ్రంగా, ఉబ్బినట్లుగా ఉంటుంది. మెడను ఎక్కువగా తిప్పగలవు. వరదల సమయంలో నీటితో మునిగిన అడవుల్లోకి వెళ్లగలవు. కొన్ని వయోజన డాల్ఫిన్లు దాదాపు పూర్తిగా పింక్ రంగులో కనిపిస్తాయి. పింక్ రివర్ డాల్ఫిన్ ప్రధానంగా అమెజాన్, ఒరినోకో నదీ వ్యవస్థల్లో కనిపిస్తుంటాయి. ఈ భూమిపై ఉన్న ఐదు రకాల మంచి నీటి డాల్ఫిన్లలో ఇవే అత్యంత తెలివైనవి. వినడానికి ఆశ్చర్యంగా ఉన్నా, వీటి మెదడు సామర్థం మనుషుల కంటే దాదాపు 40 శాతం ఎక్కువ ఉంటుంది. ఇవి మనుషులతో, ముఖ్యంగా స్థానిక పిల్లలతో చాలా స్నేహపూర్వకంగా ఆడుకుంటాయి. సముద్ర డాల్ఫిన్లకు భిన్నంగా ఇవి మంచినీటిలో జీవించడానికి ప్రత్యేకంగా అలవాటు పడ్డాయి.

## ప్రస్తుతం ఎదుర్కొంటున్న ప్రమాదాలు

ఈ డాల్ఫిన్లకు నీటి కాలుష్యం, చేపల వేటలో అనుకోకుండా వలల్లో చిక్కుకోవడం, ఆనకట్టల నిర్మాణం, నివాస ప్రాంతాల మార్పు, కొన్ని ప్రాంతాల్లో మానవులచే వేటాడటం వంటి సమస్యలు ఉండటంతో ఈ అద్భుతమైన జీవులు ప్రమాదపు అంచున ఉన్నాయి. ప్రస్తుతం ఇవి అంతరించిపోతున్న జాతుల జాబితాలో ఉన్నాయి. అమెజాన్ నదిలో పెరుగుతున్న జలవిద్యుత్ ప్రాజెక్టులు (డ్యామ్‌లు), మైనింగ్ వల్ల వచ్చే పాదరస కాలుష్యం, చర్మం కోసం జరిగే అక్రమ వేట వీటి మనుగడకు పెద్ద ముప్పుగా మారాయి.

అమెజాన్‌లోని పింక్ రివర్‌డాల్ఫిన్స్‌కు, సముద్రాల్లో సాధారణంగా కనిపించే డాల్ఫిన్లకు చాలా తేడాలు ఉన్నాయి. సముద్ర డాల్ఫిన్లు అన్నీ నల్లగా ఉండవు. బూడిద, నలుపు, బూడిద తెలుపు కలయిక వంటి రంగుల్లో ఉంటాయి.

– షేక్ అబ్దుల్ హకీం జాని


## రచనలకు ఆహ్వానం

**రచయితల నుండి కథలు, కవితలు, సమకాలీన వ్యాసాలు స్వాగతిస్తున్నాం. రచనలతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జత చేయాలి. ఎంపిక కాని రచనలు తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. ఇతర పత్రికల పరిశీలనలో ఉన్న రచనలు దయచేసి పంపించకండి. రచనలు పంపించాల్సిన చిరునామా: ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80.**

***sunmagvaartha@gmail.com***

# శుభ ముహూర్తాలకు పనికిరాని తిథి, వార, నక్షత్రాలు?


వాస్తువార్త
వాస్తు విద్వాన్ సాయిశ్రీ
డా॥ దంతూరి పండరినాథ్
సెల్స్: 9885446501/9885449458

ఎల్.కె.వేణు, హైదరాబాద్

**ప్రశ్న: గృహప్రవేశాది శుభకార్యాలకు పనికివచ్చే తిథి, వారాలు ఏమిటి? ఒకవేళ తెలియకుండా దోషపూరితమైన సమయంలో శుభకార్యాలు చేసినట్లయితే సరైన ఫలితాలు రావు కదా! అలాంటి సమయంలో ఆ దోషాలను పోగొట్టుకోవటానికి ఏవైనా ప్రత్యామ్నాయాలు ఉన్నాయా? మేం సమస్యలతో బాధపడుతున్నాం. మా సమస్యలకు పరిష్కారం తెలుపగలరు.**

**జవాబు:** ఈ విషయం ముహూర్త భాగానికి వర్తిస్తుంది. శుభకార్యాలు ఆచరించటానికి అనేక శుభముహూర్తాలు ఉన్నాయి. అవసరాన్ని మట్టి మీరు అందుబాటులో పండితులను సంప్రదించి ఎప్పటికప్పుడు మీకు పనికివచ్చే శుభ ముహూర్తాల గురించి తెలుసుకోవచ్చు.

శుభ కార్యాలకు పనికిరాని తిథి, వార, నక్షత్రాదులను తెలుసుకొని ఉండటం అందరికీ ఉపకరిస్తుంది. తిథి, వారం, నక్షత్రం, యోగం, కరణం అనే ఈ ఐదు విషయాల(పంచాంగం)ను పరిగణలోకి తీసుకొని శుభకార్యాలకు లగ్నం/ ముహూర్తం నిర్ణయిస్తారు.

వాస్తు మొదలైన శుభ కార్యాలకు కూడనివి. 1) వారం-మంగళ వారం(పనికిరాదు); 2) తిథి-శుక్ల పాడ్యమి, చతుర్థి, షష్ఠి, అష్టమి, నవమి, ఏకాదశి, ద్వాదశి, చతుర్దశి, పూర్ణతిథులు(పూర్ణిమ, అమావాస్య).

తెలుగు సంవత్సరాంతమున ఏడు రోజులు, తెలుగు సంవత్సరాదిన ఏడు రోజులు, తెలుగు మాసాంతంలో మూడు రోజులు, మాసాదిన మూడు రోజులు; శూన్యతిథులు, పితృదినాలు, మహాలయాలు, శూన్య మాసాలు పనికిరావు. 3) నక్షత్రం-భరణి, కృత్తిక, ఆరుద్ర, ఆశ్లేష, మఖ, పూర్వాభాద్ర పనికిరావు; 4) యోగములు-విష్కంభం, అతిగండ, శూలగండ, వ్యాఘాతం, వ్యతిపాత్, పరిఘవైధృతి ఈ యోగాలు పనికిరావు; 5) కరణం-భద్ర, చతుష్పత్, నాగ, కింస్తుఘ్న.. మొదలైన కరణాలు పనికిరావు.

కొన్ని సందర్భాలలో ముహూర్తం దాటిన తరువాత (ఆలస్యంగా) శుభకార్యాలు నిర్వహిస్తూ ఉంటారు. గృహప్రవేశాది శుభకార్యాలు జరిపిన తరువాత కోరకున్న విధంగా మంచి ఫలితాలు పొందలేకపోవటం/ అందివచ్చిన మంచి ఫలితాలు చేజారిపోవటం మొదలైనవి పునరావృతం అవుతూ ఉండటం వలన శుభకార్యాలు జరిపించిన ముహూర్తాల్లో సందేహం కలుగుతుంటుంది.

తెలిసో తెలియకో శుభకార్యాలు నిర్వహించిన సమయం పంచాంగ దోషం ఉందేమోనన్న అనుమానం కలిగినప్పుడు చింతించనవసరం లేదు. దోషాన్ని పోగొట్టుకొని మంచి ఫలితాలను పొందటానికి 'దానం' అనే ప్రక్రియ శాస్త్రంలో వివరించారు.

1) వార దోషమునకు: 'మణి' దానం; 2) తిథి దోషమునకు- 'బియ్యం' దానం; 3) తారబలం(నక్షత్ర) దోషమునకు- 'లవణం' (ఉప్పు) దానం; 4) యోగ దోషమునకు- 'బంగారం'; 5) కరణ దోషమునకు-'ధాన్యం'; 6) చంద్ర దోషమునకు-'శంఖం' దానం; 7) లగ్న దోషమునకు-గోవు'; 8) త్యాజ్య దోషమునకు- 'స్వర్ణ' దానం. దోషమును తెలుసుకొని పైన తెలియచేసిన దానం చేయటం వల్ల దోషపరిహారం జరిగి సత్ఫలితాలను పొందే అవకాశాలున్నాయని శాస్త్రంలో వివరించారు.

అజమాయిషీ స్థిరత్వం కోసం, సామర్థ్యంతో కూడిన అజమాయిషీ చేయటం కోసం ప్రతి చిన్న, పెద్ద ఆఫీసుల్లో, వ్యాపార క్షేత్రాల్లో యజమానులు, ఎగ్జిక్యూటివ్‌లు నైరుతి గదిలో, నైరుతి మూలన కూర్చోవటం సర్వసాధారణం. అయితే అక్కడ కిటికీలు, వెంటిలేటర్‌లు లేకపోయినట్లయితే అక్కడ ఉన్న వాయువు నిలకడగా ఉంటుంది. నిలకడగా ఉన్న వాయువు కలుషితమవుతుంది. ఆ కలుషిత వాయువును పీలుస్తూ ఉండటం వలన అక్కడ ఎక్కువసేపు కూర్చునే యజమాని/ ఎగ్జిక్యూటివ్ ఆరోగ్యం క్రమంగా చెడిపోయే అవకాశం ఉంటుంది.

సరైన అజమాయిషీతో వ్యాపారాన్ని దక్షతగా నడపటానికి నైరుతి భాగంలో కూర్చోవటం వాస్తు ప్రకారం సరైన పద్ధతే. అయినప్పటికీ కాలుష్య వాతావరణం వలన అతని ఆరోగ్యం చెడిపోతుంది. ఆలోచనా సామర్థ్యం కూడా ప్రతికూలంగా ప్రభావితం అయ్యే అవకాశాలెక్కువ. అలా వ్యాపారంపైనే గాక దానిని నమ్ముకుని ఉపాధి పొందుతున్న ఎంతో మంది కూడా నష్టపోయే ప్రమాదం ఉంటుంది. అందువల్ల ఈ విషయం గురించి చాలా జాగ్రత్తగా ఉండటం మంచిది. బెడ్‌రూముల్లో, ఆఫీసు గదుల్లో ఎన్ని ఏసిలు అమర్చుకున్నప్పటికీ అప్పుడప్పుడు కిటికీలను తెరిచి తాజా వాయువును ఆహ్వానిస్తూ ఉండాలి. నైరుతి దిక్కున కిటికీలు, వెంటిటేటర్‌లు లేకపోతే పైన పేర్కొన్న విధంగా ఫ్యాన్లను ఆ స్థానంలో తిప్పుతూ ఉండటం వలన కాలుష్య వాతావరణాన్ని నివారించుకొని సత్ఫలితాలను పొందుతూ ఉండవచ్చు.

జ్యోతిష్య కోణంలో అనారోగ్యానికి కారణాలు కొన్ని తెలియజేశారు. ఒక వ్యక్తి జీవితంలో పొందుతున్న నవగ్రహాది దశల, అంతర్దశల సంకలనాలను, ఇతర గ్రహ స్థితులను పరిగణనలోకి తీసుకొని ఆ జాతకునికి కలిగే మంచి, చెడు ఫలితాలు లెక్కిస్తారు. అలాగే ఆరోగ్య విషయాలు కూడా!

వాస్తు విద్వాన్ డా॥ దంతూరి పండరినాథ్ పాఠకుల సమస్యలకు ఆదివారం 'వాస్తువార్త'లో సమాధానాలిస్తారు. ఈ కింది కూపన్ జతచేసి సమస్యలు పంపవలసిన చిరునామా:
సాయిశ్రీ వాస్తు కన్సల్టెన్సీ, 3-2-4, కింగ్స్‌వే,
రాష్ట్రపతి రోడ్, సికింద్రాబాద్-3

వాస్తువార్త

పూర్తి పేరు : .....
పుట్టిన తేది : .....
జన్మ నక్షత్రం: .....తల్లి పేరు: .....
చిరునామా:.....

# మన వస్త్ర చరిత్ర

**అనాదిగా** భారతదేశానికి ఆర్థిక పరిపుష్టం కలిగించే వ్యవస్థగానే కాకుండా, నేటికి అనేక కుటుంబాలకు జీవనాధారంగా చేనేత (వస్త్ర) పరిశ్రమ ప్రాముఖ్యత సంతరించుకుంది. దేశపు చరిత్రలో ఒక భాగంగా, సాంస్కృతిక, నైపుణ్యాలను విశ్వవిఖ్యాతం చేయడంలో చేనేత నేటికి ప్రముఖ పాత్ర పోషిస్తోంది.

సుమారు 5000 సంవత్సరాల నుండి భారత చేనేత పరిశ్రమ సింధు నదీ నాగరికత, వివిధ రాజ వంశాల పాలనలో, ప్రపంచ వాణిజ్య రంగంలో, ఫ్యాషన్ డిజైనర్ రంగంలో తనదైన శైలిలో ఎన్నో అద్భుతాలు సృష్టిస్తూ, మానవ జీవన విధానంతో ముడిపడి ఉన్నది.. చేతితో దారాలు వడికిన కాలం నుండి వివిధ దారాలు, ప్రకృతి సిద్ధమైన రంగులు వాడకంతో వివిధ వస్త్రాలు తయారు చేయడం, నేటి ఆధునిక కాలంలో యంత్రాలు ద్వారా వస్త్రాలు తయారీ వరకూ చేనేత పరిశ్రమ రోజు రోజుకు నూతనత్వం పొందుతూ ప్రపంచ వ్యాప్తంగా ప్రజలను ఆకర్షిస్తూ, సాంప్రదాయబద్ధంగా సాగుతోంది.

ప్రపంచంలోనే నేటికి భారత చేనేత పరిశ్రమ రెండో అతిపెద్ద ఎగుమతిదారీ పరిశ్రమగా విరాజిల్లుతోంది. ఈ 2025-26 ఆర్థిక సంవత్సరంలో 190 అమెరికన్ బిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఉన్న మన చేనేత పరిశ్రమ, భవిష్యత్తులో 2030 నాటికి 350, 2033 నాటికి 600 అమెరికన్ బిలియన్ డాలర్లు వ్యవస్థగా నిలవడానికి ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు..

సింధూ నాగరికత కాలంలోనే మన భారతదేశంలో ప్రత్తి పంట పండించడం, దారాలు వడకటం, నేత నేయడం వంటివి అభివృద్ధి చెందినట్లు ఆనమాళ్ళు తవ్వకాల్లో బయటపడ్డాయి.. పురాతనతత్వ శాస్త్రవేత్తలు, ఆర్కియాలజికల్ డిపార్ట్‌మెంట్ జరిపిన అధ్యయనంలో హరప్పా మొహంజోదారా, మెహర్ ఘర్ వంటి ప్రాంతాలలో ప్రత్తి విత్తనాలు, నూలు వడికే యంత్రాలు, కుట్టు అల్లికలు, సూదెలు తదితర ఆనమాళ్ళు బయటపడ్డాయి.

ప్రకృతి సిద్ధమైన రంగులు, నీలిమందు వాడకం చేనేత వస్త్ర పరిశ్రమలో వాడేవారు. ఈ పరిశ్రమ కేవలం బతుకు తెరువు కోసమే కాకుండా, తయారీ కలంకారీ కళలో ప్రావీణ్యం సంపాదించినట్లు తెలుస్తోంది.. కొన్ని వేల సంవత్సరాల పాటు ఈ కళా నైపుణ్యం, చేనేత పరిశ్రమ తన ఉనికిని చాటుకుంది.

వేద కాలంలో కూడా ఈ నేత పని, వస్త్ర పరిశ్రమ దినదినాభివృద్ధి చెందింది. కేవలం ప్రత్తితో దారాలు వడకటం, నేత నేసి కాటన్ దుస్తులు తయారు చేయడం, రంగులు అద్దటమే కాకుండా, సిల్క్, ఊలుతో కూడా సున్నితమైన వస్త్రాలు తయారు చేయడంలో కూడా అందవేసిన నిపుణులుగా మన దేశం పేరుగాంచింది. కాలక్రమేణా ప్రపంచ వాణిజ్యంలో భారత చేనేత పరిశ్రమ ప్రముఖ స్థానం పొందింది. 'మస్లిన్' వస్త్రాలు తేలికపాటి పత్తితో మెత్తగా ఉండే వస్త్రాలు తయారు చేయడంలో, ఫైన్ కాటన్ దుస్తులు తయారు చేయడంలో ఆసియా, మెడిటరేనియన్ ప్రాంతాల్లో మన భారతదేశపు చేనేత పరిశ్రమ ప్రసిద్ధి చెందింది.

మన భారతదేశం వివిధ భౌగోళిక పరిస్థితులు, ప్రాంతాలు కలిగి ఉండటం వల్ల వివిధ ప్రాంతాల్లో ఆయా ప్రజలు వివిధ రకాల రంగులు, డిజైన్లు, నేతలను, నైపుణ్యాలను కలగలిపి ఎన్నో రకాల దుస్తులు తయారు చేయడంతో ప్రపంచ ప్రజలు మన చేనేత పరిశ్రమను విరివిగా ఆదరించారు.

మౌర్యుల కాలంలో మనదేశంలో చేనేత పరిశ్రమ ఒక క్రమపద్ధతిని సంతరించుకుంది. కౌటిల్యుడు అర్థశాస్త్రం గ్రంథం ప్రకారం ప్రభుత్వ ఆధ్వర్యంలోనే వస్త్రాల తయారీ, వస్త్ర దుకాణాలు, ఉత్పత్తి, నాణ్యత నడిచినట్లు తెలుస్తోంది. ఆనాటి ప్రభుత్వానికి ఆర్థిక వనరుగా, పరిపాలనా పరంగా చేనేత పరిశ్రమ కీలక పాత్ర పోషించి. తదుపరి మొగల్ చక్రవర్తుల కాలంలో చేనేత పరిశ్రమ మరింత ఉన్నత స్థాయికి చేరుకోవడం జరిగింది.

17వ శతాబ్దంలో ప్రపంచ చేనేత వ్యాపారంలో భారత్ అగ్రస్థానంలో నిలిచింది. బ్రోకేడ్ అంటే బంగారు/ వెండి దారాలతో అల్లిన పట్టు వస్త్రాలు, సిల్క్ వస్త్రాలు, సున్నితమైన వస్త్రాలు, ప్రింటింగ్ నేత వస్త్రాలు తయారు చేయడంలో భారత్ పేరుగాంచి, అటు ప్రపంచ వ్యాప్తంగా, ఇటు రాజకుటుంబాల ఆదరణ లభించింది.

దేశ వ్యాప్తంగా వివిధ చేనేత పరిశ్రమలు స్థాపన జరిగింది. రకరకాల ప్రింటింగ్, నేతలు, డిజైన్లు, ఎంబ్రాయిడరీ వర్క్ వంటి వాటితో వస్త్ర పరిశ్రమ దినదినాభివృద్ధి చెందింది. 'ఆరు అడుగుల చీరను అగిగపెట్టెలో అమర్చిన ఘనత' మన చేనేతది.

దీంతో యూరోపియన్ మార్కెట్లలో, ఆసియా, పశ్చిమ ఆసియాలో కూడా భారత చేనేత పరిశ్రమ విస్తరించింది. అదే సమయంలో నౌకాయానం అందుబాటులోకి రావడంతో చేనేత వస్త్రాలు భారీ ఎత్తున ఎగుమతులు పెరగడం మొదలైంది.

ఈస్ట్ ఇండియా కంపెనీ భారత చేనేత వస్త్రాల కొనుగోలులో ప్రముఖ పాత్ర పోషించింది. భారత చేనేత వస్త్రాలకు ప్రపంచ వ్యాప్తంగా డిమాండ్ పెరిగింది. అయితే పారిశ్రామికీకరణ ప్రభావం, బ్రిటిష్‌వారు పాలన మన దేశంలో మొదలైన తరువాత, మన చేనేత పరిశ్రమ తిరోగమనం వైపు మళ్లింది. తక్కువ ధరకే భారీ యంత్రాలతో తయారైన వస్త్రాలు లభ్యం కావడంతో మన చేనేత పరిశ్రమ సన్నగిల్లింది. దీనికితోడు బ్రిటిష్‌వారు పాలన,

ఆంక్షలు మన వస్త్ర పరిశ్రమను కుదేలు చేసింది. మన చేనేత వస్త్రాలపై భారీగా పన్నులు విధించారు. దీంతో చేనేత కార్మికులు, కుటుంబాలు దీనావస్థలో చేరాయి. కేవలం ముడిసరుకు తయారీ కేంద్రంగా మన దేశం మారిపోయింది. విదేశీ వనరస్తాలు దిగుమతులు పెరగడం వల్ల, చేనేత పరిశ్రమ ఆర్థికంగా క్షీణించింది. చేనేత కార్మికులు కుటుంబాలు బలహీనపడ్డాయి.

అయితే తదుపరి మన దేశంలో స్వాతంత్రం కోసం పోరాటం ప్రారంభవడం ద్వారా, తిరిగి ముఖ్యంగా మహాత్మా గాంధీ చేనేత పరిశ్రమకు అండగా నిలిచారు.

ముఖ్యంగా తానే స్వయంగా వస్త్రాలు వడికి తయారు చేసుకోవడం, అందరినీ "స్వదేశీ ఉత్పత్తులు" వాడాలని ప్రోత్సహించడంతో ఒక్కసారిగా, తిరిగి చేనేత ఉత్పత్తులకు గిరాకీ పెరిగింది. స్వాతంత్ర్య పోరాటానికి చిహ్నంగా చేనేత మారిపోయింది. "విదేశీ వస్త్ర బహిషనకరణ" కార్యక్రమం మన చేనేత పరిశ్రమకు, కార్మికులకు కలిసి వచినచంది.

'స్వయం సమృద్ధి', 'స్వదేశీ ఉత్పత్తులు' వాడాలని, అదే మన గౌరవం(స్టేటస్) అని పేర్కొన్నారు. 'చరఖా' మన చిహ్నంగా మారిపోయింది. స్వయంపాలన, స్వరాజ్ వంటి అంశాలు కలిసి వచ్చాయి.. బ్రిటిష్ వారిని మనదేశం నుంచి పారదోలడానికి చరఖా (రాట్నం) పెద్ద ఆయుధంగా మారిపోయింది. దీంతో చేనేత పరిశ్రమ ఆర్థికంగా బలపడటం, తలసరి ఆదాయం

పెరగడం మొదలైంది. ఒక్క మాటలో చెప్పాలంటే, దేశ తలరాతను మార్చడంలో అనగా దేశానికి స్వాతంత్ర్యం తేవడంలో చేనేత కీలక పాత్ర పోషించింది.

.....

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత మన స్వదేశీ ఉత్పత్తులు, పరిశ్రమలు కాపాడేందుకు చాలా ప్రయత్నాలు చేయడం జరిగింది. టెక్స్ టైల్ ఇండస్ట్రీస్ ప్రమోట్ చేసారు. నేతను ప్రోత్సాహించారు.

1952లో 'ది ఆల్ ఇండియా హేండ్ లూమ్ బోర్డు' ఏర్పాటు చేశారు. చేనేత పరిశ్రమను ప్రోత్సహించారు.. మారుతున్న కాలానికి అనుగుణంగా డిజైన్లు, నైపుణ్యాలను అభివృద్ధి పరుచే దిశగా చేనేత పరిశ్రమను అనుసంధానం చేయడానికి 1961లో 'ది నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ డిజైన్" సంస్థను స్థాపించారు.. ఆ విధంగా ఆనాటి నుంచి నేటి వరకూ చేనేత పరిశ్రమను, చేనేత కార్మికులను, కుటుంబాలను ఆదుకోవడానికి, ప్రోత్సహించడానికి ప్రభుత్వాలు కృషి చేస్తూనే ఉన్నారు.. అనేక చిన్న చిన్న చేనేత పరిశ్రమలు, దారాలు తయారీ, రంగులు పరిశ్రమలు ద్వారా వేల మంది ఉపాధి అవకాశాలు పొందుతున్నారు. దేశ వ్యాప్తంగా గుజరాత్, తమిళనాడు, పంజాబ్, మహారాష్ట్ర, పంజాబ్, కాశ్మీర్ వంటి రాష్ట్రాల్లో పెద్ద ఎత్తున వస్త్ర పరిశ్రములు కేంద్రీకృతం కాగా, మన తెలుగు రాష్ట్రాల్లో తెలంగాణాలో పోచంపల్లి, గద్వాల్, నారాయణ్ పేట, సిద్దిపేట, దుబ్బాక వంటి ప్రాంతాల్లో, ఆంధ్రప్రదేశ్‌లో వెంకటగిరి, ధర్మవరం, మంగళగిరి, పొందూరు, ఉప్పాడ వంటి ప్రాంతాల్లో వివిధ రకాల చేనేత, పట్టువస్త్రాలు తయారీ చేస్తూ వేల కుటుంబాలు జీవిస్తున్నారు.

ఈ విధంగా దశాబ్దాలుగా మన చేనేత పరిశ్రమ ఆర్థికంగా అభివృద్ధి చెందుతుంది.. చైనా తరువాత ప్రపంచంలో రెండో స్థానంలో మన చేనేత పరిశ్రమ ఉన్నది. మన దేశ ఆర్థికాభివృద్ధిలో ప్రముఖ పాత్ర పోషిస్తోంది. ఈ వస్త్ర పరిశ్రమ ద్వారా ప్రత్యక్షంగా పరోక్షంగా ఎందరో ఉపాధి పొందుతున్నారు. అనాది కాలం నుండి నేటి వరకూ చేనేత పరిశ్రమ అనేక ఒడుదుడుకులను ఎదుర్కొని, తట్టుకుని నిలబడింది. కాలానికి అనుగుణంగా డిజైన్లు నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుంటూ సాగుతోంది.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా పలు ప్రోత్సాహకాలు ప్రకటిస్తున్నాయి. చేనేతను ప్రోత్సహించడానికి ఆగస్టు 7వ తేదీన 'జాతీయ చేనేత దినోత్సవం' జరుపుతున్నారు. ప్రతిఒక్కరూ కనీసం వారంలో ఒకరోజు అయినా, ఖాదీ వస్త్రాలను ధరించాలి అని పాలకులు కోరుతున్నారు.

మనం కూడా మన చేనేత పరిశ్రమను కాపాడేందుకు, అనేక మంది చేనేత కార్మికులు కుటుంబాలను ఆదుకోవడానికి చేనేత వస్త్రాలు ధరించాలి. చేనేత ద్వారానే స్వయంసమృద్ధి సాధించడానికి సహాయ సహకారాలు అందించాలి.

ముఖ్యంగా రోజు రోజుకు పెరుగుతున్న వాతావరణం మార్పులు, క్లైమేట్ ఛేంజ్ (ప్రస్తుతం ఎలినినో ప్రభావం), ఉష్ణోగ్రతల వేడి తట్టుకోవడానికి నేత వస్త్రాలే శ్రేయస్కరం, ఆరోగ్యకరం అని భావించి ధరించాలి.

చేనేత పరిశ్రమను కాపాడేందుకు అందరూ భాగస్వాములు కావాలి. దేశ ఆర్థికాభివృద్ధికి, చేనేత కార్మికులు కుటుంబాలను ఆదుకోవడానికి ముఖ్యంగా మన నేత నైపుణ్యాలను కలకాలం నిలిచి ఉండేలా చేయడానికి చేనేత పరిశ్రమను కాపాడాలి. వికసిత భారత్ సాధించటంలో చేనేత పరిశ్రమ ఒక కీలక శక్తిగా మారుతుంది..
అని భావిద్దాం.

– ఐ.ప్రసాదరావు

– నీ గురించి పూర్తి తెలుసుకొని కూడా నిన్ను ప్రేమించే వ్యక్తులే స్నేహితులవుతారు.

– మనకు ఉన్న సంపదతో సంతృప్తి పడటం ఉత్తమం. మనకి ఉన్న జ్ఞానం సరిపోతుందనుకోవడం అజ్ఞానం. – **సర్వేపల్లి రాధాకృష్ణన్**

– సరిగా వినియోగించుకుంటే పుస్తకాలంత మంచివి ఏమీ లేవు; సరిగా వినియోగించుకోకపోతే వాటంత నిరుపయోగమైనవి లేవు.

– సర్దుబాటు మనస్తత్వం ఉన్నవాడే బతకడంతో బఎహనేర్చరి.

పుస్తక సమీక్ష

## 'రమాప్రభ' వెండితెర నవ్వుల వెలుగుల ప్రయాణం

తెలుగు సినీ ప్రపంచం వెలుగుల వెనుక, అరుదైన జీవితగాథలలో ప్రేక్షకులకు తెరపై నవ్వులు పంచిన హాస్యనటి రమాప్రభ నటిగా వెండితెర వెలుగుల మధ్య దాగిన ఒడిదుడుకుల జీవనయానం 'ఇదేనండి నా కథ'గా రచయిత్రి మోహనవల్లి ప్రదర్శింపచేసారు. సినీనటిగానే కాకుండా ఆమెతో, ఆమె జీవన విధానంతో సన్నిహితంగా కలిసి నడిచిన ఆత్మీయురాలిగా రమాప్రభ అంతరంగాన్ని లోలోతులలో పరిశీలించి కొత్తకోణంలో ఆవిష్కరించారు. రమాప్రభ సందర్శనం, ప్రతి సంభాషణ కొత్త ఒరవడిగా ఆ నటీమణికి వయసు తెచ్చిన నిశ్శబ్ద వెతలను కూడా రచయిత్రి గ్రంథస్థం చేసారు. నటన ఊపిరిగా రంగస్థలం మీద నటనా జీవితాన్ని ఆరంభించి దాదాపు పధ్నాలుగు వందల చిత్రాలలో నటించిన ఆమె జీవితానుభవాలు, జ్ఞాపకాలు, ప్రేమాభిమానాలు అన్నింటికీ మించి స్వాభిమాన, సాధికార ఆత్మగౌరవ వ్యక్తిత్వ విలువలు ఒక మిత్రురాలిగా, శ్రద్ధాభక్తి తత్పరత పెనవేసుకొన్న శ్రోతగా ఎటువంటి కృత్రిమ కల్పనా వైఖరి లేకుండా జీవన కథనాన్ని రచయిత్రి వ్యక్తీకరించారు. 90 పేజీలు, ఆత్మకథగా సాగిన ఈ జీవనయానం, రచయిత్రి కొనసాగింపుగా ఆ కళాకారిణి జీవితంలోని వ్యక్తిగత వేదనను, కెమెరా ముందు ప్రదర్శించిన ఆత్మవిశ్వాసపు వెన్నెల వెలుగులు ప్రస్తుత ఒంటరితనంలోని, వ్యథా హృదయ వేదనను నవ్వులు కురిపించిన కన్నీళ్ల వర్తమానాన్ని చిత్రీకరించారు. "నేను ఎప్పుడూ చెప్పేది ఒక్కటే.. మీరు తెరపై చూసిన, మీకు తెలిసిన నటీనటులు వేరు. మాకు తెలిసినవారు వేరు. అది మీకు చెప్పినా అర్థంకాదు" అంటారు రమాప్రభ.

**(రమాప్రభ(ఇదేనండి నా కథ)-రచన: మోహనవల్లి జింకల; వెల: రూ.200/లు; ప్రతులకు: మోహనవల్లి జింకల, 2-250, ఎఫ్-20, రెడ్డీస్ కాలనీ, మదనపల్లి(ఆం.ప్ర.)-517 325)**

## వైవిధ్యభరిత కథాసంపుటి

మగన్ని మెచ్చిన ఒక చాన, తనను కట్టుకున్నవాడు తనను శారీరకంగా హింసించినా తల్లిదండ్రులకు ఎదురు తిరిగి, ఒర్పుతో, ప్రేమతో భర్త మనసు గెలుచుకోవటం 'మొగలిపూలా గాలి ముత్యాలవాన'. ఆ కథా శీర్షికను, 27 కథలతో కూడిన సంపుటి పతాక శీర్షికగా చెంగల్వల కామేశ్వరి ప్రచురింపచేసారు. మొగలిపువ్వు లాంటి మొగున్ని, మొగలిపూవులా పరిమళించే మగన్ని ఆ కథలో సృష్టించిన రచయిత్రి, కల్పనా వైచిత్రిలో 'మొగలి' ప్రత్యేకత స్పష్టమవుతోంది. చుట్టూ ఉన్న సమాజంలోని వ్యక్తుల జీవన స్థితిగతులు, రచయిత్రికి భావావేశం కలిగించి, కథలుగా రూపుదిద్దుకోవటంతో, ఈ సంపుటి స్వచ్ఛమైన సహజ సౌందర్యంతో చదివింపచేస్తోంది.

గోడ మీద బొమ్మ తొలి కథ, ముగింపు అనూహ్యంగా ప్రతీ కుటుంబ పెద్దనే కాదు, హృదయమున్న చదువరులను కదిలిస్తోంది. ఈ సంకలనంలోని చాలా కథలు వెబ్ మేగజైన్‌లలో ప్రచురితమైనవే. ఆయా కథలలో తెలుగులోని సుపరిచిత సామెతలు, సినిమా పాటల పల్లవులను రచయిత్రి సందర్భం, సమయోచితంగా ప్రయోగించారు. గూడు లభించినా గువ్వ ఎగిరిపోవడం, కొత్తగా పెళ్లైన కుర్రవాళ్లకు పట్టపగలే వెన్నెల భార్యాభర్తల బాంధవ్యాలు, సంఘటనలు కల్పించటంలో నవ్యత చోటు చేసుకుంది. గుప్పెడంత గుండెలో ఉప్పెనంత ప్రేమ పెంచుకోవద్దని స్నేహితురాలి కథ, అదనపు సంపాదన కోసం కొడుకుని వదిలేసిన తల్లికథ 'అమ్మా! నన్నొదిలి పోకమ్మా!' ఈ సంపుటిలోని కథలన్నీ రచయిత్రి కల్పనావైచిత్రి, వైవిధ్యభరిత మానసిక ప్రతిభా స్పందనల ఇతివృత్తాలుగా రూపుదిద్దుకున్నాయి.

**(మొగలిపూల గాలి-రచన: చెంగల్వల కామేశ్వరి; వెల: రూ.200/-లు; ప్రతులకు: కామేశ్వరి చెంగల్వల, ఎస్3, వజ్రమ్మ ఎన్‌క్లేవ్, జెజె నగర్, అల్వాల్, సికిందరాబాద్-500 010)**

## బాలల కథాసంపుటి ..బాలల ప్రపంచం

తెలంగాణ సాహిత్య అకాడమీ, బాల బాలికలలో సాహిత్యాభిలాషను పెంపొందింపచేసే ప్రయత్నంలో భాగంగా, బాలల దినోత్సవం సందర్భంగా కవిత, కథ, పాటల పోటీలు నిర్వహించటమే కాకుండా ప్రచురణకు ఎంపికైన కథలను 'బాలల ప్రపంచం' పేరిట కదంబంగా ప్రచురించటం అభినందనీయం. సాహిత్య అకాడమి కార్యదర్శి డా.నామోజు బాలాచారి, కార్యనిర్వహక ఎడిటర్‌గా ప్రచురింపబడిన ఈ సంపుటిలో 56 కథలున్నాయి. మొదటి బహుమతి పొందిన తాటికల్ పాఠశాల విద్యార్థిని సుంకరబోయిన సంజన రచన 'తాబేలు తెలివి', రెండవ బహుమతి పొందిన చనగాని సాత్విక కథ 'చదువే మార్గం', మూడవ బహుమతి పొందిన కె.సాధన, టి.రిత్విక తేజ కథలు 'లిల్లీ', 'అమ్మమాట' ప్రతీ కథ నైతిక విలువలు, పర్యావరణ పరిరక్షణ, పెద్దల పట్ల, గురువుల పట్ల గౌరవం, విద్య ఆవశ్యకత ఉద్బోధిస్తున్నాయి.

ఊరిలో కోతుల సమస్యను పరిష్కరించిన రమ్య, నిమ్మమొక్కను స్నేహితునిగా పెంచిన రవితేజ, పరీక్షలో కాపీ కొట్టి మార్కులు తెచ్చుకోవటం ఇష్టంలేని గోపి, చెట్టును కౌగిలించుకుని గొడ్డలివేటుకు అడ్డుపడిన లిల్లీ, ఏకాగ్రత, నిబద్ధతో మంచి మార్కులు తెచ్చుకొన్న శారద.. ఇలా ఈ సంపుటిలో ఇంచుమించు అన్ని కథలలోని పాత్రలు బాల బాలికల లేత మనసులలో చివురించే ఆలోచనలను కథారూపాలలో వ్యక్తీకరిస్తున్నాయి. ఆఖరి కథ అమ్మమ్మ చెప్పిన తెలంగాణ కథలో, గుండ్రాంపల్లి గ్రామంలో, ఊరి ప్రజలు రజాకార్ల దుష్టత్వాన్ని చైతన్యవంతంగా ఎదుర్కొన్న కథనంగా ఆ గ్రామ పాఠశాల విద్యార్థి శివరాం రాసిన కథ ఆసక్తిదాయకమైన చారిత్రక వివరాలు చెప్పింది. ఈ ప్రచురణకు గరిపెల్లి అశోక్, వేదాంతసూరి, డా.సమ్మెట విజయ, అమరవాది నీరజ, డా.సగిలి సుధారాణి సంపాదక వర్గంగా వ్యవహరించారు. బాలల దినోత్సవ సందర్భానుసారంగా, జవహర్‌లాల్ నెహ్రూతో బాలబాలికల చిత్రం ఆకర్షణీయంగా ఆకట్టుకుంటోంది. పిల్లలు మొగ్గలవంటివారని, వారిని ప్రేమతో పెంచాలని వారిని ప్రేమించి వారి హృదయాలను గెలవాలని చాచా నెహ్రూ సందేశం ఈ కథల సంపుటికి పరిపూర్ణత చేకూర్చింది.

**(బాలల ప్రపంచం-సాహిత్య అకాడమీ ప్రచురణ; వెల: రూ.100/-లు; ప్రతులకు: తెలంగాణ సాహిత్య అకాడమీ, కళాభవన్, రవీంద్ర భారతి ప్రాంగణం, హైదరాబాద్-500 004)**

– జయసూర్య

## 1 నవంబరు, 2026 నుండి 7 నవంబరు, 2026 వరకు

# వారఫలం
## శ్రీమతి ములుగు శివజ్యోతి
### ప్రముఖ జ్యోతిష్కురాలు

నారాయణ నాయక్ కాంప్లెక్స్, 2వ అంతస్తు,
గాంధీ జ్ఞానమందిర్ వెనుక, కోఠి, హైదరాబాద్–1.
ఫోన్ : 98494 53449, 94409 27795

### మేషం

ఈ వారం ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది. కొత్త కార్యక్రమాలను చేపట్టి సకాలంలో పూర్తి చేస్తారు. ప్రయత్నాలు అనుకూలిస్తాయి. దీర్ఘకాలిక సమస్యలు తీరి ఊరట చెందుతారు. సోదరులను కలిసి ఆనందంగా గడుపుతారు. వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి. మిత్రులతో ఏర్పడిన వివాదాలు సమసిపోతాయి. ఉద్యోగులకు ఇంక్రిమెంట్లు లాభిస్తాయి. రాజకీయ, పారిశ్రామిక, కళారంగాల వారికి విదేశీ పర్యటనలు ఉంటాయి.

### వృషభం

ఈ వారం కొత్త విషయాలు గ్రహిస్తారు. గృహ నిర్మాణ ఆలోచనలు కలిసి వస్తాయి. చర్చలలో పురో గతి కనిపిస్తుంది. మీ మాటల చాతుర్యంతో అందరినీ ఆకట్టుకుని ముందుకు సాగుతారు. పెట్టుబడు లలో లాభాలు పొందుతారు. కుటుంబంలో శుభకార్యాల ప్రస్తావన ఉంటుంది. ఇంటర్వ్యూలలో విజయం సాధిస్తారు. సేవాకార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటారు. నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు.

### మిథునం

ఈ వారం చేపట్టిన కార్యక్రమాలు సాఫీగా సాగుతాయి. చిన్ననాటి మిత్రులను కలుసుకుని ఉల్లాసంగా గడుపుతారు. సేవాకార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటారు. బంధువులనుండి కీలక సమాచారం అందుకుంటారు. మీ ప్రయత్నాలు అనుకూలంగా సాగుతాయి. వ్యవహారాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. సోదరుల నుండి వచ్చిన సమాచారం ఆనందం కలిగిస్తుంది. భూములు, గృహం వాహనాలు కొనుగోలు యత్నాలు ఫలిస్తాయి.

### కర్కాటకం

ఈ వారం ఇంటా బయటా అనుకూలమైన వాతావరణం ఉంటుంది. కొత్త మిత్రులు పరిచయమవు తారు. చర్చలు ఫలిస్తాయి. అందరిలోనూ ప్రత్యేక గౌరవం పొందుతారు. భూములు, భవనాలు, కొనుగోలు చేస్తారు. నూతన విద్యా, ఉద్యోగావకాశాలు లాభిస్తాయి. బంధువులతో కలిసి ఆనందంగా గడుపుతారు. ఉద్యోగులకు ఇంక్రిమెంట్లు రాగలవు. రాజకీయ కళారంగాల వారికి యోగ దాయకంగా ఉంటుంది.

### సింహం

ఈ వారం కొత్త విషయాలు తెలుసుకుంటారు. ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది. దీర్ఘకాలిక ఋణాలు తీరతాయి. పెట్టుబడులకు తగిన లాభాలు పొందుతారు. ప్రత్యర్థులు మిత్రులుగా మారతారు. భూ వివాదాల నుండి బయటపడతారు. వివాహ యత్నాలు ఫలిస్తాయి. వాహనాలు, స్థలాలు కొనుగోలు చేస్తారు. పాత మిత్రులను కలిసి సంతోషంగా గడుపుతారు. ఆకస్మిక ధలలాభం పొందుతారు. అరటినార వత్తులతో నిత్యం దీపారాధన చేయండి.

### కన్య

ఈ వారం ఆర్థిక పరిస్థితి సంతృప్తికరంగా ఉంటుంది. దీర్ఘకాలిక సమస్యలు తీరతాయి. ముఖ్యమైన కార్యక్రమాలు సాఫీగా సాగుతాయి. బంధువుల నుండి కీలక సమాచారం అందుకుంటారు. వృత్తి, వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి. ఉద్యోగులకు హోదాలు దక్కుతాయి. రాజకీయ కళారంగాల వారికి ప్రభుత్వపరంగా ఆహ్వానాలు అందుతాయి. నూతన ప్రయత్నాలలో పురోగతి ఉంటుంది. ఆరోగ్యం పట్ల మెలకువ అవసరం. నిత్యం ఐశ్వర్య నాగినితో స్నానం చేయండి.

### తుల

ఈ వారం సన్నిహితుల నుండి సహాయం పొందుతారు. ఆర్థిక లావాదేవీలు లాభసాటిగా సాగుతాయి. నూతన అవకాశాలు లభిస్తాయి. సభలు సమావేశాలలో చురుకుగా పాల్గొంటారు. వృత్తి, వ్యాపారాలలో ఎదురైన ఆటంకాలు తొలగుతాయి. రాజకీయ, పారిశ్రామిక రంగాల వారికి ప్రభుత్వ పరంగా ఆహ్వానాలు అందుతాయి. నూతన ప్రయత్నాలలో పురోగతి ఉంటుంది. ఆరోగ్యం పట్ల మెలకువ అవసరం. నిత్యం అష్టగణపతి పీఠమునకు సిద్ధగంధముతో పూజించండి.

### వృశ్చికం

ఈ వారం ముఖ్యమైన వ్యవహారాలు ఆలస్యంగా పూర్తి చేస్తారు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉంటుంది. నూతన పెట్టుబడుల విషయంలో నిదానం అవసరం. ఆరోగ్యం పట్ల మెలకువతో వ్యవహరించడం చెప్పదగిన సూచన. నిత్యం అష్టగణపతిని పూజించడండి. సమస్యలు కొంతవరకు తీరతాయి. బంధువుల నుండి శుభవార్తలను అందుకుంటారు. సన్నిహితుల ప్రోత్సాహంతో ముందుకు సాగుతారు. ప్రత్యర్థుల విషయంలో జాగ్రత్తతో మెలగడం చెప్పదగిన సూచన. శ్రీ లక్ష్మీచందనం ధరించండి.

### ధనుస్సు

ఈ వారం వ్యవహారాలు అనుకూలంగా సాగుతాయి. కొత్త కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. సభలు, సమావేశాలలో పాల్గొంటారు. సన్నిహితులు సైతం శత్రువులు గా మారి మిమ్మల్ని అకారణమైన నిందలకు గురి చేస్తారు. నూతన వస్తు, వస్త్రాలు ఆభరణాలు కొనుగోలు చేస్తారు. ఉద్యోగులకు ఎదురైన ఆటంకాలు తొలగుతాయి. రాజకీయ పారిశ్రామిక రంగాల వారికి విదేశీ పర్యటనలు ఉంటాయి. షేర్లు, భూముల క్రయవిక్రయాలలో లాభాలు పొందుతారు. ఆరోగ్యం పట్ల శ్రద్ధ అవసరం. పట్టుదలతో ముందుకు వెళ్ళుతారు.

### మకరం

ఈ వారం చేపట్టిన పనులు నెమ్మదిగా సాగుతాయి. వివాదాలకు, కోపతాపాలకు దూరంగా ఉండండి. వృత్తి, వ్యాపారాలలో ఎదురైన ఆటంకాలు తొలగుతాయి. ప్రత్యర్థులు సమస్యలు సృష్టించినా వాటిని అధిగమించి ముందుకు సాగుతారు. జిల్లేడు వత్తులతో నిత్యం దీపారాధన చేయండి. సోదరుల నుండి సహాయ సహకారాలను అందుకుంటారు. ఉద్యోగంలో స్వల్ప మార్పులు సంభవిస్తాయి. పాత మిత్రుల నుండి ఆహ్వానాలను అందుకుంటారు. క్రయవిక్రయాలలో తొందరపాటు వద్దు.

### కుంభం

ఈ వారం పెట్టుబడులకు తగిన లాభాలు పొందుతారు. ప్రత్యర్థులు కూడా మిత్రులుగా మారి సహాయం అందిస్తారు. ఉద్యోగ, విద్యావకాశాలు లాభిస్తాయి. భూములు, వాహనాలు గృహం కొనుగోలు యత్నాలు సాగిస్తారు. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధిని పొందుతారు. కార్యాలయంలో ఉన్నతాధికారుల మన్ననలు పొందుతారు. కుటుంబ పరంగా నూతనబాధ్యతలను మోయవలసిన పరిస్థితి నెలకొంటుంది. దూర ప్రాంత ప్రయాణాలు లాభిస్తాయి. విదేశాలలో ఉన్న మీ వారి యోగక్షేమాలను ఫోన్ సంభాషణ ద్వారా తెలుసుకుంటారు.

### మీనం

ఈ వారం అనుకున్న పనులలో జాప్యం జరిగినా చివరికి పూర్తి చేస్తారు. సెల్ఫ్ డ్రైవింగ్ విషయంలో జాగ్రత్తలు అవసరం. నిత్యం శక్తికంకణం ధరించడం అన్ని విధాలా మంచిది. కష్టానికి తగ్గ ఫలితం దక్కుతుంది. కొన్ని మొండి బాకీలు వసూలవుతాయి. సభలు, సమావేశాలలో చురుకుగా పాల్గొంటారు. ఉద్యోగులకు కొంతవరకు అనుకూలంగా ఉంటుంది. ఆస్తి తగాదాలు తీరి నూతన ఒప్పందాలు కుదుర్చు కుంటారు. సోదరుల నుండి శుభవార్తలు వింటారు. వ్యాపారాలు విస్తరిస్తారు. నిత్యం జువ్వాదితో లక్ష్మీదేవిని అర్చించండి.

ఈ వారం కార్టూన్స్


ఇంట్లో నిన్నంతా ఒక చెప్పు బోర్లా పడి ఉంది
దాని వల్ల ఏమైనా డౌట్..!?
DOCTOR
Zakir...


మా అత్తయ్య అంటే నాకు ప్రాణం...
అందుకే ఆనవాళ్లే పోకి దీనికి పెట్టుకున్నా..!!
Zakir...

కుక్కల్ని కూడా గౌరవించాలి
అని ఏ గ్రంథాల్లో రాసి లేదా చెక్..?!
Zakir...


ఫోటో
చూడు
ఇండోనేషియాలోని
ఫ్లోరెస్ ద్వీపంలో ఉన్న కెలిముటు అగ్నిపర్వతంపై
వున్న మూడు సరస్సులు కొన్ని రోజులు ఆకుపచ్చ,
మరికొన్ని రోజులు నీలం, ఎరుపు ఇలా రంగులు
మారుతూ ఉంటాయి. అగ్నిపర్వతాల్లోని ఖనిజాల
వల్ల సరస్సుల రంగు మారుతుంది.